


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 129

మంగళవారం 30-7-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...

శ్రీలంక జట్టుతో నేడు చివరిదైన మూడో టి20 మ్యాచ్ ఆడనున్న భారత్ - 13లో



రూ.25,000కు చేరి వెనక్కి

రికార్డు స్థాయి నుంచి రివర్స్.. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ -13లో



కేజ్రీవాల్‌కు బెయిల్‌పై తీర్పు రిజర్వు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీఎం కేజ్రీవాల్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వులో ఉంచింది.

వివరాలు 6లో ▸



హేమంత్‌కు ఊరట

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ బెయిల్ రద్దు చేయాలంటూ ఈడీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.


వివరాలు 6లో ▸



నితీశ్ సర్కార్‌కు చుక్కెదురు

రిజర్వేషన్లు 65 శాతానికి పెంచుతూ నితీశ్ ప్రభుత్వం తెచ్చిన సవరణ చట్టం అమలుపై ఉన్న స్టేను తొలగించబోమని సుప్రీం చెప్పింది.

వివరాలు 6లో ▸



వెనిజులాలో మళ్లీ పాత కథే!

వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో ఊహించిందే జరిగింది. అధ్యక్షుడు నికోలస్ మదురో వరుసగా మూడోసారి విజయం సాధించారు.

వివరాలు 6లో ▸


ఆరోగ్యశ్రీకి పొగ

రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవ్.. కేంద్ర పథకంతో సరిపెట్టుకోవాలన్న కేంద్ర మంత్రి పెమ్మసాని

ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు బిల్లులు రావట్లేదు.. రోగులకు చికిత్సలు అందని పరిస్థితి నెలకొందని వ్యాఖ్య

- రూ.25 లక్షల వరకూ వైద్యానికి భరోసానిచ్చిన సంజీవనికి పొగబెట్టేలా బాబు సర్కారు అడుగులు
- రూ.5 లక్షలకే పరిమితమైన కేంద్ర పథకం దయకు వదిలేసి ఆరోగ్యశ్రీ బాధ్యత నుంచి తప్పించుకునే ఎత్తుగడ
- ఇప్పటికే ట్రస్టు నుంచి కాకుండా బీమా పేరుతో అమలు అంటూ మెలిక
- తొలి నుంచి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేలా చంద్రబాబు చర్యలు
- 2014-19 మధ్య చికిత్సలు పెంచకుండా పేదల ఆరోగ్యంతో ఆటలు
- ఆరోగ్యశ్రీకి ప్రాణం పోసిన వైఎస్ జగన్
- చికిత్సలు మూడు రెట్లు.. ఉచిత చికిత్స పరిమితి ఐదు రెట్లు పెంపు
- నాడు టీడీపీ సర్కారు పెట్టిన దాదాపు రూ.700 కోట్ల బకాయిలూ చెల్లింపు
- దేశంలో తొలిసారిగా కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీలోకి చేర్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.. గత ఐదేళ్లూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

2 లో



కోవిడ్‌లో కాపాడారు..

కరోనా చికిత్స పొందిన రోగులు **2,06,721**

743.77 (రూ.కోట్లు) కరోనా చికిత్స కోసం జగన్ సర్కార్ ఖర్చు చేసిన నిధులు



మరో కాంస్యంపై గురి

- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు షూటింగ్ ద్వారానే మరో పతకం వచ్చే అవకాశం ఉంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ భాకర్ – సరబ్‌జోత్ సింగ్‌లతో కూడిన భారత జోడి క్వాలిఫయింగ్‌లో సత్తా చాటి కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది. నేడు కాంస్యం కోసం జరిగే 'ప్లే ఆఫ్' మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడుతుంది.

12 లో



న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయిస్తే సహించం

- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో న్యాయవాది గవాస్కర్‌పై కేసు నమోదు
- దీన్ని ఖండిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదుల విధుల బహిష్కరణ

- వివరాలు 5లో

"స్కీమ్ ఫర్ స్కిల్లింగ్"

నైపుణ్యాలు మెరుగయ్యేనా?

బడ్జెట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

- స్కీమ్ ఫర్ స్కిల్లింగ్ పేరుతో కొత్త పథకం
- ఇంటర్న్‌షిప్ పెంచే విధంగానూ చర్యలు
- ఇండస్ట్రీ, అకడమిక్ గ్యాప్ తగ్గించడమే ప్రధాన లక్ష్యం
- ఉద్యోగాల పెంపు ప్రోత్సాహకాలు లేకపోవడంతో నిరాశ

కేంద్ర బడ్జెట్‌లో.. యువతకు పెద్ద పీట వేశారా? మిలీనియల్స్(1981–1996 మధ్య పుట్టిన వారు)కు.. విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు తీసుకున్నారా? ఇండస్ట్రీ, అకడమిక్ గ్యాప్ తగ్గించి తద్వారా ఇండస్ట్రీ రెడీగా యువతను తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నారా? అంటే.. ఇండస్ట్రీ, అకడమిక్ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కారణం తాజా బడ్జెట్‌లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోణంలో పలు ప్రోత్సాహకాలు, ప్రతిపాదనలు ప్రకటించినా.. ఉద్యోగ కల్పన, జాబ్ మార్కెట్ డిమాండ్ పెంచే ప్రోత్సాహకాలు లేవని కొందరు అంటుంటే... ఐటీఐ నుంచి ప్రొఫెషనల్ డిగ్రీల వరకు అన్ని స్థాయిల్లో యువతకు నైపుణ్యాలు లభించేలా పలు పథకాలు ప్రకటించడం హర్షణీయమని మరికొందరు పేర్కొంటున్నారు.

2 లో





గేట్లు ఎత్తడంతో శ్రీశైలం డ్యామ్ నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ


10 లో

14 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

తాత్కాలిక షెడ్యూల్ విడుదల చేసిన ఎంసీసీ

ఏపీ నుంచి అర్హత సాధించిన 43,788 మంది విద్యార్థులు

- వివరాలు 10లో





విద్యార్థుల జలసమాధిపై ఉన్నతస్థాయి కమిటీ

- ఆదేశించిన కేంద్ర హోంశాఖ
- ఢిల్లీ 'కోచింగ్' ఉదంతంలో మరో ఐదుగురి అరెస్ట్
- పలు కోచింగ్ సెంటర్ల బేస్‌మెంట్లకు సీలు

6 లో

లంక గ్రామాలు అస్తవ్యస్తం

- 12 రోజులుగా వరద నీటితో సహజీవనం
- 12 మండలాల్లో.. 47 గ్రామాల చుట్టూ ముంపు.. మరో మూడు, నాలుగు రోజులు ఇదే పరిస్థితి
- పాడి, ఉద్యాన, ఆక్వా రైతులకు తీరని నష్టం
- వందల ఎకరాల్లో పంటలు కోల్పోయిన రైతులు
- పడవలు దాటి ప్రయాణాలు చేయలేక స్థానికుల ఇబ్బంది

10 లో



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం బూరుగులంక రేవు నుంచి వరద నీటిలో వస్తున్న ప్రజలు



విశాఖ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వలంటీర్లు

మాకు న్యాయం చేయండి

- రాష్ట్ర వ్యాప్తంగా పలు కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో వలంటీర్ల వినతిపత్రాలు
- టీడీపీ ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి
- రూ. 10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి.. ఉద్యోగ భద్రత కల్పించాలి.. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

3 లో

టార్గెట్ పెద్దిరెడ్డి!

ఆ కుటుంబాన్ని మానసికంగా వేధించడమే ప్రభుత్వ పెద్దల లక్ష్యం

- మదనపల్లె అగ్ని ప్రమాదం కేసు పక్కదారి
- వరుస సోదాలు, విచారణ పేరుతో వేధింపులు
- 90శాతం ఫైళ్లు రిట్రీవ్.. మరి కుట్ర కోణం ఏముంటుంది?



14లో

ఇదండీ సంగతి



క్లుప్తంగా...

ఆగస్ట్ 2న కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: ఆగస్ట్ 2న ఉదయం 11 గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం జరుగుతుందని సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. కేబినెట్‌కు సమర్పించాల్సిన ప్రతిపాదనలను ఈ నెల 31న సాయంత్రం 4 గంటల్లోగా సాధారణ పరిపాలన (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.

నేడు గ్రామ, వార్డు సచివాలయ శాఖపై సీఎం సమీక్ష చేసే అవకాశం



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం యథాతథంగా కొనసాగిస్తుందా...లేక ఏమైనా మార్పులు, చేర్పులు చేస్తుందా... అనే విషయంపై మంగళవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సీఎం చంద్రబాబు గ్రామ, వార్డు, సచివాలయ వ్యవస్థపై తొలిసారి మంగళవారం సమీక్ష చేసే అవకాశం ఉంది. ఈ మేరకు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి అంతా సిద్ధం చేశారు.

భూమి పుత్రులను వరించిన 'ఈషా' అవార్డ్స్



అవార్డు గ్రహీతలతో ఈషా ప్రతినిధులు


సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయం చేస్తూ పది మందికి ఆదర్శంగా నిలుస్తోన్న రాష్ట్రంలోని నలుగురు రైతులను ఈషా ఫౌండేషన్ అవార్డులు వరించాయి. 'మట్టిని రక్షిద్దాం' అనే నినాదంతో ప్రతిష్టాత్మకమైన ఈషా ఫౌండేషన్ ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలను పరిరక్షిస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. తమిళనాడులోని వేలూరులో 'దేశీయ సంప్రదాయ వరి, ఆహార మహోత్సవం' పేరుతో ఈషా ఫౌండేషన్ ఈ నెల 28న నిర్వహించిన కార్యక్రమంలో 2023–24 సీజన్‌లో అత్యుత్తమ వ్యవసాయ విధానాలు పాటిస్తూ ప్రకృతి సాగులో ఆదర్శంగా నిలిచిన రైతులకు అవార్డులను ప్రదానం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 11 మందికి ఈ సారి ఈషా ఫౌండేషన్ అవార్డులను ప్రదానం చేయగా, వాటిలో నాలుగు అవార్డులు ఏపీ రైతులకే దక్కాయి. వారిలో రాష్ట్రానికి చెందిన వై.బాబూరావు (గుంటూరు), రంజిత్ కుమార్ (కృష్ణా), జి.రాము(ప.గోదావరి), బి.జగ్గారావు (శ్రీకాకుళం) ఉన్నారు.

ఆగస్ట్ 15 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్



సాక్షి, అమరావతి: నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ల నిర్ధారణకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 15 నుంచి నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్, కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్సీడీ సీడీ) స్క్రీనింగ్ చేపట్టడానికి సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో సోమవారం ఎన్సీడీ సీడీ విభాగంపై ఆయన సమీక్షించారు. 21 ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో కీమో థెరపీని అందుబాటులోకి తీసుకురావాలని, డే కేర్ సెంటర్లను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. టెలీమానస్ సేవలు పొందడానికి ప్రజలు 14416, 18008914416 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విత్తన కంపెనీలతో త్వరలో ఒప్పందం చేసుకుంటాం



సాక్షి, అమరావతి: గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల్లో నాన్ సబ్సిడీ విత్తనాలు, పురుగుల మందుల సరఫరా ఇంకా ప్రారంభం కాలేదని వ్యవసాయ శాఖ సంచాలకుడు ఢిల్లీరావు చెప్పారు. గడిచిన రెండేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా వాటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకోసం త్వరలోనే ప్రైవేట్ విత్తన, పురుగుల మందుల కంపెనీలతో ఒప్పందం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాధ్యమైనంత త్వరగా నాణ్యమైన విత్తనాలను, పురుగుల మందుల సరఫరా చేస్తామన్నారు. సాక్షిలో 'విత్తనాల పంపిణీ హుళక్కే' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై వ్యవసాయ శాఖ స్పందించింది. నకిలీలకు ఆస్కారం లేకుండా నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే విత్తన కంపెనీలు, డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్లలో తనిఖీలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2020–21 నుంచి 2023–24 వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా 1,584.86 క్వింటాళ్ల నాన్‌సబ్సిడీ విత్తనాల పంపిణీ జరిగిందన్నారు.

'స్కీమ్ ఫర్ స్కిల్లింగ్'

నైపుణ్యాలు మెరుగయ్యేనా?



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కోణంలో.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా స్కీమ్ ఫర్ స్కిల్లింగ్ పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం ద్వారా.. రానున్న అయిదేళ్లలో దేశ వ్యాప్తంగా పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు (ఐటీఐ)లను విస్తరించనున్నారు. ఈ క్రమంలో వేయి ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసి ఇండస్ట్రీకి అవసరమైన స్కిల్స్‌ను అందించేలా చర్యలు తీసుకోనున్నారు. దీని ద్వారా రానున్న అయిదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఆయా ట్రేడ్స్‌లో శిక్షణ ఇవ్వడమే కాకుండా.. వారు సంబంధిత విభాగంలో ఉద్యోగ సాధనలో ముందంజలో నిలిచేలా చర్యలు చేపట్టనున్నారు.

ప్రాక్టికల్ నైపుణ్యాలు

స్కిల్ డెవలప్‌మెంట్ కోణంలో కొత్త పథకాన్ని రూపొందించడం, రుణ సదుపాయం, ఇంటర్న్‌షిప్ సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవడాన్ని.. విద్యార్థులకు, యువతకు ప్రాక్టికల్ నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఇంటర్న్‌షిప్ పథకం విషయంలో మరింత స్పష్టత రావాల్సి ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం ఎంఎస్‌డీఈ గణాంకాల ప్రకారం.. 135 ఐటీఐ ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో టెక్నికల్ అనుబంధ ట్రేడ్‌లు (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ తదితర) 60 ఉంటే.. మిగిలినవి నాన్–టెక్నికల్ (ఫ్యాషన్ డిజైన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర) ట్రేడ్‌లు. తాజా స్కీమ్ ప్రకారం.. ప్రస్తుతమున్న ట్రేడ్‌లతోపాటు నూతన ట్రేడ్‌లను అదే విధంగా స్వల్పకాలిక శిక్షణను అందించే విధంగానూ చర్యలు తీసుకోనున్నారు.

మోడల్ స్కిల్ లోన్ స్కీమ్

యువతకు ఉపాధి కల్పించే విషయంలో ఐటీఐలను విస్తరించడమే కాకుండా.. వృత్తి విద్య కోర్సులు చదివే వారికి రుణ సదుపాయం అందించే విధంగా.. మోడల్ స్కిల్ లోన్ స్కీమ్‌ను కూడా ప్రవేశ పెట్టారు. ఈ స్కీమ్ విధానాల ప్రకారం.. వృత్తి విద్య, ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు రూ. 7.5 లక్షల వరకు రుణం అందిస్తారు. దీని ద్వారా ఏడాదికి 25 వేల మంది లబ్ధి పొందుతారని అంచనా వేశారు. వాస్తవానికి 2015లోనే స్కిల్ లోన్ స్కీమ్ పేరుతో ఒక పథకాన్ని రూపొందించారు. నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్ ప్రకారం వృత్తి విద్యకు సంబంధించి సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ చదువుతున్న వారికి వీటిని అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ మొత్తం రూ. 1.5 లక్షలే ఉండగా.. తాజాగా ప్రతిపాదించిన మోడల్ స్కిల్ లోన్ స్కీమ్‌లో ఈ మొత్తాన్ని రూ. 7.5 లక్షలకు పెంచారు.

గ్రామీణ స్థాయి నుంచే స్కిల్ డెవలప్‌మెంట్

స్కీమ్ ఫర్ స్కిల్లింగ్.. ప్రధాన ఉద్దేశం గ్రామీణ స్థాయి నుంచే విద్యార్థులు, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కల్పించడం. ఇందుకోసం హబ్ అండ్ స్పోక్ విధానంలో ఐటీఐలు శిక్షణ కార్యక్రమాలు అందించనున్నాయి. అంటే.. ఐటీఐలు లేని ప్రాంతంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తమకు సమీపంలోని ఐటీఐలలో తమకు నచ్చిన ట్రేడ్/వృత్తులలో శిక్షణ పొందొచ్చు. వాటిలో నైపుణ్యం పొంది భవిష్యత్తులో జాబ్ మార్కెట్‌లో ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవడం, అదే విధంగా స్వయం ఉపాధి కోణంలోనూ ముందంజలో నిలిచే ఆస్కారం లభించనుంది.

బడ్జెట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్యాంశాలు

- 20 లక్షల మంది యువత లక్ష్యంగా స్కిల్ స్కీమ్
- అయిదేళ్లలో వేయి ఐటీఐల ఏర్పాటు
- ఇంటర్న్‌షిప్ ఔత్సాహికులకు ఏడాదికి రూ. 60 వేల ప్రోత్సాహకం
- అయిదేళ్లలో కోటి మందికి ఇంటర్న్‌షిప్ ప్రోత్సాహకాలు
- ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు

'స్కిల్స్ సరే.. ఉద్యోగాలు ఎక్కడ?



ప్రభుత్వం ప్రకటించిన స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలు, ప్రోత్సాహకాలు పూర్తిగా సప్లయ్ (ఉద్యోగార్థులు) కోణంలోనే ఉన్నాయి. కానీ జాబ్ మార్కెట్ డిమాండ్ పెరిగేలా, సంస్థలు కొత్త ఉద్యోగాలు కల్పించేలా చర్యలు, ప్రోత్సాహకాలు అందించాలి. కొత్త ఉద్యోగాల కల్పన అనేది సంస్థలకు నూతన మార్కెట్ అవకాశాలు లభించినప్పుడు, దాని ద్వారా డిమాండ్ పెరిగినప్పుడే సాధ్యమవుతుంది. స్కిల్లింగ్, అప్రెంటీస్‌షిప్స్, ఇంటర్న్‌షిప్స్ వంటి ప్రోత్సాహకాలతో ఉద్యోగార్థులు నైపుణ్యాలు పొందినా.. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం పొందే అవకాశం లేదు. ఇది సాధ్యం కావాలంటే డిమాండ్ వైపు.. నూతన ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలి.

– టి. మురళీధరన్, చైర్మన్, టీఎంఐ గ్రూప్

ఐటీలోనూ నైపుణ్యాలకు మార్గం

స్కీమ్ ఫర్ స్కిలింగ్ పేరుతో ప్రారంభించనున్న నూతన స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ ఫలితంగా.. వృత్తి విద్య కోర్సులతోపాటు ఐటీ రంగానికి సంబంధించిన నైపుణ్యాలు కూడా పొందే ఆస్కారం లభిస్తుంది. ప్రస్తుతం ఎన్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఐటీ సహా.. 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్.. శిక్షణనిస్తున్నాయి. ఐటీఐలలోనూ ఐటీ అనుబంధ ట్రేడ్‌లలో శిక్షణ లభిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే.. నూతన పథకం ఫలితంగా విద్యార్థులు.. ఇండస్ట్రీ రెడీ స్కిల్స్ సొంతం చేసుకుంటారనడంలో సందేహం లేదు.

– ఎం. సతీశ్ కుమార్, చీఫ్ సపోర్టింగ్ ఆఫీసర్, నాస్కామ్ –ఎన్ఎస్‌డీసీ సెక్టార్ స్కిల్ కౌన్సిల్

కాలేజీలు చొరవ చూపాలి

స్కీమ్ ఫర్ స్కిల్లింగ్, ఇంటర్న్‌షిప్ స్కీమ్‌లు సమర్థవంతంగా అమలయ్యేలా ఇన్‌స్టిట్యూట్స్ చొరవ చూపాలి. బీటెక్ స్థాయిలో మేము ఇంటర్న్‌షిప్ అవకాశాలు తెలియక ఇబ్బంది పడుతున్నాం. దీనికి పరిష్కారంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ తరహాలో ఇంటర్న్‌షిప్ డ్రైవ్స్ నిర్వహిస్తే బాగుటుంది. అదే విధంగా కంపెనీల ప్రతినిధులు, కళాశాలల యాజమాన్యాలు ఉమ్మడి వేదికగా ఇంటర్న్ అవకాశాలు, ట్రైనీ వివరాలు పొందుపరిచే విధంగా చర్యలు తీసుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

– టి. నిఖిల్ భరద్వాజ్, ఎంటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి

ఆరోగ్యశ్రీకి పొగ


కేంద్ర పథకంతో సరిపెట్టుకోవాలని పేదలకు కేంద్ర మంత్రి పెమ్మసాని ఉచిత సలహా


> **ఎంత ఖర్చైనా భరిస్తాం..**
> దురదృష్టవశాత్తూ పేదలు అనారోగ్యం పాలైతే ప్రభుత్వం అండగా నిలవాలి. పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు ఎంత పెద్ద జబ్బు బారినపడినా, వైద్యానికి ఎంత ఖర్చైనా మన ప్రభుత్వమే భరిస్తుంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని వెళితే కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.25 లక్షలు వరకు చికిత్సలు ఉచితంగా అందాలి
> – నాడు సీఎం హోదాలో వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ''ఆరోగ్యశ్రీకి డబ్బులు లేవు! ఆస్పత్రులకు బిల్లులు రావడం లేదు! రోగులకు చికిత్సలు అందని పరిస్థితి! ప్రజలు వైద్యం కోసం ఆయుష్మాన్ భారత్ కార్డును వెంటబెట్టుకుని ఆస్పత్రులకు వెళ్లండి. ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలి. కేంద్ర పథకాన్ని వాడుకుంటే రాష్ట్ర ప్రభుత్వంపైనా భారం తగ్గుతుంది..!'' కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్రంలో పేదలకు ఇస్తున్న ఉచిత సలహా ఇదీ! ఆరోగ్యశ్రీని ఒక గుదిబండలా భావిస్తూ ప్రొసీజర్లు పెంచకుండా పథకాన్ని నిర్వీర్యం చేసిన సీఎం చంద్రబాబు ధోరణికి పెమ్మసాని వ్యాఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాజాగా కేంద్ర మంత్రి హోదాలో పెమ్మసాని మాట్లాడిన మాటలు పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆందోళనకు దారితీస్తున్నాయి. ఏకంగా 3,200కిపైగా చికిత్సలతో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యానికి భరోసా కల్పించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చేసి కేంద్ర పథకం దయాదాక్షిణ్యాలకు రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని వదిలేసినట్లు పెమ్మసాని వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటికి టీడీపీ సర్కారు పెట్టిన ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.700 కోట్ల మేర ఉండగా వాటిని వైఎస్ జగన్ పూర్తిగా క్లియర్ చేశారు. ఈ ఏడాది జనవరి వరకు ఆరోగ్యశ్రీ బకాయిలనూ పెండింగ్ లేకుండా చెల్లించి అటు ఆస్పత్రులకు ఇటు ప్రజలకు జగన్ సంపూర్ణ విశ్వాసం కల్పించారు. ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల చెల్లింపులకు బ్రేక్ పడింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 2 నెలలు కావస్తున్నా రూ. 1,600 కోట్లకుపైగా ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో వైద్య సేవలకు గండం ఏర్పడింది.

పడకేసిన పథకానికి ప్రాణం..

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఏపీలో కోటిన్నర కుటుంబాలకు ఆపద్బాంధవిగా నిలిచింది. 2014–19 మధ్య టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీకి వైఎస్ జగన్ అధికారంలో ఉండగా ప్రాణం పోశారు. ఆరోగ్యశ్రీ అంటే వైఎస్సార్, వైఎస్ జగన్ గుర్తుకొచ్చేలా గత ఐదేళ్లుగా ఈ పథకం అమలైంది. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా ద్వారా 70 లక్షల మంది రూ.14,470 కోట్ల మేర ప్రయోజనం పొందారు. వారి ముద్రను చెరిపి వేయాలనే తలంపుతో ఆరోగ్యశ్రీ పథకాన్ని కనుమరుగు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ స్థానంలో బీమా పేరిట ప్రైవేట్ కంపెనీని జొప్పించే యత్నం చేస్తున్నారు. ఇది కొనసాగుతుండగానే కేంద్ర పథకాన్నే





నమ్ముకోవాలని చెప్పడం ద్వారా ప్రభుత్వ అంతర్యాన్ని పెమ్మసాని ఆవిష్కరించారు. రూ.25 లక్షల వరకూ వైద్య సేవలందించే ఆరోగ్యశ్రీని కాదని రూ.5 లక్షల మేర హెల్త్ కవరేజీ ఉండే ఆయుష్మాన్ పథకాన్ని వినియోగించుకోవాలంటూ సూచించడం దారుణమని వైద్య ఆరోగ్య రంగ నిపుణులు పేర్కొంటున్నారు. కేంద్రం ఇచ్చే నిధులతో మొక్కుబడిగా బీమా అమలు చేయనున్నట్లు చెబుతున్నారు.

బీమా కంపెనీల చక్కర్లు..

ఆరోగ్యశ్రీ ట్రస్టు స్థానంలో బీమా పథకాన్ని ప్రవేశపెట్టేందుకు కూటమి సర్కారు సన్నద్ధమైన నేపథ్యంలో ఇటీవల ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో 2014–19 మధ్య నామినేటెడ్ పదవిలో కొనసాగిన టీడీపీ నేత ఆధ్వర్యంలో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. ఓ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీకి బాధ్యతలప్పగించేలా సమావేశాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. మరికొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలూ టెండర్లలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులు ఎంత మంది ఉంటారు? కొన్నేళ్లుగా పథకం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది? వైద్య సేవలు, ఇతర వివరాల కోసం ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయం చుట్టూ బీమా కంపెనీల ప్రతినిధులు చక్కర్లు కొడుతున్నారు.

ప్రైవేట్ వైపే మొగ్గు..

గతంలోనూ విద్య, వైద్య రంగాలను ప్రైవేట్ పరం చేయటమే లక్ష్యంగా చంద్రబాబు పాలన కొనసాగించారు. తొలి నుంచీ ఈ రంగాల్లో ప్రభుత్వ భాగస్వామ్యం నామమాత్రంగా ఉండేలా వ్యవహరించారు. వ్యాధులన్నింటినీ ఆరోగ్యశ్రీలో చేర్చడంతోపాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలు, చికిత్స, ఆపరేషన్ సౌకర్యం కల్పిస్తామంటూ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి అనంతరం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు. 2007లో వైఎస్సార్ హయాంలో 942 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి పథకాన్ని ప్రారంభించగా అనంతరం చంద్రబాబు సర్కారు ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చింది. తాజాగా బీమా రూపంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టబోతున్నారు.

లాభాపేక్షతో సేవలకు గండం

ప్రస్తుతం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తుండగా కొత్త విధానంలో లబ్ధిదారుల వారీగా ప్రభుత్వం ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా వైద్య సేవల కల్పన చేపట్టాలని యోచిస్తున్నారు. ఇప్పటి వరకూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వమే నేరుగా పథకాన్ని అమలు చేయడంతో ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. ఇన్సూరెన్స్ ఏజెన్సీల చేతుల్లోకి వెళితే లాభాపేక్షతో ప్రజలకు వైద్య సేవలు ప్రశ్నార్థకంగా మారుతాయి. ట్రస్టు పర్యవేక్షణలో ఉంటే అందులో ఎంపానెల్డ్ అయిన ఆస్పత్రులు ఏ ప్రొసీజర్‌కు అయినా నిర్దేశించిన ధర ప్రకారమే వైద్య సేవలు అందిస్తాయి. అంతకు మించి ప్రజల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడేందుకు వీలుండదు. వసూళ్లకు పాల్పడితే జిల్లా స్థాయిలో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ట్రస్టు సీఈవో ఆధ్వర్యంలో ఆస్పత్రిపై చర్యలు తీసుకునేందుకు ఒక వ్యవస్థ ఉంటుంది. అదే ప్రైవేట్ ఇన్సూరెన్స్ ఏజెన్సీలు రంగంలోకి దిగితే ఆస్పత్రులపై ప్రభుత్వ నియంత్రణ పోతుంది. ఇష్టారాజ్యంగా బిల్లులు వేసి ప్రజల నుంచి అదనపు వసూళ్లు చేస్తాయి.

గత ఐదేళ్లూ నిశ్చింత..

ఆరోగ్యశ్రీ పథకాన్ని గత ఐదేళ్లలో బలోపేతం చేసిన వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలతో ప్రజల ఆరోగ్యానికి నిశ్చింత కల్పించారు. 2019 ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి రాగానే రూ.5 లక్షల లోపు వార్షికాదాయ కుటుంబాలను పథకం పరిధిలోకి తెచ్చారు. 2019కి ముందు వెయ్యి లోపు మాత్రమే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా వైఎస్ జగన్ ఏకంగా 2,371 ఆస్పత్రులకు పథకాన్ని విస్తరించారు. అనంతరం చికిత్స వ్యయ పరిమితిని రూ.5 లక్షలు నుంచి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.25 లక్షలకు పెంచారు. టీడీపీ హయాంలో కేవలం 1,059 చికిత్సలతో అస్తవ్యస్తంగా ఉన్న ఆరోగ్యశ్రీకి ప్రాణం పోసి ప్రొసీజర్లను ఏకంగా 3,257కి పెంచారు. ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఉచితంగా చికిత్సలు అందించి పథకానికి రూ.13 వేల కోట్లకు పైగా వెచ్చించారు. అంతేకాకుండా శస్త్ర చికిత్సలు జరిగిన 24.59 లక్షల మందికి కోలుకునే సమయంలో జీవన భృతికి ఇబ్బంది లేకుండా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1,465 కోట్లకుపైగా సాయం అందించారు. ఇక దేశంలోనే తొలిసారిగా కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చి విపత్తు వేళ ప్రజలకు కొండంత భరోసా కల్పించారు.

ఆస్పత్రుల అభివృద్ధికి నిధుల్లేవు: మంత్రి సత్యకుమార్



అనంతపురం మెడికల్: ప్రస్తుతం ఆర్థిక వనరులు లేవని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఆలస్యంగానైనా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చెప్పారు. వైద్య కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సోమవారం ఆయన అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిని తనిఖీ చేసి.. ఆస్పత్రి అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలు మంజూరయ్యాయి. మొదటి విడతలో 5 కాలేజీలు ఏర్పాటయ్యాయి. అందులో మూడు కాలేజీలకు సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీం కింద కేంద్రం రూ.576 కోట్ల నిధులిచ్చింది. అలాగే 11 కాలేజీలకు నాబార్డు ద్వారా నిధులు, మరో 3 కాలేజీలకు దీర్ఘకాలిక వడ్డీ లేని రుణాలు ఇచ్చింది. రెండో విడతలో మదనపల్లె, పులివెందుల, పాడేరు, ఆదోని, మార్కాపురం కాలేజీలను నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీ చేసి.. మౌలిక సదుపాయాలు లేవని అనుమతి నిరాకరించింది. అన్ని చోట్ల ఆస్పత్రులను నిర్మించి.. కళాశాలలను నిర్మించలేదు. వీటి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం చెల్లించలేదు. మదనపల్లె వైద్య కళాశాలలో పోస్టుల నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బంధువులు, అనుచరులకే పోస్టింగ్‌లు కేటాయించారు' అని ఆరోపించారు. పులివెందుల కాలేజీలో 48 శాతం సిబ్బంది కొరత ఉందని.. కాలేజీ పనులను పూర్తి చేయలేదని చెప్పారు. మొత్తం రూ.9 వేల కోట్ల పనులు జరగాల్సి ఉండగా.. రూ.2,100 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఆ భారం తాము మోయాల్సి వస్తోందన్నారు. రానున్న రోజుల్లో పీపీపీ పద్ధతిలో నైనా బోధనాస్పత్రుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మందులు అందుబాటులో లేని మాట వాస్తవమే

ఏపీఎంఎస్ఐడీసీ వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో కొన్ని రకాల మందులు, సర్జికల్స్ అందుబాటులో లేని మాట వాస్తవమేనని వైద్య శాఖ తెలిపింది. రాష్ట్రంలో మందులు, సర్జికల్ కొరతపై 'ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత' శీర్షికతో 'సాక్షి' ప్రధాన సంచికలో సోమవారం ప్రచురించిన కథనానికి ఏపీఎంఎస్ఐడీసీ వివరణ ఇచ్చింది. కొన్ని రకాల మందులు, సర్జికల్స్ అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. జూలై, ఆగస్ట్, సెప్టెంబర్‌లకు కేటాయించిన బడ్జెట్‌లో ప్రభుత్వ బోధనాస్పత్రులకు మందులు, సర్జికల్స్ రోజువారీ సరఫరా కొనసాగుతున్నట్లు తెలిపింది.

సెక్రటేరియట్ ఉద్యోగులకు 24 శాతం హెచ్ఆర్ఏ

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయ ఉద్యోగులతోపాటు శాఖాధిపతుల ఉద్యోగుల హెచ్ఆర్ఏ (ఇంటి అద్దె అలవెన్స్) 24 శాతం చెల్లింపును మరో ఏడాది పాటు కొనసాగిస్తూ ఆర్థిక శాఖ కార్యదర్శి జానకి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్ఆర్ఏ 24 శాతానికి సంబంధించి గతంలో జారీ చేసిన జీవో గడువు ఈ ఏడాది జూన్‌తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు సచివాలయ, శాఖాధిపతుల కార్యాలయాల ఉద్యోగులకు వచ్చే ఏడాది జూన్ వరకు హెచ్ఆర్ఏ 24 శాతం కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 12వ పీఆర్సీ సిఫార్సులు ఇంకా రాని నేపథ్యంలో హెచ్ఆర్ఏను జూన్ 2025 వరకు పొడిగించారు.

క్లుప్తంగా...

పెండింగ్ బిల్లులు చెల్లించండి: ఆప్టా




సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ట్రెజరీలో అప్రూవ్ అయి, సీఎఫ్ఎంఎస్‌లో ఉండిపోయిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్‌రావు తెలిపారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ బిల్లు నంబర్లు మారుతున్నందున సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీలకు నిధులను విడుదల చేయండి

సర్పంచ్‌ల సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పలు ప్రభుత్వ శాఖల నుంచి విధిగా రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని తగిన చర్యలు గ్రామ సర్పంచుల సంఘాల ప్రతినిధులు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొత్తగా పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన రాష్ట్ర సర్పంచుల సంఘాల ప్రతినిధులతో సోమవారం సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ..కేంద్రం గ్రామ పంచాయతీలకు విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత గడువులో ఆయా గ్రామ పంచాయతీలకు ఎప్పటికప్పుడు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్రం తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా 5వ ఆర్థిక సంఘం చేసే సిఫార్సులకనుగుణంగా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులను కేటాయించేందుకు సహకరించాలంటూ విజ్ఞప్తి చేశారు. అలాగే, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ప్రతినిధులు కూడా కృష్ణ తేజను కలిసి తమ ఉద్యోగ సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వర్ల శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రమేష్ తెలిపారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సాక్షి, అమరావతి: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విజయవాడ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.నవ్యను సోమవారం కలిసిన ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. గిరిజన సంక్షేమ శాఖలో మంజూరైన డిప్యూటీ డీఈవో, డీఈవో పోస్టులను త్వరితగతిన అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో జాప్యం చేస్తున్న అన్ని పదోన్నతులను కల్పించాలని, భాషా పండితులు 417 పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని నవ్యకు విన్నవించారు.

ఆర్టీసీ గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఈయూ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 129 ఆర్టీసీ గ్యారేజ్‌ల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) ప్రభుత్వాన్ని కోరింది. గ్యారేజీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, 2011 మార్గదర్శకాల ప్రకారం మెకానికల్ సూపర్ వైజర్లను నియమించాలని కోరింది. సరికొత్త టూల్‌కిట్స్ అందించడంతోపాటు గ్యారేజీలలో మౌలిక వసతులు, ఉద్యోగులకు సదుపాయాలు పెంపొందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ, ఈడీలకు వినతి పత్రాలు సమర్పించినట్టు ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీ శాక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా పోస్టుల భర్తీ

వైద్యశాఖ మంత్రికి ఉద్యోగుల ఫిర్యాదు

సాక్షి, అమరావతి: నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్)లో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్‌తో పాటు, ఇతర పోస్టులను మాజీ పీడీ డాక్టర్ రాజేంద్రకుమార్ భర్తీచేశారని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు పలువురు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్ట్ విధానంలో ఆర్‌వోఆర్‌ను పాటిస్తూ పోస్టులను భర్తీచేయాలని న్యాకో ఆదేశించగా.. నోటిఫికేషన్ ఇవ్వకుండానే అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీచేశారని ఆరోపించారు.

మాకు న్యాయం చేయండి

రాష్ట్ర వ్యాప్తంగా పలు కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో వలంటీర్ల వినతిపత్రాలు

- ఎన్నికల హామీలను నెరవేర్చాలి
- రూ. 10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



సాక్షి, అమరావతి/మహారాణిపేట(విశాఖ): వలంటీర్లకు జూన్ నెల గౌరవ వేతన బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వలంటీర్ల ప్రతినిధులు జిల్లా కలెకరేట్లతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఆయా వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, వారి గౌరవ వేతనాన్ని రూ. 5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల ముందు చంద్రబాబు బహిరంగ సభలలో చెప్పడంతో పాటు మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, ప్రతి నెలా ఇచ్చే సామాజిక పింఛన్లను.. 2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి వారే క్షేత్రస్థాయిలో సమర్థంగా పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం మొదటిసారి ఇచ్చిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లను దూరంగా పెట్టి, గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా నిర్వహించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మొదలయ్యే పింఛన్ల పంపిణీ కూడా వలంటీర్లతో సంబంధం లేకుండా సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా లక్షన్నర మంది వలంటీర్లు విధుల్లో కొనసాగుతుండగా, వారిలో దాదాపు 75 శాతం మందికి జూన్ నెల గౌరవ వేతనం ఇప్పటి వరకూ కూడా అందలేదని వలంటీర్ల సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 10 వేలు వేతనం ఇవ్వాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ. 10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వలంటీర్లు సోమవారం విశాఖ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వలంటీర్లు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై టీడీపీ నేత పల్లె అనుచరుల దుశ్చర్య

చీరలాగి, సెల్‌ఫోన్ లాక్కున్న ఆ పార్టీ నాయకులు



కన్నీరు పెట్టిన అంగన్‌వాడీ కార్యకర్త

పుట్టపర్తి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండలం నారసింపల్లి తండాకు చెందిన మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఎస్టీ కులానికి చెందిన సుహాసినిపై టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అనుచరుడు ఆంజనేయులు బలాత్కారానికి యత్నించాడు. వివరాల్లోకి వెళితే సుహాసిని కుమార్తె కదిరిలో చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి కుమార్తెను ఇంటికి తీసుకొస్తుండగా.. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో నాయనా కోట తండాలో కాపుకాసిన పల్లె అనుచరుడు ఆంజనేయులు, అతని కుటుంబ సభ్యులు సుహాసిని చీర లాగి బలాత్కారం చేయబోయారు. ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కున్నారు. అడ్డొచ్చిన ఆమె తల్లిపై దాడిచేసి చేయి విరగ్గొట్టారు. కులం పేరుతో దూషించారు.

తోటి కార్యకర్తను కాపాడిందని..

ఓడీచెరువు మండలం వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును తన కుటుంబ సభ్యులకు ఇప్పించుకోవాలని ఆంజనేయులు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని వేధింపులకు గురి చేశారు. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఈ నెల 27న ఆత్మహత్యకు ప్రయత్నించింది. అంగన్‌వాడీ కేంద్రంలోనే సెల్ఫీ వీడియో తీసి ఆంజనేయులు ఆగడాలను వివరిస్తూ పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పక్క గ్రామమైన నారసింపల్లి తండాకు చెందిన మినీ అంగన్‌వాడీ కార్యకర్త సుహాసినికి విషయం తెలియడంతో వెంటనే సదరు కేంద్రానికి వెళ్లి తోటి వారితో కలిసి నాగమణిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగమణి పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. కాగా.. నాగమణిని రక్షించిందనే కోపంతో సుహాసినిపై పల్లె అనుచరుడు ఆంజనేయులు దాష్టీకానికి ఒడిగట్టాడు. బాధితురాలు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సుహాసిని, కుటుంబ సభ్యులు, సీఐటీయూ నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి చేసిన ఆంజనేయులు, అతని కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, గౌరవాధ్యక్షుడు వెంకటేష్, అధ్యక్షుడు మహబున్నీషా, కోశాధికారి శ్రీదేవి,కార్యదర్శి దిల్షాద్ పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్'పై బాబు యూటర్న్

- పథకాల అమలుపై నోరెత్తని పవన్
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఫైర్



సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించిన 'సూపర్‌సిక్స్' హామీలపై సీఎం చంద్రబాబు ఎప్పలాగే యూటర్న్ తీసుకున్నారని.. అందుకే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తే, భయమేస్తోందంటూ డ్రామాలు ఆడుతున్నారని మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఫైర్ అయ్యారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు ఆ మాట అన్నా.. కూటమి భాగస్వామి అయిన పవన్‌కళ్యాణ్ కనీసం నోరు మెదపలేదని ఆయన ఆక్షేపించారు. టీడీపీ కూటమి ప్రకటించిన పథకాల అమలు సాధ్యం కాదని, ఎన్నికల ముందు తాము పేర్కొన్నా.. తనకు సంపద సృష్టించడం తెలుసంటూ, చంద్రబాబు గొప్పలు చెప్పి, ఇప్పుడు కాడి వదిలేశారని మండిపడ్డారు. సంపద సృష్టించడం అంటే, అప్పులు చేయడమేనా? అని ప్రశ్నించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

మోసం చేసింది..

'ఇసుక ఉచితమన్నారు కానీ, గతంలో మా ప్రభుత్వ హయాంలో కంటే, ఎక్కువ ధరకు సరఫరా చేస్తున్నారు. తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది అమలుచేయడంలేదన్నారు. రైతులు ఖరీఫ్ సాగు ప్రారంభించినా, వారికి ఇప్పటివరకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు. అలాగే, పిల్లలకు ఫీజులు చెల్లించలేదు.. చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయం కూడా ఇవ్వలేదు. ఇలా.. అన్ని వర్గాలను టీడీపీ కూటమి ప్రభుత్వం మోసం చేసింది. మాట తప్పడం చంద్రబాబు నైజం. అందుకు ఈ 50 రోజుల పాలనే ఉదాహరణ. ఇప్పుడు టీడీపీ, ఎన్డీఏ కూటమిలో ఉన్నా, ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమైంది. రాజధాని పనుల కోసం రూ.15 వేల కోట్లు, రుణంగా సమకూరుస్తామని చెబితే, ఆ నిధులు సాధించినట్లు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో గత 50 రోజులుగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది' అని ధ్వజమెత్తారు.

అసలైన దోషులను అరెస్ట్ చేయాలి

- ఎస్పీని కోరిన రషీద్ తల్లిదండ్రులు
- నిందితులను కాపాడే యత్నం: బొల్లా



మీడియాతో మాట్లాడుతున్న రషీద్ తల్లి బడేబీ, మాజీ ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: తమ కుమారుడి హత్యలో ప్రమేయం ఉన్న వారి పేర్లు చెప్పినా ఇప్పటివరకు తమకు న్యాయం చేయలేదని వినుకొండలో హత్యకు గురైన రషీద్ తల్లి బడేబీ ఆవేదన వ్యక్తం చేశారు. వారి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చి.. వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు రషీద్ తల్లిదండ్రులు పరేషా, బడేబీలు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ బిడ్డను కోల్పోయి తామంతా పుట్టెడు దుఃఖంలో ఉంటే.. తన కుటుంబంపై పరువునష్టం దావా వేస్తామంటూ ఎమ్మెల్యే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఇలా వేధించడం కంటే ఒక్కసారిగా 'మమ్మల్ని కూడా నరికించండి'.. అంటూ విలపించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ 'ఇప్పుడు కొమ్మలే నరికాం.. భవిష్యత్తులో మొదలు నరుకుతాం.. ' అని ప్రకటిస్తున్నారంటే తనను కూడా తుదముట్టించాలనే ఆలోచన వారికి ఉందని.. ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండి తీరతానని స్పష్టం చేశారు. రషీద్ హత్యకు ప్రేరేపించిన వారిని పక్కన పెట్టి ఎవరెవరినో అరెస్ట్ చేశారని విమర్శించారు. అసలైన నిందితులను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. రషీద్ రౌడీషీటర్ అని ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి అతడు సౌమ్యుడని, గొడవలకు వెళ్లే వ్యక్తి కాదన్నారు. తన స్వగ్రామం వేల్పూరులో 30 మంది పోలీసులను పెట్టినా.. టీడీపీకి ఓటేయలేదన్న కారణంతో టీడీపీ శ్రేణులు దాడులు చేస్తున్నాయని బొల్లా ఆందోళన వ్యక్తం చేశారు.

వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయండి

ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ డిమాండ్

సాక్షి, అమరావతి: టీడీపీ నుంచి రెండు సార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ సోమవారం గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. చాంబర్ రాష్ట్ర కమిటీ సోమవారం విజయవాడలో సమావేశమై ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ,ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్, కౌన్సిలర్, కార్పొరేటర్, చైర్మన్, మేయర్ల ఒక నెల గౌరవ వేతనాన్ని అమరావతి అభివృద్ధికి విరాళంగా ఇవ్వాలని తీర్మానించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి తమ సంఘం 16 డిమాండ్ల వినతిపత్రం ఇచ్చి, చర్చించి ఆయా డిమాండ్లను పరిష్కరించ వలసిందిగా కోరాలని తీర్మానించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఏడాదిలో ఒకరోజు తిరుమల శ్రీవారి దర్శనానికి అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ మరో తీర్మానం చేశారు.

దాడిచేసింది వారే.. కేసు పెట్టింది వారే..

- కొత్తకండ్రిగలో ఆగని టీడీపీ మూకల వీరంగం
- వైఎస్సార్‌సీపీ వారిపై దాడి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- బాధితులపైనే కేసుకట్టి జైలుకు పంపిన పోలీసులు
- బాధితుల ఫిర్యాదు తీసుకోని వైనం



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు



దాడిలో గాయపడ్డ చిట్టెమ్మ

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ నేతలు, కార్యకర్తల దాడులు కొనసాగుతున్నాయి. టీడీపీ నాయకుడు గున్నయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన సురేష్, అతడి బావ రాజయ్య, మామ వెంకటయ్య, మరికొందరు ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడిచేశారు. విజయకుమార్, గురునాథ్, చిట్టెమ్మ, బాబు, సుధాకర్‌లను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. బాధితులు ఫోన్ చేయడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు తీసుకువచ్చారు. టీడీపీ నేతల ఒత్తిడితో టీడీపీ వారిని పోలీసులు ఆస్పత్రిలో చేర్చారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఆస్పత్రిలో చేరకుండా అడ్డుకుని వారిని తీసుకెళ్లి రాత్రంతా స్టేషన్‌లో ఉంచారు. సోమవారం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదుచేసి న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టి సబ్‌జైలుకు పంపారు. తీవ్రంగా గాయపడిన చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై మాత్రం కేసు నమోదుచేయలేదు. దీనిపై డీఎస్పీని అడగగా.. విచారించి కేసు నమోదుచేస్తామని తెలిపారు. ఈ నెల 19న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైననాటో డ్రైవర్ ఎర్రయ్యను హత్యచేసేందుకు టీడీపీకి చెందిన సురేష్, మరికొంతమంది ప్రయత్నించారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో పారిపోయారు. 20వ తేదీన ఎర్రయ్య తొట్టంబేడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేయాల్సిన పోలీసులు టీడీపీ నాయకుల బెదిరింపులకు తలొగ్గి సాధారణ కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని టీడీపీ నాయకులను వదిలేశారు.

ఊళ్లోంచి వెళ్లిపొమ్మని బెదిరిస్తున్నారు..

- కూటమి నేతలు ఇళ్లల్లోకి వచ్చి దాడి చేస్తున్నారు
- ఎస్పీ కార్యాలయంలో గుంటూరు జిల్లా గారపాడు మహిళల ఫిర్యాదు



మాట్లాడుతున్న మహిళలు

నగరంపాలెం: కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఆ పార్టీల నేతలు, కార్యకర్తలు తమ ఇళ్లపైకి వచ్చి దాడులు చేస్తున్నారని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామంలోని పల్లెలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. తాము గ్రామంలో బతకలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీలకు చెందిన మహిళలు కూడా తమ ఇళ్లల్లోకి చొరబడి గొడవలకు దిగుతున్నారని, పల్లె విడిచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు బాధితులు కూరపాటి పూర్ణ, పల్లపాటి శృతి, ఏసుపొగుల సింధు, మహాలక్ష్మి, కోటేశ్వరి, బేతపూడి రాణి తదితరులు సోమవారం గుంటూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల ఫిర్యాదుల స్వీకరణలో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన మేరకు.. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ వారిని కవ్విస్తున్నారు. అధికారం మాదే, ఈ ఐదేళ్లు గ్రామంలో ఉండటానికి వీల్లేదు.. వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారు. గత నెల 26న తాను ఇంటివద్ద నిలబడి ఉండగా లైట్లు ఆర్పేసి కర్రలు, సీసాలతో దాడిచేసి కొట్టి గాయపరిచారని కారసాల రంగమ్మ కన్నీరుమున్నీరైంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స చేయించుకున్నట్లు తెలిపింది. ఈ దాడి గురించి స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. గత నెల 24న తన మామ ఏసుపొగుల రవి, మరో పదిమందిపై సీసాలతో దాడి చేశారని మాధవి తెలిపింది. బయట నుంచి తాగునీరు తెచ్చుకోవాలన్నా భయమేస్తోందని చెప్పింది. ఆఖరికి పిల్లలపై పాఠశాలల వద్ద దాడిచేస్తున్నారని పలువురు తెలిపారు. 50కి పైగా కుటుంబాలు గ్రామం బయటే ఉంటున్నట్లు చెప్పారు. కారసాల ఆదాం, పల్లెపు రాంబాబు, శ్యాంబాబు తదితరులు గ్రామం విడిచి వెళ్లారని వారు తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకుని వారిని కట్టడి చేయాలని బాధిత మహిళలు విజ్ఞప్తి చేశారు.

సచివాలయ వ్యవస్థ పై బురద జల్లడం దారుణం

ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల



సాక్షి, అమరావతి: సచివాలయ వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమని ఓ ఉద్యోగ సంఘం నేత వ్యాఖ్యానించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి తప్పుపట్టారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఇదే నాయకుడు సచివాలయ వ్యవస్థ ఒక విప్లవాత్మకమైన మార్పు అని, రాజ్యాంగంలోని 73,74 సవరణలను యథాతథంగా అమలు చేసే స్ఫూర్తితో ఈ వ్యవస్థను తెచ్చిన వైఎస్ జగన్‌కు అభినందనలు తెలిపారని గుర్తు చేశారు. ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం ఉద్యోగులకు నష్టం చేసే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. లక్షల మంది ఉద్యోగులు ఉన్న సచివాలయ వ్యవస్థ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా, ఆ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళనకు గురయ్యేలా ఉద్యోగ సంఘం నేతలు మాట్లాడటం సమంజసమేనా అంటూ ప్రశ్నించారు. ఐఆర్ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని.. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు.. జీపీఎస్ రద్దు ఉత్తర్వు.. ఇలాంటి వాటి గురించి మాట్లాడాలని హితవుపలికారు.

రుణం తప్ప నిధులేవీ?

- కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో చంద్రబాబు విఫలం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి విమర్శ



సాక్షి, అమరావతి: కేంద్రంలోని ఎన్డీఏ కూటమిలో ఉన్నా కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి విమర్శించారు. అమరావతి కోసం రూ. 15 వేల కోట్లు రుణంగా సమకూరుస్తామని చెబితే, దానినే గొప్పగా ప్రచారం చేసుకున్నారని అన్నారు. మరే విషయంలోనూ కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేకపోయినా సీఎం చంద్రబాబు స్పందించడం లేదని ఆక్షేపించారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 50 రోజుల్లోనే అపరిమితంగా అప్పు చేసిందన్నారు. అయినా ఎల్లో మీడియా ఈ అప్పుల విషయాన్ని ఎందుకు ప్రస్తావించడంలేదని నిలదీశారు. ఈ కూటమి ప్రభుత్వం 7 నెలల కోసం కూడా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడంలేదని, బడ్జెట్ ప్రవేశపెట్టే ధైర్యం కూడా చంద్రబాబుకు లేదని అన్నారు. బడ్జెట్ ప్రవేశపెడితే తాను ఎన్నికల ముందు ప్రకటించిన మోసపూరిత హామీలకు కేటాయింపులు చూపాలని, కానీ అలా చూపే పరిస్థితి చంద్రబాబుకు లేదని వివరించారు. చిత్తశుద్ధితో పథకాలు అమలు చేసే అలవాటు చంద్రబాబుకు లేదని విమర్శించారు. గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని అసలు శ్వేతపత్రాల అర్థాన్నే చంద్రబాబు మార్చేశారని అన్నారు.

సంపద సృష్టి అంటే గ్రాఫిక్సే..

రాష్ట్ర అప్పులపై పదే పదే అసత్యాలు వల్లే వేస్తున్న చంద్రబాబుకు సంపద సృష్టి అంటే గ్రాఫిక్సే అని విరూపాక్షి ఆరోపించారు. పెద్ద స్క్రీన్ పెట్టి మీడియాకి, ఎమ్మెల్యేలకు అబద్ధాలు చెబుతూ 'ఇదే నా సృష్టి' అంటారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. గెలిచిన పార్టీ ప్రత్యర్థులను వెంటాడడం, ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలను చంపటం, ఆస్తులు, పంటలు ధ్వంసం చేయడం, పోటీ చేసిన అభ్యర్థుల అక్రమ కేసులు పెట్టడం గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సరికొత్త విధానం తీసుకొచ్చారని అన్నారు. ఇది సమంజసమేనా? అని టీడీపీ నేతలను ప్రశ్నించారు. రేపు టీడీపీ ఓటమి పాలైనప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించుకోవాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పక్కనే అక్రమ క్వారీ

- శ్రీకాకుళం జిల్లాలో యథేచ్ఛగా టీడీపీ నేతల గ్రావెల్ దందా
- వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుతో అడ్డుకున్న అధికారులు



క్వారీయింగ్ స్థలంలో టిప్పర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం పంచాయతీ నారాయణపురం రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 15-2, 3, 4లలో అధికార పార్టీ నేతలు అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారు. ఎచ్చెర్ల తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే జరుగుతున్న ఈ వ్యవహారంపై సోమవారం ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ చిరంజీవి, మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావు తదితరులు వచ్చి ఎనిమిది టిప్పర్లు, జేసీబీ స్వాధీనం చేసుకున్నారు.

మూడు నెలల్లో టిడ్కో ఇళ్లకు సదుపాయాలు

మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ



మంత్రిని నిలదీస్తున్న స్థానికులు

సాక్షి, అమరావతి/తాడికొండ: టిడ్కో ఇళ్లకు మూడు నెలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సీఆర్డీఏ పరిధిలోని మందడం, దొండపాడు గ్రామాల్లో టిడ్కో ఇళ్లను సోమవారం ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్, టిడ్కో ఎండీ సాయికాంత్‌వర్మతో కలిసి మంత్రి పరిశీలించారు. రాజధాని రైతులకు కౌలు డబ్బులు త్వరలోనే విడుదల చేస్తామన్నారు. కాగా, గృహాల పరిశీలన అనంతరం మంత్రి, ఎమ్మెల్యే వెళ్లిపోయేందుకు వాహనాల వద్దకు చేరగా... పలువురు లబ్ధిదారులు 'అలా వచ్చి ఇలా వెళితే సరిపోతుందా.. మా గోడు వినరా' అంటూ నిలదీశారు. దీంతో మంత్రి, ఎమ్మెల్యే వెనక్కి వచ్చి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

రాష్ట్ర అప్పులపై చంద్రబాబు అబద్ధాలు

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



ధర్నాలో చింతామోహన్, కాంగ్రెస్ నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు అబ్బధాలు ఆడుతున్నారని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ మండిపడ్డారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు గ్రాంట్‌గా కాక అప్పుగా ఇస్తామని ప్రకటించిందని అయితే అమరావతి పచ్చని పొలాలు ఉన్న నేపథ్యంలో ప్రపంచ బ్యాంక్ నిబంధనల మేరకు అప్పు ఇవ్వదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పు అంటుంటే రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ మాత్రం రూ.13 లక్షల కోట్లు అప్పు ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంతకుముందు నిరుపేదలు, టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల అంశంపై ఆయన టీటీడీ పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు.



మంటలు, వరదల కన్నా వేగంగా
మృత్యువు మన మీదకు వస్తుంది.
దాని నుంచి తప్పించుకోలేం.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 30 జూలై 2024

అపనమ్మకంతో అభివృద్ధి ఎలా?

వికసిత భారత్ లక్ష్యమనీ, అందుకు వికసిత రాష్ట్రాలు కీలకమనీ కేంద్రం మాట. అందుకు అవరోధంగా రాజకీయంగా వివక్ష కొనసాగుతోందని రాష్ట్రాల ఆరోపణ. అందుకే, రాష్ట్రాల అభివృద్ధి, నిధుల కేటాయింపునకు కీలకమైన నీతి ఆయోగ్ సమావేశంలో బహిష్కరణల పర్వం కొనసాగడం ఆశ్చర్యం అనిపించదు. ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం సాగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ 9వ భేటీకి ఒకటీ రెండు కాదు... ఏకంగా పది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రతినిధులు గైర్హాజరయ్యారు. గత వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాల్లో ప్రాజెక్ట్‌లకు తగినన్ని నిధులు కేటాయించలేదంటూ తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల సీఎంలు భేటీని బహిష్కరిస్తే, పశ్చిమ బెంగాల్ పక్షాన హాజరైన ఏకైక ప్రతిపక్ష పాలిత సీఎం మమతా బెనర్జీ సైతం మాట్లాడనివ్వకుండా మైకు ఆపేశారంటూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనుకున్నట్టే ఆ భేటీ కేంద్రం, రాష్ట్రాల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. నీతి ఆయోగ్ ప్రాథమిక లక్ష్యాలు, పనితీరు పైన చర్చకు పురిగొల్పింది. కేంద్ర, రాష్ట్రాలు పరస్పర నిందారోపణలు మాని, నిజమైన సమాఖ్య స్ఫూర్తిని పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది.

ఈ నీతి ఆయోగ్ వ్యవస్థ ఎన్డీఏ తెచ్చిపెట్టినదే. తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 2014లో కేంద్ర ప్రణాళికా సంఘం స్థానంలో దీన్ని ప్రవేశపెట్టారు. అలా 2015 జనవరి నుంచి ఇది అమలులోకి వచ్చింది. ప్రణాళికా సంఘమైతే పైన కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఏకపక్షంగా విధాన నిర్ణయాలు బట్వాడా చేస్తుందనీ, దానికి బదులు కింది అందరినీ కలుపుకొనిపోతూ, రాష్ట్రాల ఆలోచనలకు పెద్దపీట వేసేందుకు ఉపకరిస్తుందనే ఉద్దేశంతో నీతి ఆయోగ్‌ను పెట్టారంటారు. కానీ, ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతోందన్నది ప్రధాన విమర్శ. వరుసగా మూడోసారి ఎన్డీఏ సర్కారు ఏర్పడిన తర్వాత ఈ జూలై 16న నీతి ఆయోగ్ మేధావి బృందాన్ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ప్రధానమంత్రి మోదీ ఛైర్‌పర్సన్‌గా ఉండే ఈ బృందంలో నలుగురు పూర్తికాలిక సభ్యులతో పాటు, ఎన్డీఏలో భాగస్వాములైన బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన 15 మంది కేంద్ర మంత్రుల్ని ఎక్స్–అఫిషియో సభ్యులుగా చేర్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోమ్ మంత్రి అమిత్‌షా తదితరులు అందులో సభ్యులే.

ఒకప్పటి ప్రణాళికా సంఘంలోనూ లోపాలున్నా... గ్రాంట్ల విషయంలో గతంలో రాష్ట్రాలతో సంప్రతింపులకు వీలుండేది. కానీ, ఇప్పుడు గ్రాంట్లపై ఆర్థికశాఖదే సర్వంసహాధికారం. ప్రణాళికా సంఘం ఉసురు తీసి వచ్చిన నీతి ఆయోగ్ కేవలం సలహా సంఘమైపోయింది. ఎంతసేపటికీ రాష్ట్రాల స్థానాన్ని మదింపు చేయడానికి కీలకమైన సూచికల సృష్టి మీదే దృష్టి పెడుతోంది. రాష్ట్రాలకూ, ఇతర సంస్థలకూ వనరుల పంపిణీ, కేటాయింపులు జరిపే అధికారం లేని వట్టి ఉత్సవ విగ్రహమైంది. వెరసి, కేంద్ర సర్కార్ జేబుసంస్థగా, పాలకుల అభీష్టానికి తలాడించే సవాలక్ష ఏజెన్సీల్లో ఒకటిగా దాన్ని మార్చేశారు. చివరకు 'సహకార సమాఖ్య' విధానానికి బాటలు వేస్తుందంటూ తెచ్చిన వ్యవస్థ అనూహ్యంగా 'పోటాపోటీ సమాఖ్య' పద్ధతికి దారి తీసింది. చివరకు మేధావి బృందపు పాత్ర ఏమిటన్న దానిపైనా ప్రశ్నలు తలెత్తాయి. వాటికీ సరైన జవాబు లేదు. అపనమ్మకం పెరిగితే వ్యవస్థలో చిక్కులు తప్పవని నీతి ఆయోగ్ భేటీ మరోసారి తేటతెల్లం చేసింది.

అభివృద్ధికి సంబంధించిన వైఖరుల్లో పరస్పరం తేడాలున్నా, ప్రధానంగా భౌతిక ప్రాథమిక వసతుల నిర్మాణంపైనే అధికంగా ఖర్చు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ భావనకు సరిపోలేలా రాష్ట్రాలు కృషి చేయాలంటూ నీతి ఆయోగ్ తాజా భేటీలో 20 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధుల్ని ఉద్దేశించి ప్రధాని నొక్కిచెప్పారు. ఆర్థిక కార్యకలాపాలు చురుకుగా సాగాలంటే ప్రాథమిక వసతుల నిర్మాణం ప్రాధమ్యాంశమని కేంద్రం ఆలోచన. అందుకే, జాతీయ అభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్రంతో రాష్ట్రాలు చేతులు కలిపి అటు వసతులకూ, ఇటు సంక్షేమానికీ వనరులు అందుకోవాలని ప్రధాని అంటున్నారు. అయితే, రాష్ట్రాల స్థానిక అవసరాలు, ప్రాధాన్యాలు ఎక్కడికక్కడ వేర్వేరు కాబట్టి, చెప్పినంత సులభం కాదది! పైగా, రాష్ట్రాలన్నిటికీ పెద్దపీటనే మాటకు భిన్నంగా ఆచరణలో పాలకపక్షం తమ ప్రభుత్వాలు ఉన్నచోటనే ప్రేమ చూపిస్తోందనే విమర్శ ఉండనే ఉంది.

కేంద్ర బడ్జెట్‌ను సైతం అదే సరళిలో రాజకీయమయం చేశారని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. తమిళనాట చెన్నై మెట్రో రైల్, కేరళలో విళింజమ్ పోర్ట్ సహా పలు కీలక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లకు నిధులివ్వలేదని ఎత్తిచూపుతున్నాయి. ఈ అనుమానాలు, ఆరోపణలకు సంతృప్తికరమైన సమాధానాలు కేంద్రం వద్ద లేవు. అదే సమయంలో తాగునీరు, విద్యుచ్ఛక్తి, ఆరోగ్యం, పాఠశాల విద్య తదితర అంశాలే అజెండాగా సాగిన ఓ భేటీని బహిష్కరించడం వల్ల రాష్ట్రాలకూ, ప్రజానీకానికే నష్టం. ఆ సంగతి రాష్ట్రాలు గుర్తించాలి. బహిష్కరణను తప్పుబడుతున్న కేంద్ర పెద్దలు కూడా పరిస్థితి ఇంత దాకా ఎందుకు వచ్చిందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. నీతి ఆయోగ్‌ను రద్దు చేసి, మునుపటి ప్రణాళికా సంఘమే మళ్ళీ తేవాలనే వాదన వినిపిస్తున్న వేళ వ్యవస్థాగతంగానూ, పని తీరులోనూ పాతుకున్న లోపాలను తక్షణం సవరించాలి. నిధులను సక్రమంగా, సమానంగా పంచడంలో కేంద్ర ఆర్థిక మంత్రి, బడ్జెట్లు విఫలమవుతున్న తీరును మాటలతో కొట్టిపారేస్తే సరిపోదు. పెద్దన్నగా అన్ని రాష్ట్రాలనూ కలుపుకొనిపోతేనే వికసిత భారత లక్ష్యం సిద్ధిస్తుంది. పన్నుల రూపంలో భారీగా కేంద్రానికి చేయందిస్తున్న ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలూ ఇదే భారతావనిలో భాగమని గుర్తిస్తేనే అది కుదురుతుంది. అందుకు రాజకీయాలను మించిన విశాల దృష్టి అవసరం.

రాజీ మార్గంలో జెలెన్‌స్కీ

విశ్లేషణ



టంకశాల అశోక్

షరతులన్నింటికీ రష్యా అంగీకరిస్తే తప్ప చర్చల ప్రసక్తి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వాదిస్తూ వచ్చారు. స్విట్జర్లాండ్ శాంతి సమావేశాలకు రష్యాను ఆహ్వానించలేదు. అలాంటిది రష్యాతో చర్చలు అవసరం కావచ్చునని అన్నారు. అంతేనా? నవంబరులో నిర్వహించనున్న శాంతి శిఖరాగ్ర సమావేశానికి ప్రతినిధులను పంపవలసిందిగా రష్యాను కోరారు. ఆ రాయబారం కోసమే తన విదేశాంగ మంత్రిని చైనా పంపారు. ఇంతకూ జెలెన్‌స్కీ ఎందుకు చర్చలంటున్నారు? యుద్ధంలో రష్యాది పైచేయి అవుతోంది. ఉక్రెయిన్ ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోంది. పాశ్చాత్య దేశాలు పైకి ఏమన్నా, అంతర్గతంగా విముఖత పెరుగుతోంది. ఈ తరహా సహాయాలకు వ్యతిరేకి అయిన ట్రంప్ అధికారానికి రావచ్చుననే అంచనాలు మరో కారణం.

ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ రష్యాతో రాజీ మార్గం వైపు మళ్లుతున్నారనే మాట ఆశ్చర్యంగా తోస్తుంది. రెండున్నరేళ్ల రాజీలేని యుద్ధం చేసిన ఆయన నిజంగానే ఆ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 20న తమ దేశ ప్రజలను ఉద్దేశించి, రష్యాతో చర్చలు అవసరమని సూచించటం. తాను వచ్చే నవంబరులో నిర్వహించనున్న శాంతి శిఖరాగ్ర సమావేశానికి ప్రతినిధులను పంపవలసిందిగా రష్యాను కోరటం. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి దిమిత్రో కులేబా ఈ నెల 24 నుంచి నాలుగు రోజుల పర్యటన కోసం చైనా వెళ్లి, వారి విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమై, చర్చల కోసం రష్యాను ఒప్పించవలసిందిగా కోరటం.

తమ షరతులన్నింటికి రష్యా అంగీకరిస్తే తప్ప చర్చల ప్రసక్తి లేదని జెలెన్‌స్కీ వాదిస్తూ వచ్చారు. షరతులు తాము విధిస్తాముగానీ, రష్యా ఎటువంటి షరతులు పెట్టరాదన్నారు. యుద్ధం మొదలైన కొత్తలో ఒకసారి జరిగిన చర్చలు రెండు వైపుల నుంచి ఇటువంటి వైఖరులు వల్లనే విఫలమయ్యాయి. ఆ తర్వాత రష్యాపై దౌత్యపరమైన ఒత్తిళ్ల కోసం ఉక్రెయిన్ అనేక ప్రయత్నాయి చేసింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ల ద్వారా అనేక ఆర్థిక ఆంక్షలు విధింపజేశారు. యుద్ధానికి అమెరికా కూటమి ఆయుధ సరఫరాలు, ఆర్థిక సహాయాలు సరేసరి. జూన్ 15–16 తేదీలలో వాషింగ్టన్‌లో జరిగిన నాటో కూటమి 75 సంవత్సరాల ఉత్సవాలలో ఉక్రెయిన్‌కు తిరుగులేని మద్దతు ప్రకటించింది. జెలెన్‌స్కీని అతిథిగా ఆహ్వానించి ప్రసంగింపజేసింది. ఆ తర్వాత జూలై 9న స్విట్జర్లాండ్‌లో జెలెన్‌స్కీ సుమారు 90 దేశాలతో శాంతి సమావేశాలు నిర్వహించి అక్కడ కూడా రాజీ లేకుండా మాట్లాడారు.

అటువంటిది కేవలం 10 రోజులు గడిచేసరికి, రష్యాతో చర్చలు అవసరం కావచ్చునని అన్నారు. మరొక విశేషం ఏమంటే, తను స్వయంగా నిర్వహించిన స్విట్జర్లాండ్ శాంతి సమావేశాలకు రష్యాను అసలు ఆహ్వానించలేదు. ఆ విషయమై ప్రశ్నించిన వారిని అందువల్ల ఉపయోగమేమిటని ఎదురు ప్రశ్నించారు. సరిగా ఆ రోజులలో రష్యా పర్యటనకు వెళ్లి భారత ప్రధాని మోదీని, ఒక రక్త పిపాసిని ఆలింగనం చేసుకున్నారంటూ తీవ్రంగా ఆక్షేపించారు. మోదీని ఢిల్లీలోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ కూడా విమర్శించారు. తీరా జరిగిందేమిటి? రష్యాను ఆహ్వానించకపోవటం వల్ల ప్రయోజనం ఉండదంటూ చైనా కూడా పాల్గొనలేదు. పాల్గొన్న దేశాలలో ముఖ్యమైనవి అనేకం ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేయలేదు. ఆ విధంగా అ సమావేశం ఒక నిష్ఫలయత్నంగా మిగిలింది.

ఇంత జరిగినాక ఇంతలోనే జెలెన్‌స్కీ రష్యాతో చర్చలని అంటూ, రష్యాను ఈసారి చర్చలకు రావలసిందిగా మౌఖికంగా ఆహ్వానిస్తున్నారు. ఆ పని రానున్న రోజులలో లిఖిత పూర్వకంగా చేయగలరని భావించవచ్చు. అయితే, అందుకు మొదటి అడుగు నవంబర్ విస్తృత సమావేశాలలో రష్యా పాల్గొనటం అయితే, అంతా సజావుగా సాగిన పక్షంలో ఇరువురి మధ్య ముఖాముఖి చర్చలు రెండవ అడుగు అవుతాయి. ఈ రెండింటికి సన్నాహక ప్రయత్నాల సమయంలో ఇరువురూ ఏవైనా షరతులు ముందస్తుగానే పెడతారా? షరతులు ఉంటే ఏమిటవి? అనేవన్నీ చిక్కుముడులు. ఈ రాజీ ప్రయత్నాల పట్ల అమెరికా కూటమి వైఖరి ఏమి కావచ్చుననేది అంతకన్న కీలకమైన ప్రశ్న. ఎందుకంటే, రష్యాను ఏ విధంగానైనా లొంగతీయాలన్నది ఉక్రెయిన్ యుద్ధంలోని అమెరికా పరమోద్దేశం. అందుకే నాటోను రష్యా సరిహద్దులకు విస్తరిస్తున్నందున, రాజీ మార్గాన్ని వారు సమ్మతిస్తారా అనే విషయమై చాలామందికి సందేహాలుంటాయి.



ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ

ఇదిట్లుండగా, రష్యాతో చర్చలు అవసరమంటూ జెలెన్‌స్కీ చేసిన ప్రసంగానికి గానీ, ఆయన విదేశాంగమంత్రి కులేబా చైనా వెళ్లి వాంగ్ యీతో ప్రతిపాదించినదానికి గానీ, ఈ వ్యాసం రాసే సమయానికి రష్యా నుంచి ఇంకా ఎటువంటి స్పందనా లేదు. చైనా నుంచి కూడా! వారినుంచి రాగల రోజులలో కనిపించే స్పందనలను బట్టి, మునుముందు ఏమి జరగవచ్చుననే దానిపై కొంత సూచన లభిస్తుంది. చైనా వెళ్లిన కులేబా ఇంతకూ అన్నదేమిటి? వాంగ్‌తో సమావేశం తర్వాత మాట్లాడుతూ, "నిజాయితీగా, సమస్య పరిష్కారానికి దోహదంగా వ్యవహరించే ఉద్దేశం రష్యాకు ఉన్నట్లయితే చర్చలకు తాము సిద్ధమ"న్నారు. రష్యా నుంచి అటువంటి సంసిద్ధత ఇంతవరకు కన్పించలేదని కూడా అన్నారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత, సమస్య పరిష్కారానికి ప్రయత్నించవలసిందిగా జెలెన్‌స్కీ ఒకటి రెండుసార్లు చైనాను బహిరంగంగా కోరారు. కానీ ఆయన విదేశాంగ మంత్రి స్వయంగా వెళ్లటం ఇది మొదటిసారి. చైనా స్వయంగా చొరవ తీసుకుని 12 సూత్రాల పథకం ఒకటి నిరుడు ప్రతిపాదించింది. అది ఉభయులు ఎట్లా యుద్ధ విరమణ చేసి చర్చలు ఆరంభించాలనే దానిపైనే తప్ప, అసలు సమస్య పరిష్కారం గురించి కాదు. తమ భూభాగాల నుంచి రష్యా ఉపసంహరించుకోవాలనే మాట అందులో లేదంటూ ఉక్రెయిన్ అందుకు తిరస్కరించింది. పరిష్కార చర్చలు ఉభయుల మధ్య జరగాలి తప్ప బయటి జోక్యం ఉండరాదన్నది చైనా వైఖరి. చర్చలకు తామెప్పుడూ కాదనలేదని, కాని కొన్ని షరతులు తప్పవన్నది రష్యా వాదన.

నిజానికి రష్యా, ఉక్రెయిన్ రెండు వైపుల నుంచి మొదటి నుంచి కొన్ని గట్టి షరతులే ఉన్నాయి. అమెరికా, నాటోలు తమను చుట్టుముట్టేందుకు నాటోను విస్తరిస్తూ, ఉక్రెయిన్‌ను రెచ్చగొడుతున్నాయనీ, అ దేశాన్ని నాటోలో చేర్చుకొనజూస్తున్నాయనీ, కనుక తమ ఆత్మరక్షణ కోసం ఉక్రెయిన్‌ను నాటోకు బయట ఉంచాలన్నది రష్యా మొదటి షరతు. తమ నౌకలు చలికాలంలో ప్రయాణించేందుకు వీలయ్యే ఏకైక సముద్ర మార్గం బ్లాక్ సీ అయినందున ఆ మార్గం భద్రంగా ఉండేందుకు అక్కడి క్రిమియా ద్వీపం తమ అధీనంలో ఉండాలనేది రెండవ షరతు. ఉక్రెయిన్ తూర్పున రష్యా సరిహద్దులో గల డొనెటెస్క్, లూహాన్స్క్, ఖేర్సాన్, జపోరిజిజియా ప్రాంతాలలో రష్యన్ భాషా సంస్కృతుల వారు పెద్ద మెజారిటీ అయినందున తీవ్ర వివక్షలను ఎదుర్కొంటున్నారని, కనుక ఇప్పటికే పాక్షికంగా తమ ఆక్రమణలో గల ఈ ప్రాంతాలను పూర్తిగా తమకు బదిలీ చేయాలన్నది మూడవ షరతు. ఉక్రెయిన్ వీటన్నింటిని తిరస్కరించటమేగాక, తమ ఆక్రమిత ప్రాంతాలన్నీ తమ స్వాధీనం చేయాలనీ, తాము నాటోలో కూడా చేరగలమనీ షరతులు పెడుతున్నది. రెండు వైపుల నుంచి ఇవన్నీ చాలా చిక్కు షరతులే.

ఇంతకూ జెలెన్‌స్కీ ఇప్పుడు అకస్మాత్తుగా చర్చలు, రాజీలంటూ మాట్లాడటం ఎందువల్ల? క్లుప్తంగా చెప్పాలంటే, యుద్ధంలో రష్యాది పైచేయి అవుతున్నది. పాశ్చాత్య దేశాలు ఎన్ని ఆయుధాలు, ఎంత ఆధునికమైనవి సరఫరా చేసినా చాలటం లేదు. అందులోనూ ఒక పరిమితిని మించితే అది నేరుగా రష్యాతో యుద్ధంగా మారవచ్చునని అమెరికా సందేహిస్తున్నది. ఉక్రెయిన్ ఆర్థిక పరిస్థితులు బాగా క్షీణించటమే గాక, సైనికులు పెద్దఎత్తున చనిపోతూ కొత్త రిక్రూట్‌మెంట్లు తగ్గుతున్నాయి. ఉక్రెయిన్‌కు అంతులేని సహాయాలు, అయినా ఉపయోగం లేకపోవడంతో అమెరికా సహా పాశ్చాత్య దేశాలు పైకి ఏమన్నా, అంతర్గతంగా విముఖత పెరుగుతున్నది. ఈ తరహా యుద్ధాలకు, సహాయాలకు బహిరంగ వ్యతిరేకి అయిన ట్రంప్ ఈసారి అధికారానికి రావచ్చుననే అంచనాలు కొత్త భయాలను కలిగిస్తున్నాయి. ప్రపంచ దేశాలలో మద్దతు తగ్గుతున్నది. స్వయంగా జెలెన్‌స్కీ పట్ల అక్కడి సైన్యంలో, ప్రజలలో నిరసనలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలన్నింటి ఒత్తిడి వల్లనే, ఇక చర్చలు మినహా మార్గం లేదని ఆయన భావిస్తుంటే ఆశ్చర్యమక్కరలేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పోషణ ముఖ్యం



క్రీడల గురించిన చాలా చర్చలు జరుగుతుంటాయి. కానీ దేశంలోని 50 శాతం పిల్లలకు సరైన పోషణ అందకపోవడానికీ, ప్రపంచ స్థాయి అథ్లెట్లను మనం తయారు చేయలేకపోవడానికీ మధ్య ఉన్న సంబంధాన్ని ఎవరూ గుర్తించడం లేదు. అందరికీ సరైన పోషణ అందించని క్రీడా విధానం ఉండకూడదు. అది పరిష్కరించడమే దేనికైనా ప్రారంభం అవుతుంది.

– సరయు పానీ, కాలమిస్ట్

పేదరికమే రోగం



జనాల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అత్యంత హానికారక అంశాల్లో పేదరికం కూడా ఒకటని, చెప్పాలంటే అదే ముఖ్యమైనదని, సైకియాట్రీలో పనిచేసినకొద్దీ నాకు మళ్లీ మళ్లీ అర్థమవుతూ వస్తోంది.

– అహ్మద్ హాంకిర్, ప్రొఫెసర్

ఎదగడం ముందు...



భౌగోళిక రాజకీయాలు ఎప్పుడూ చెడ్డ వార్తల గురించే కాదు. రెండు ఆసియా పెద్ద శక్తులైన చైనా, ఇండియాకు ఇప్పుడు ఆర్థిక వృద్ధి అవసరం. సైనిక ఘర్షణ అనేది వాటికి ఇప్పుడు ప్రయోజనకారి కాదు.

– వెలీనా చకరోవా, జియో పొలిటికల్ స్ట్రాటెజిస్ట్

పెద్ద తలలు ఉండబట్టే...



జమ్ము ప్రాంతంలోని ఇటీవలి దాడుల వెనుక పాకిస్తాన్ అత్యున్నత సైనిక కమాండర్లు ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే, అంత నిర్దుష్టంగా దాడులు జరగడంలో ఆశ్చర్యం లేదు. ఇది యుద్ధ చర్య. ఇండియా తగినట్టుగా స్పందించాలి.

– శేష్ పాల్ వైద్, జమ్ము – కశ్మీర్ మాజీ డీజీపీ

జనం మాట్లాడకుండా...



ఇజ్రాయెల్‌ను ఆక్రమిస్తామని (తుర్కియే అధ్యక్షుడు) ఎర్డోగాన్ బెదిరిస్తున్నారు. దేశంలోని 75 శాతం ద్రవ్యోల్బణం, చితికిపోయిన ఆర్థిక వ్యవస్థ, టూరిజం కుప్పకూలడం లాంటి అంశాల నుంచి జనాల్ని దారి మళ్లించడానికి ఆయన ఏదో ఒకటి చేయాలి! అనాదిగా నియంతల పాత కుయుక్తి ఇది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇన్ బాక్స్

కావడి యాత్రపై ఎందుకీ రభస?

ప్రతి ఏటా శ్రావణ మాసంలో హిందువులు పవిత్రంగా భావించే గంగా జలాన్ని హరిద్వార్ నుండి కావడిలో కాలినడకన తెచ్చి తమ గ్రామాలలోని శివాలయాల్లో అభిషేకం చేయడం పరిపాటి. ఇందుకోసం భక్తులు ఢిల్లీ హరిద్వార్ జాతీయ రాదారిపై లక్షల సంఖ్యలో కాలి నడకన ప్రయాణిస్తారు. శతాబ్దాలుగా ఈ కావడి (కావడ్) యాత్ర జరుగుతోంది. పంజాబ్, రాజస్థాన్, హరియాణా, ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒడిషా రాష్ట్రాల వారు ఈ యాత్రలో పాల్గొంటూ ఉంటారు. హరిద్వార్ నుండే కాకుండా గంగోత్రి, బిహార్‌లోని హజారీబాగ్ దగ్గర్లోని గంగానది నుండి కూడా కావడి పాత్రల్లో జలాన్ని సేకరించి తీసుకువెళుతూ ఉంటారు. ఈ యాత్ర సందర్భంగా భక్తులు ప్రయాణించే ఢిల్లీ–హరిద్వార్ జాతీయ రహదారి పొడవునా ఉన్న దాబాలు, హోటళ్లు; పండ్లు, కూరగాయల బండ్ల పైనా, రేషన్ షాపుల పైనా యజమానులు, పనిచేసే వర్కర్ల పేర్లు రాసి ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక ఉత్తర్వు జారీ చేశారు. దీన్ని చూసి మరో బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రీ ఇదే తరహా ఉత్తర్వు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల జారీలో ఒక వర్గాన్ని దెబ్బతీయడం మరో వర్గానికి మేలు చేయడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యమని అర్థమవుతోంది.

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో యూపీ, ఉత్తరాఖండ్ బీజేపీ ప్రభుత్వాలకు ఎదురుగాలి వీచింది. ఈ యాత్రా మార్గంలో ఉన్న సహరన్‌పూర్ డివిజన్‌లో బీజేపీ ప్రభ తుడిచిపెట్టుకు పోయింది. అంతేకాకుండా శామలి, ముజఫర్‌నగర్ నియోజకవర్గాల్లో 'ఇండియా' బ్లాక్ విజయం సాధించింది. మీరట్‌లో బీజేపీ మెజారిటీ బాగా తగ్గింది. కాంగ్రెస్ గెలుచు కున్న ముజఫర్‌నగర్ సీట్ హరిద్వార్ దగ్గరలో ఉండటం, ఇటీవల ఉత్తరా ఖండ్‌లో జరిగిన ఉపఎన్నికల్లో హరిద్వార్‌ను ఆనుకొని ఉన్న మంగ్లర్, బద్రీనాథ్ అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ గెలవటం; త్వరలో యూపీలో 10 సీట్లలో ఉప ఎన్నికలు జరగనుండడంతో... మెజారిటీ వర్గ ఓట్లను దక్కించుకోవడానికి బీజేపీ వేసిన ఎత్తుగడగా రాజకీయ పరిశీలకులు ఈ ఉత్తర్వుల జారీని భావిస్తున్నారు. మూడేళ్ల క్రితం బీజేపీకి చెందినవారు ముజఫర్ నగర్ ఏరియాలో ఉన్న ముస్లిం హోటళ్ల యజమానుల పేర్లు హోటళ్లపై రాయాలని ఆందోళన చేశారు. ఆ హోటళ్లలో శాకాహారులు భోజనం చేస్తే కలుషితం అవుతారనేది వారి వాదం. 2023లో పోలీసులు ముస్లిం దాబాలను అనధికారికంగా మూసివేయించారు. అయితే యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. దాబాలు, హోటల్స్ కేవలం శాకాహారమా, మాంసాహారమా అని తెలుపుతూ బోర్డులు పెడితే చాలని ఉత్తర్వులిచ్చింది.

– డా॥ కె. సుధాకర్ రెడ్డి, విశ్రాంత లెక్చరర్ । 89850 37713

బహుముఖీన వైదుష్యానికి ప్రతీక

సందర్భం




పూషా దర్భా

రాంషా! ఈ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది 'అభిసారిక' పత్రిక. దాని ప్రచురణకర్తగా, సంపాదకునిగా, పాఠకుల సెక్సు సమస్యలకు, సందేహాలకు ఆత్మీయ పరిష్కారాలు, సలహాలు సూచించే ఒక పెద్ద దిక్కు జ్ఞప్తికొస్తుంది. అంతే కాదు ఆయన ఒక కమ్యూనిస్ట్, అభ్యుదయ కవి, నాటకకర్త, సాహితీ విమర్శకుడు; కథా, నవలా రచయిత, ముద్రాపకుడు! ఇవన్నీ కలగలసిన విశేష వ్యక్తిత్వమే రాంషా!

'రాంషా' అసలు పేరు దర్భా వేంకటరామశాస్త్రి. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట సమీపంలోని వేట్లపాలెంలో 1924 జూలై 30న జన్మించారు. కాకినాడ పిఠాపురం రాజావారి కాలేజీలో ఎఫ్.ఎ. (నేటి ఇంటర్మీడియెట్) చదివే రోజుల్లోనే తొలిరచన 'శిలా ప్రతిమ' నాటికతో పేరు తెచ్చుకుని, 1948లో చోడవరం అఖిలాంధ్ర కవి పండిత పరిషత్తు నుంచి తొలి సన్మానం పొందారు. వేంకట రామశాస్త్రికి 'రాంషా' అనే లేఖినీ నామం ప్రదానం చేసింది ఆ కళాశాల అధ్యాపకులైన సాహితీ మూర్తి 'కళాప్రపూర్ణ' నిడదవోలు వెంకటరావు!

తుర్గినేవ్ రాసిన చిన్నకథను ఆధారం చేసుకుని అల్లిన నవల – 'కామేశ్వరి కథ' 1948లో ప్రచురింపబడి ఎన్నో ప్రశంసల నందుకున్నది. లక్ష కాపీల వరకు ముద్రితమయింది. చరిత్రహీనుల, బాధోపహతుల జీవితాల్ని చిత్రించిన రాంషా కథలెన్నో వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 'గాంధీజీ పెట్టిన భిక్ష', 'ఎర్ర జెండా', 'మత్తానయ్య మరణం', 'ఆడవాళ్ళ సంత', 'కిర్రు చెప్పులు', 'కారుణ్యం' వంటి కథలు రాంషా మార్కు కథాకథన శిల్పానికి, వస్తు వైవిధ్యానికి, శైలీ విన్యాసానికి నిదర్శనాలుగా నిలుస్తాయి. 'లక్షింపతిగారమ్మాయిలు' అనే నాటకం కన్యాశుల్కం తరువాత చెప్పుకోదగ్గ నాటకంగా నాటి సమీక్షకులు పేర్కొన్నారు. కథా రచనా లక్షణాన్ని నిర్దేశిస్తూ, 'కళలు–కథలు' అనే విమర్శ వ్యాసాలు; అలాగే, నవల, నాటకం, కావ్యం, విమర్శ వంటి సాహిత్య ప్రక్రియల మీద కూడా ప్రామాణిక వ్యాసాలు రచించారు. 'కుళ్ళుసరుకు' అనే ప్రబోధాత్మక సాంఘిక నాటకంలో ఒక ముఖ్య భూమికలో నటించి, నటుడిగా మరొక కోణాన్ని కూడా ఆవిష్కరించుకున్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పరిస్థితులకు రాంషా కలం ఝళిపించారు. సోమసుందర్, శశాంక వంటి కవి మిత్రులతో చేయిచేయి కలిపి, కమ్యూనిస్ట్ కార్యకర్తగా శంఖం పూరించారు (1944 –1955). ప్రజా చైతన్యం ప్రజ్వలింపజేయడానికి 'కళాకేళి – ధర్మసంగ్రామకేళి' నినాదంతో 'కళాకేళి ప్రచురణలు' నెలకొల్పారు. సామ్యవాద ఉద్యమ ప్రతిధ్వనులైన ఆరుద్ర 'త్వమేవాహం', సోమసుందర్ 'వజ్రాయుధం' వంటి అగ్రశ్రేణి అభ్యుదయ కావ్యాలకి రాంషా సముచిత ప్రకాశి కలు రాసి ప్రచురించి, వాటికి అద్వితీయ ప్రాచుర్యం కల్పించారు. మరెన్నో గ్రంథాలను ప్రచురించారు.





రాంషా (1924 - 1990) శత జయంతి

ఉద్యమ కాలంలో ప్రభుత్వం 'వజ్రాయుధం' కావ్యాన్ని నిషేధించి, పుస్తకాల్ని జప్తుచేసి, ప్రచురణకర్త రాంషా మీద, ముద్రాపకుల మీద కేసులు పెట్టింది. తీవ్ర నిర్బంధ విధానంలో అభ్యుదయవాదులైన సాహిత్యకారులు, కళాకారులు చెల్లాచెదరయ్యారు. ఆ పరిస్థితుల్లో రాంషా కూడా నిలదొక్కుకోడానికి అనేక కష్టనష్టాల నెదుర్కొన్నారు. అలాంటి సమయంలో ఆప్తమిత్రుడు ధనికొండ హనుమంతరావు కొంతకాలం నడిపి ఆపివేసిన తన 'అభిసారిక' పత్రికను రాంషాకి అందించారు. ఆవిధంగా అభిసారిక పత్రికను స్వీకరించి మరో కొత్త జీవిత అధ్యాయానికి తెర తీశారు రాంషా (1960).

రాంషా నేతృత్వంలో 'అభిసారిక' లైంగిక విజ్ఞాన మాస పత్రిక అచిరకాలంలోనే అసంఖ్యాక పాఠకుల మన్న నలు పొంది, బహుళ ప్రచారంలోకి వచ్చింది. మూఢ విశ్వాసాలు, ఛాందస భావాలతో, అజ్ఞానంలో, అంధకారంలో అల్లాడుతున్న అనేకమంది తెలుగు పాఠకులకు అది వేగుచుక్కగా రూపొందింది. అభిసారిక పత్రిక ద్వారా శాస్త్రీయంగా 'సెక్సు విజ్ఞానాన్ని' పాఠకుల కందజేస్తూ, ఆత్మవిశ్వాసం కోల్పోయి, అనేక మానసిక రుగ్మతలకు లోనై, అశాంతితో, అపోహలతో, సమస్యలతో, సంతాపాలతో సతమతమవుతున్న అసంఖ్యాక వ్యక్తులకు ఆశనీ, ఆత్మస్థైర్యాన్నీ కల్పించి, ఓదార్పునీ, నైతిక బలాన్నీ, నవజీవనాన్నీ ప్రోదిచేసి, వారిని తీర్చిదిద్దే మహోద్యమంలో రాంషా విజయం సాధించారు.

ఆ కృషిలో భాగంగా 1960 నుంచి 1990 వరకు 30 ఏళ్ల కాలంలో ఎన్నో ఉత్తమ సెక్సు విజ్ఞాన గ్రంథాలు రచించారు. అభిసారికలో 'అడగండి చెపుతాను' శీర్షిక ద్వారా వేనవేలమంది వ్యక్తిగత సమస్యలకు పరిష్కారాలు సూచించారు. 'మీట్ ది ఎడిటర్' కార్యక్రమం ద్వారా ఆంధ్ర – ఆంధ్రేతర ప్రాంతాలు పర్యటిస్తూ సలహాలు – పరిష్కారాలు అందజేశారు.

'వాత్స్యాయన కామసూత్రాలు', 'కొక్కోకమ్', 'సెక్సు సైకాలజీ' వంటి 40కి పైగా కామ పురుషార్థ గ్రంథాలు రాశారు. అలాగే మిగతా పురుషార్థాలైన ధర్మార్థమోక్షాల అమృత సారాన్ని కూడా గౌతమ, వశిష్ఠ ధర్మసూత్రాలూ 'జ్ఞాన వాశిష్ఠం', 'న్యాయ దర్శనం', 'సాంఖ్యమ్', 'వైశేషికమ్', 'యోగశాస్త్రం', 'మోక్షశాస్త్రం', 'కౌటిలీయ అర్థశాస్త్రం' వంటి గ్రంథాల రూపంలో తెలుగు వారికి సులభ గ్రాహ్యంగా అందజేశారు. 1990 ఫిబ్రవరి 8న రాజమండ్రిలో ఒక రోడ్డు ప్రమాదంలో అనూహ్యంగా మృతి చెందారు రాంషా. అది అఖిల 'అభిసారిక' పాఠకులకు, సాహితీ మిత్రులకు తీరని లోటు మిగిల్చింది.


వ్యాసకర్త మానసిక సెక్స్ సమస్యల నిపుణులు, 'అభిసారిక' పూర్వ సంపాదకులు

(నేడు కాకినాడలో రాంషా శతజయంతి సభ, 5 రచనా సంపుటాల ఆవిష్కరణ)

మూడు తలల పాము

'గురువర్యా! మీరు అవధిలేని ఆనందం నాలోనే ఉందంటారు. అది నా స్వభావమూ, సొత్తూ అంటారు. కానీ నేను మాత్రం దాన్ని అనుభవించలేక పోతున్నాను. ఏం చేయాలి?'

'శిష్యా! ముందు, అలా అనుభవించలేక పోవడానికి కారణమేమిటో తెలుసుకోవాలి. నిత్య, శుద్ధ, బుద్ధ, చైతన్య స్వరూపుడివైన నీకు, ఈ దేహం ఇంద్రియ–మనో–బుద్ధులతో సంబంధం ఏర్పడి, ఆ శరీరాదులే నేను అనే తాదాత్మ్యతా, భ్రమా ఏర్పడ్డాయి. ఇలా నిన్ను 'నేను–నాది' అన్న పరిమితులలో బంధిస్తున్నది 'అహంకారం' అనే అజ్ఞానం. అది ఆనందమయమైన నీ స్వస్వరూపాన్ని కప్పేస్తున్నది.'



జ్యోతిర్మయం

'మరేం చేయాలి?'

'నీ దగ్గర పెద్ద పెట్టెలో నీ సొంత ధనరాశులు బోలెడున్నాయి. ఒక రోజు తెల్లారి చూసేసరికి, ఒక కాల సర్పం ఆ పెట్టెను చుట్టుకొని విషం చిమ్ముతూ, బుసలు కొడుతున్నది. అప్పుడు నువ్వేం చేయాలి? నిరుపేదనయి పోయానని బిచ్చమెత్తుకుంటూ ఊరంతా తిరుగుతావా? లేక, ఏదో ఒక విధంగా ఆ సర్పాన్ని చంపి నీ సొమ్ము స్వాధీనం చేసుకోవాలా?'

'ఏదో ఒక ఉపాయంతో సర్పాన్ని చంపడమే తెలివి.'

'అదీ విషయం! అహంకారం అనే మూడు తలల పాము, బ్రహ్మానందమనే నీ సొత్తును చుట్టుకొని కూర్చొని ఉంది. దాన్ని వేదాంత జ్ఞానం అనే ఖడ్గంతో నరికివేసి, నీ సొత్తు నువ్వు అనుభవించడం వివేకం!'

'కానీ ఆ సర్పాన్ని నరకగల సామర్థ్యం నాకెలా వస్తుంది?'

'చాలాసార్లు చెప్పాను. అది అభ్యాసం ద్వారా, వైరాగ్యం ద్వారా అబ్బుతుంది. ఇంద్రియాలకు నువ్వు లొంగకుండా, వాటిని నువ్వే అదుపు చేసుకొని, ఇంద్రియ సుఖాలవల్ల లాభం స్వల్పం, క్షణికం; నష్టమే అపారం' అని గ్రహించి, వాటిపట్ల అనాసక్తి పెంచుకోవడం వైరాగ్యం. ఈ నశ్వరమైన దేహాది జడ విషయాలు నీవు కాదనీ, నీవు చైతన్య స్వరూపుడివనీ, శాశ్వతుడివనీ, పరిమితులు లేని సర్వవ్యాపివనే సత్యాన్ని మననం చేస్తూ, ఆ సత్యం మీదే ఏకాగ్రత నిలిపే ప్రయత్నం అభ్యాసం.'

– ఎం. మారుతి శాస్త్రి



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.దశమి రా.6.53 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** కృత్తిక ప.1.25 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.4.53 నుండి 6.25 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.08 నుండి 12.40 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.31.

క్లుప్తంగా...

అఖిల భారత శ్రీకృష్ణదేవరాయల సంఘం కన్వీనర్‌గా వెంకట్



గన్నవరం: అఖిల భారత శ్రీకృష్ణదేవరాయల సంఘం కన్వీనర్‌గా గన్నవరానికి చెందిన సంకాబత్తుల వెంకట్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం అఖిల భారత చైర్మన్, కాపు జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస్‌నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ద్వారా పేదల అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు చెప్పారు. తన సేవలను గుర్తించి కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన శ్రీనివాస్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని తెలగ, కాపు, బలిజల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా వెంకట్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు అభినందించారు.

అవయవదానంతో ముగ్గురికి పునర్జన్మ



రామునాయుడు(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): ఓ వ్యక్తి మరణించినా మరో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించాడు. వివరాల్లోకి వెళితే.. జీవీఎంసీ 69వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఉంటున్న జె.రామునాయుడు (68) బ్రెయిన్‌లో రక్తస్రావం జరగడం వల్ల ఇటీవల స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అవయవదానంపై వైద్య బృందం మృతుడి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో వారు అవయవ దానానికి అంగీకరించారు. దీంతో సోమవారం రామునాయుడు కిడ్నీలు (మూత్ర పిండాలు), లివర్ (కాలేయం)ను కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి దానమిచ్చారు. జీవన్‌దాన్ ఆధ్వర్యంలో అవయవాలను అవసరమైన అందించనున్నట్లు జీవన్‌దాన్ స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

ఐదు నెలల పసికందు కడుపులో పిండం

- ఆపరేషన్ చేసి తొలగించిన గుంటూరు జీజీహెచ్ వైద్యులు



గుంటూరు మెడికల్: ఐదు నెలల వయసు గల పసిబిడ్డకు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 'కృష్ణా జిల్లా బంటుమిల్లి సమీపంలోని పెద్దతుమ్మిడికి చెందిన గడ్డం శోభన్‌బాబు భార్య సుప్రియ ఐదు నెలల క్రితం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ పుట్టిన కొద్దిరోజుల వ్యవధిలోనే ధనుర్వాతం వచ్చి సుప్రియ చనిపోయింది. ఆమె బిడ్డకు ఎదుగుదల లేదు. దీంతో శోభన్‌బాబు తన కుమారుడిని ఈ నెల రెండో తేదీన గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొచ్చాడు. పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ చందా భాస్కరరావు ఆధ్వర్యాన వైద్య పరీక్షలు చేసి బాబు కడుపులో ఉమ్మనీరు సంచి, లివర్, వెన్నుపూస, కాళ్లు, చేతులు, పుర్రె ఆకారం ఉన్నట్లు గుర్తించారు. బిడ్డ కడుపులో మరో బిడ్డ ఏర్పడడం చాలా అరుదు. ఐదు లక్షల శిశు జననాల్లో ఒక శిశువుకు ఇలా ఏర్పడే అవకాశం ఉంది. దీనిని వైద్య పరిభాషలో ఫీటస్ ఇన్ ఫిటోగా పిలుస్తారు. ఈ నెల 10న శిశువుకు క్లిష్టమైన ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న శరీర అవయవాలతో కూడిన గడ్డను విజయవంతంగా తొలిగించారు.' అని తెలిపారు.

పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- అంతర్జాతీయ పులుల దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని టైగర్ రిజర్వు ప్రాంతాల్లో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్‌కళ్యాణ్ చెప్పారు. పులుల సంఖ్య పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా సోమవారం మంగళగిరిలోని అరణ్యభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో జూ పార్కులు అభివృద్ధి చేద్దామని చెప్పారు. నల్లమల, శ్రీశైలం నుంచి శేషాచలం వరకు ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేసి అడవులను పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. వేటగాళ్లను ఉపేక్షించవద్దని చెప్పారు. ఈ సందర్భంగా గ్లోబల్ టైగర్ డే పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబినాయన) ఏర్పాటు చేసిన టైగర్స్ ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, అటవీదళాల అధిపతి చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు ఎ.కె.నాయక్, ఖజూరియా, సుమన్, రేవతి, రాహుల్ పాండే, శాంతిప్రియ పాండే, శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాఘ్రం.. శీఘ్రం



నల్లమలలో పెరిగిన పులుల సంఖ్య

- 87కు చేరినట్టు అటవీ శాఖ వెల్లడి
- రెండేళ్లలోనే 25 పులులు పెరిగాయని నిర్ధారణ

ఆత్మకూరు రూరల్/మార్కాపురం: ఆసియా ఖండంలోనే జీవవైవిధ్యానికి ఓ ప్రత్యేక స్థానం గల నల్లమల అడవుల్లో పెద్ద పులుల సంఖ్య వేగంగా పెరుగుతున్నట్టు అటవీ శాఖ తాజా అంచనాలను బట్టి తెలుస్తోంది. నల్లమలలో 87 పెద్దపులులు ఉన్నట్టు ఆ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఏకే నాయక్, అటవీశాఖ డీడీ విఘ్నేష్ అప్పావ్ సోమవారం వేర్వేరు చోట్ల ప్రకటించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నల్లమలలో ఉన్న పులుల వివరాలను ప్రభుత్వం అధికారికంగా తెలిపిందని చెప్పారు. కేవలం రెండేళ్లలోనే ఇక్కడ 25 పులుల సంఖ్య పెరిగినట్టు స్పష్టం చేశారు. 5,360.22 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) విస్తీర్ణంలో దేశంలోనే అతి పెద్దది. దీనికి అనుబంధంగా ఉన్న నడవా (కారిడార్) అటవీ ప్రాంతాల్లో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల ద్వారా సేకరించిన 3 లక్షల పులుల ఫొటోలను విశ్లేషించిన అనంతరం నల్లమల అటవీ ప్రాంతంలో కనీసం 87కు తక్కువ కాకుండా పెద్దపులులు ఉన్నట్టు తేలిందని ప్రకటించారు. జాతీయ పులుల సంరక్షణా ప్రాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) 2022 అంచనా ప్రకారం ఇక్కడ 62 పులులకు తక్కువ కాకుండా ఉన్నాయని వెల్లడైంది. 2023-24 పర్యవేక్షణ, విశ్లేషణ నాలుగో దశ (ఫేజ్-4) ప్రకారం 87 పెద్ద పులులు ఉన్నట్టు స్పష్టమవడంతో రెండేళ్లలోనే పెద్దపులుల సంఖ్య కనీసం 25 పెరిగినట్టు వెల్లడైంది.

ఆవాస విస్తరణ పెరుగుతోంది

వన్యప్రాణుల వేటను నిరోధించేందుకు యాంటీ పోచింగ్ క్యాంపుల్ని ఏర్పాటు చేసి 800 మందికి పైగా చెంచు గిరిజనులను సంరక్షకులుగా, స్వచ్ఛ సేవకులుగా చెక్‌పోస్టుల్లో నియమించారు. పులుల సంరక్షణలో చెంచు గిరిజనుల పాత్ర కీలకమని, వారి జీవనోపాధికి సహకరిస్తున్నామని నాయక్, విఘ్నేష్ చెప్పారు. నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం నుంచి నల్లమలలో దక్షిణంగా గుండ్ల బ్రహ్మేశ్వరం, లంకమల, శ్రీపెనుశిల నృసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర వన్యప్రాణి అభయారణ్యాల వైపు పెద్దపులుల ఆవాస విస్తరణ పెరుగుతోందని పేర్కొన్నారు. ఇదేకాకుండా పాపికొండలు వన్యప్రాణి అభయారణ్య ప్రాంతంలోకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన రెండు పులులు సంచరించిన చిహ్నాలు కనపడటంతో ఆ ప్రాంతం కూడా పులుల ఆవాస విస్తరణ ప్రాంతంగా ఉండబోతోందని చెప్పారు.

ధాన్యం డబ్బులు ఇవ్వండి బాబూ..



అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాలకు చెందిన రైతులు సోమవారం అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం తక్షణమే తమకు ధాన్యం డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మే నెలలో కొనుగోలు చేసిన రబీ ధాన్యానికి సంబంధించి జిల్లాలో సుమారు 8వేల మంది రైతులకు రూ.279 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని రైతు నాయకులు తెలిపారు. జేసీ నిషాంతి రైతులతో చర్చించి ధాన్యం సొమ్మును వారం రోజుల్లోపు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బీకేఎస్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారి చినవెంకటరమణ, నాలుగు మండలాల రైతులు పాల్గొన్నారు. – అమలాపురం రూరల్

టోఫెల్ శిక్షణ ఎత్తివేత

నెలన్నర ఆలస్యంగా పాఠశాల విద్యా కేలండర్ విడుదల

- ఈ విద్యా సంవత్సరంలో 232 పనిదినాలు.. 88 సెలవులు
- ఆగస్టు 27 నుంచి 31 వరకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్
- వచ్చే ఏప్రిల్ 7 నుంచి 17 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు
- జనవరి 11 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పరీక్షల షెడ్యూల్ ఇదీ..

ఆగస్టు 27- 31	ఎఫ్‌ఏ-1
అక్టోబర్ 21- 25	ఎఫ్‌ఏ-2
నవంబర్ 25- డిసెంబర్ 4	ఎస్‌ఏ-1
జనవరి 27-31	ఎఫ్‌ఏ-3
ఫిబ్రవరి 10-20	పదో తరగతి
ప్రీ ఫైనల్	
మార్చి 3-7	ఎఫ్‌ఏ-4
ఏప్రిల్ 7-17	ఎస్‌ఏ-2

ఈ తేదీల్లో 1 నుంచి 8 తరగతులకు సీబీఏ (కరిక్యులమ్ బేస్ట్ అసెస్‌మెంట్), తొమ్మిది, పది తరగతులకు పరీక్షలు నిర్వహిస్తారు.

సాక్షి, అమరావతి: పాఠశాలల విద్యా బోధనలో కీలకమైన నూతన విద్యా సంవత్సరం (2024-25) కేలండర్‌ను నెలన్నర ఆలస్యంగా విడుదల చేశారు. వాస్తవానికి జూన్ 12న పాఠశాలలు తెరిచేందుకు కనీసం ఒక్క రోజు ముందైనా ఆ కేలండర్‌ను విడుదల చేయాలి. కానీ ఈసారి సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కోసమని ముందుగా నిర్ణయించిన తేదీ కంటే ఒక రోజు ఆలస్యంగా బడులు తెరిచారు. అంతేకాకుండా విద్యార్థులకు బోధించాల్సిన రోజువారీ పాఠ్యాంశాలు, నిర్వహించాల్సిన పీరియడ్స్, పరీక్షలతో పాటు సెలవులు వంటి సమగ్ర సమాచారంతో కూడిన అకడమిక్ కేలండర్ ప్రకటన సైతం వాయిదా వేశారు. కేలండర్‌పై ఇంత కాలం ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. సోషల్ మీడియా గ్రూపుల్లో తప్పుడు కేలండర్ వైరల్ కావడం, అది వాస్తవమని ఉపాధ్యాయులు నమ్మడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఫార్మెటివ్ అసెస్‌మెంట్-1 ఆగస్టు ఒకటో తేదీ నుంచి అన్న అంశం ఉపాధ్యాయ గ్రూపుల్లో రావడంతో సిలబస్ పూర్తి చేసేందుకు ఒత్తిడి పెరిగింది. ఎట్టకేలకు ప్రస్తుత విద్యా పాఠశాల అకడమిక్ కేలండర్‌ను సోమవారం విద్యాశాఖ మంత్రి లోకేశ్ విడుదల చేశారు. గత విద్యా సంవత్సరంలో ప్రారంభించిన టోఫెల్- ప్రైమరీ/జూనియర్ శిక్షణను ఈసారి తొలగించారు.

కేజీబీవీల్లో ఖాళీలను భర్తీ చేయండి: లోకేశ్

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. అకడమిక్ కేలండర్ విడుదల సందర్భంగా లోకేశ్ ఉండవల్లిలోని నివాసంలో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు పూర్తిచేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాల మెరుగుదల పర్యవేక్షణ బాధ్యతను పేరెంట్స్ కమిటీలకు అప్పగించాలని సూచించారు. స్కూళ్లలో టాయిలెట్స్ మెరుగుపర్చాలని, అవసరమైన ఉపకరణాల కొనుగోలుకు టెండర్లు పిలవాలని ఆదేశించారు. సీబీఎస్ఈ స్కూళ్ల పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు.

అక్టోబర్ 4 నుంచి దసరా సెలవులు

- ఒంటిపూట బడుల సమయంలో పాఠశాలలు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయి.
- అక్టోబర్ 4 నుంచి 13 వరకు దసరా సెలవులు, మైనార్టీ విద్యా సంస్థలకు డిసెంబర్ 22 నుంచి 29 వరకు క్రిస్మస్ సెలవులు ఉంటాయి. జనవరి 11 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు.
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్న పాఠశాలలు వారానికి వరుసగా రెండు పీరియడ్స్‌ను సైన్స్ పీరియడ్స్‌కు కేటాయించాలి.
- పర్యావరణ విద్య సబ్జెక్టును 6, 7 తరగతులకు భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు, 8, 9, 10 తరగతులకు జీవశాస్త్రం టీచర్లు బోధించాలి.
- ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు ప్రతి నెల మొదటి, రెండో శనివారం 'నో బ్యాగ్ డే' పాటించాలి. ఈ సమయంలో విద్యార్థులతో పేపర్ కటింగ్, క్లే మౌల్డింగ్, డ్రాయింగ్, సింగింగ్, గార్డెనింగ్ వంటి యాక్టివిటీస్ చేయించాలి.
- ప్రాథమిక పాఠశాలల పిల్లలకు లాంగ్వేజ్ పీరియడ్స్‌లో మంచి చేతి రాతను ప్రాక్టీస్ చేయించాలి. వారానికి రెండు పీరియడ్స్‌ను గూగుల్ రీడ్ యాప్ ద్వారా వినడం, మాట్లాడడం కోసం ఇంగ్లిష్ లాంగ్వేజ్ ల్యాబ్ నిర్వహించాలి.

ఆటలకు గంట కేటాయింపు

ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు 232 రోజులు పనిచేయనున్నాయి. 88 వివిధ సెలవులు ఉన్నాయి. కేలండర్‌లో పేర్కొన్న విధంగా ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ), సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ) పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. పదో తరగతి వార్షిక పరీక్షలు సమ్మెటివ్ అసెస్‌మెంట్-2 (ఎస్ఏ) వచ్చే ఏప్రిల్ 7 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోధన, 4 నుంచి 5 గంటల వరకు ఆటలకు కేటాయించాలి. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 3.30 వరకు అనంతరం గంట సమయాన్ని క్రీడలకు కేటాయిస్తారు.





తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సాంబశివరావు నాయుడు, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సోమవారం దర్శించుకున్నారు. – తిరుమల



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కార్తీక్ సోమవారం దర్శించుకున్నారు. – ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)

రాత్రంతా చెట్టుపైనే..

వరదనీటిలోకి దూసుకెళ్లిన టిప్పర్
తాటి చెట్టెక్కి ప్రాణాలు దక్కించుకున్న డ్రైవర్

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): తెలంగాణ నుంచి ఒడిశా వెళుతోన్న టిప్పర్ వరదనీటిలో చిక్కుకోగా డ్రైవర్ రాత్రంతా చెట్టెక్కి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ సంఘటన సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో జరిగింది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన మర్రి నవీన్ తెలంగాణలోని సత్తుపల్లికి చెందిన టిప్పర్‌ను ఒడిశాలో అప్పగించేందుకు ఆదివారం బయలుదేరాడు. గూగుల్ మ్యాప్ సాయంతో టిప్పర్‌ను నడుపుతున్న నవీన్ అర్ధరాత్రి చింతూరు మండలం నిమ్మలగూడెంకు చేరుకున్నాడు. అప్పటికే ఒడిశాకు వెళ్లే జాతీయ రహదారి-326పై భారీగా వరదనీరు నిలిచి ఉంది. ఈ విషయాన్ని గమనించని నవీన్ వేగంగా టిప్పర్‌ను నీటిలోకి దింపడంతో అది దూసుకుపోయి వరద నీటిలో చిక్కుకుంది. దీంతో భయపడిన అతను లారీ క్యాబిన్‌పైకి ఎక్కగా వరద నీరు క్రమేపీ క్యాబిన్ పైకి కూడా రావడంతో ప్రాణాలు దక్కించుకునేందుకు పక్కనే ఉన్న తాటి చెట్టు ఎక్కాడు. రాత్రంతా అతను చెట్టుపైనే బిక్కుబిక్కుమంటూ గడపగా ఉదయం అతడిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని పడవ సాయంతో డ్రైవర్‌ను కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.



ప్రాణభయంతో తాటిచెట్టుపై కూర్చున్న నవీన్



పడవలో సురక్షితంగా ఒడ్డుకు చేరుతున్న నవీన్

ఫీజుల పేరిట రూ.2.09 కోట్లకు టోకరా

- కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పించి.. ఫీజు మొత్తం చెల్లించని వైనం
- 8 మందిని మోసగించిన కరీంనగర్ వాసి
- శ్రీకాకుళం ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి వచ్చిన విద్యార్థుల తండ్రులు

శ్రీకాకుళం క్రైమ్: కజకిస్తాన్ దేశంలోని ఓ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్‌లో చేర్పించి ఫీజు మొత్తం చెల్లించకుండా తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్ తమను మోసగించినట్లు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన బాధితులు సోమవారం శ్రీకాకుళం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎనిమిది మంది విద్యార్థుల నుంచి రూ.2,09,50,000 వసూలు చేసి మోసగించినట్లు శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి విద్యార్థుల తండ్రులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. జీబీఎస్ ఇంటర్నేషనల్ ప్రతినిధినని చెప్పి శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని యాతపేటలో 2022లో సంస్థ ప్రారంభించిన హరీష్ గంగాధర్ ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని చెప్పాడు. రూ.28 లక్షల నుంచి రూ.48 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందని ఒక్కో విద్యార్థికి ఒక్కోలాగా చెప్పాడు. దీంతో విద్యార్థుల తండ్రులు పొందర సాంబమూర్తి (పోలాకి మండలం గాతలవలస) రూ.32.50 లక్షలు, బోర అప్పాజీ (పోలాకి మండలం చల్లయ్యవలస) రూ.28.50లక్షలు, దుప్పల దుర్గారావు (కుశాలపురం) తన ఇద్దరు కుమారులకు రూ.45 లక్షలు, పైడి అప్పలసూర్యనారాయణ (కుశాలపురం) రూ.25 లక్షలు, అన్నెపు నానాజీరావు (శ్రీకాకుళం) రూ.25 లక్షలు, ఓన రమణ (విజయనగరం జిల్లా రాజాం మండలం కొత్తవలస) రూ.28.50 లక్షలు, కొర్నాన అప్పలనాయుడు (విజయనగరం జిల్లా బొండపల్లి మండలం రోళ్లవాక) రూ.25 లక్షలు అందజేశారు. ఈ సొమ్మును పలు దఫాలుగా బ్యాంకు ఖాతాల నుంచి, నగదు రూపంలోను ఇచ్చారు. ఒక సంవత్సరం తరువాత ఫీజు చెల్లించలేదని ఆ యూనివర్సిటీ వారు విద్యార్థులను పంపేశారు. తమకు ఒక సంవత్సరానికి మాత్రమే కళాశాల ఫీజు, వసతి ఫీజు చెల్లించారని యూనివర్సిటీ వారు తెలిపారు. దీంతో హరీష్ గంగాధర్ తమను మోసగించినట్లు గ్రహించామని విద్యార్థుల తండ్రులు తెలిపారు. ఈ విషయమై తమ కుమారులు ఈ ఏడాది మార్చిలో ఇండియన్ ఎంబసీలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

మోహిత్‌రెడ్డికి ముందస్తు బెయిల్

- రూ.20 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించండి
- 15 రోజులకొకసారి దర్యాప్తు అధికారి ముందు హాజరుకండి
- మోహిత్‌రెడ్డికి హైకోర్టు ఆదేశం


సాక్షి, అమరావతి: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తిరుపతిలో జరిగిన ఘర్షణలకు సంబంధించి ఎస్వీ క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఆయనకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.20 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని మోహిత్‌రెడ్డిని ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసేంతవరకు 15 రోజులకు ఒకసారి దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అంతకుముందు మోహిత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇతర నిందితుల వాంగ్మూలం ఆధారంగా పోలీసులు పిటిషనర్‌పై కేసు నమోదు చేశారని తెలిపారు. ఘర్షణల్లో పిటిషనర్ పాత్ర ఎంతమాత్రం లేదన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా లేవని చెప్పారు. దుబాయ్ వెళుతున్న మోహిత్‌రెడ్డిని పోలీసులు బెంగళూరులో ఈ నెల 27న అదుపులోకి తీసుకున్నారని, అనంతరం సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు ఇచ్చి పలు షరతులు విధించి విడిచిపెట్టారని తెలిపారు. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. దర్యాప్తు అధికారి అందుకు గల కారణాలను రికార్డ్ చేయడం తప్పనిసరని, 41ఏ ఇచ్చి షరతులు పెట్టొచ్చని చెప్పారు. ఈ కేసులో అలాగే చేశారని వివరించారు. అరెస్ట్ చేయదలచుకోలేదు కాబట్టే, 41ఏ నోటీసు ఇచ్చామని తెలిపారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. మోహిత్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు ఉందని, అలాంటప్పుడు 41ఏ నోటీసు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అందుకు చట్ట నిబంధనలు వెసులుబాటు కల్పిస్తున్నాయని పోసాని వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ సమయంలో న్యాయమూర్తి.. ఘర్షణల్లో పిటిషనర్ మోహిత్‌రెడ్డి స్వయంగా పాల్గొన్నారా? అని ప్రశ్నించారు. పోసాని సమాధానమిస్తూ.. స్ట్రాంగ్ రూం వద్దకు ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థి, ఆయన ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. అయితే మోహిత్‌రెడ్డి మాత్రం మరికొంతమంది అనుచరులను లోనికి పంపాలని గేటు వద్ద భద్రతా సిబ్బందిని ఆదేశించారని, దీంతో ఇతరులు లోనికి వచ్చారని చెప్పారు. అటు తరువాతే ఘర్షణ మొదలైందన్నారు. ఈ విషయాన్ని గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సైతం చెప్పారని, వారి వాంగ్మూలం కూడా నమోదు చేశామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ మోహిత్‌రెడ్డికి షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేశారు.

తిరుమలలో యాత్రికులపై దుకాణ నిర్వాహకుడి దాడి

తిరుమల: వాటర్ బాటిల్ కోసం దుకాణానికి వెళ్లిన ఓ కుటుంబంపై దుకాణ నిర్వాహకుడు దాడికి పాల్పడిన ఘటన సోమవారం తిరుమలలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ చంద్రబాబు, న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అనూజ దంపతులు శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్నారు. కుమారుడిని వాటర్ బాటిల్ కోసం స్థానికంగా సురేష్ అనే వ్యక్తి దుకాణానికి పంపారు. ఆ దుకాణంలోని వారు బాబుకు సీలు లేని వాటర్ బాటిల్ ఇచ్చి రూ.60 వసూలు చేశారు. గమనించిన తల్లి అనూజ, సీలు ఉన్న బాటిల్ ఇవ్వాలని దుకాణదారుడిని కోరారు. అయితే దుకాణదారుడు ఆమెతో అమర్యాదగా మాట్లాడాడు. అంతలో అక్కడికి వచ్చిన చంద్రబాబుపైనా దుకాణదారుడు వాటర్ బాటిల్‌తో దాడి చేయడంతో అతని చెవికి గాయమైంది. అంతటితో ఆగకుండా అనూజను కాలితో తన్నాడు. దుకాణదారుడి దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది సాయికుమార్‌పైనా దుకాణదారుడు దాడికి పాల్పడడంతో అతని చేతికీ గాయమైంది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు కేసు నమోదుచేశారు. వెంటనే స్పందించిన టీటీడీ రెవెన్యూ అధికారులు దుకాణాన్ని సీజ్ చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయిస్తే సహించం

- టీడీపీ కార్యాలయంపై 2021 దాడి ఘటనలో న్యాయవాది గవాస్కర్‌పై కేసు నమోదు
- దీన్ని ఖండిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదుల విధుల బహిష్కరణ



విజయవాడస్పోర్ట్స్: గుంటూరు జిల్లా మంగళగిరి టీడీపీ కార్యాలయంపై మూడేళ్ల కిందట జరిగిన దాడి ఘటనలో న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌ను నిందితుడుగా చేర్చడాన్ని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) న్యాయవాదులు తప్పుబట్టారు. రాజకీయ కోణంలో జరిగిన ఈ దాడి ఘటనలో న్యాయవాదులను ఇరికించేందుకు మంగళగిరి రూరల్ పోలీసులు కుట్రపూరితంగా వ్యవహరించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. డిఫెన్స్ తరుపున న్యాయస్థానానికి వాదనలు వినిపించేందుకు వెళ్లిన గవాస్కర్‌పై తాజాగా కేసు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. పోలీసుల తీరును ఖండిస్తూ బీబీఏ న్యాయవాదులు విధులు బహిష్కరించి గవాస్కర్‌కు సంఘీభావంగా విజయవాడ సివిల్ కోర్టుల ప్రాంగణం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి మాట్లాడుతూ 2021లో టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిందని, అప్పట్లోనే పోలీసులు నిందితులపై కేసులు నమోదు చేశారన్నారు. అయితే పలువురు నిందితుల తరుపున వకల్తా పుచ్చుకున్న గవాస్కర్‌పై తాజాగా కేసు నమోదు చేసి 88వ నిందితుడిగా చేర్చడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సీనియర్ న్యాయవాది గౌతంరెడ్డి మాట్లాడుతూ పోలీసులు ఈ చర్యలను వెంటనే ఉపసంహరించుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. న్యాయవాది గవాస్కర్ మాట్లాడుతూ ఈ కేసులో తన పేరు ఉందని వారం కిందటి వరకు తనకు తెలీదన్నారు. నాలుగు రోజుల క్రితం కోర్టుకు వెళితే హత్యాయత్నం కేసులో నిందితుడిగా తన పేరును పోలీసులు చేర్చడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నట్టు చెప్పారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. పై నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా కేసు నమోదు చేయాల్సి వచ్చిందని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం పోలీసుల తీరుకు నిరసనగా న్యాయవాదులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఆందోళన కార్యక్రమంలో న్యాయవాదులు మన్మథరావు, నిర్మల్‌రాజేష్, కోటంరాజు, బసవరెడ్డి, సాయిరామ్, ఆదాం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎమ్మెల్యే కారుపై దాడి

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కారుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఎమ్మెల్యే బాలరాజు ఇంటి వద్ద నుంచి ఆయన డ్రైవర్ కారులో జీలుగుమిల్లికి వెళుతున్న సమయంలో బర్రింకలపాడు జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రాయితో దాడి చేయడంతో కారు వెనుక భాగం దెబ్బతింది. ఆ సమయంలో ఎమ్మెల్యే బాలరాజు కారులో లేరని సీఐ క్రాంతికుమార్ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కూడా ధ్రువీకరించారు.

మోదీ చక్రవ్యూహంలో దేశం

అంబానీ, అదానీలకే దోచిపెడుతోంది • లోక్‌సభలో రాహుల్ నిప్పులు

చక్రవ్యూహం వెనుక ఆరుగురు • ఛేదించి తీరతామని వ్యాఖ్య



న్యూఢిల్లీ: మోదీ సర్కారుపై విపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం ముప్పేట దాడి చేశారు. ''దేశమంతటా తీవ్ర భయోత్పాత వాతావరణాన్ని నెలకొల్పారు. దేశంపై ప్రధాని మోదీ పెను సమస్యల చక్రవ్యూహం పన్నారు. అది దేశమంతటినీ సర్వనాశనం చేస్తోంది'' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో చర్చలో మాట్లాడిన రాహుల్ మోదీపైనా, ఎన్డీఏ ప్రభుత్వ పాలనపైనా సునిశిత విమర్శలు చేశారు. ఘాటైన పదజాలంతో కూడిన పదునైన వ్యాఖ్యలు చేశారు. అధికార పక్ష సభ్యులు తీవ్రంగా ప్రతిఘటించినా, నిబంధనలు అనుమతించబోవంటూ స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిస్తున్నా వెనక్కు తగ్గలేదు. బడ్జెట్ కేవలం బడా వ్యాపారవేత్తలకు ప్రయోజనాలకు, సర్కారు రాజకీయ గుత్తాధిపత్యానికి కొమ్ము కాసేలా ఉదంటూ విమర్శించారు. ''ఈ మోదీ మార్కు సమస్యల చక్రవ్యూహాన్ని విపక్ష ఇండియా కూటమి ఛేదిస్తుంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతకు, దేశవ్యాప్తంగా కులగణనకు సభ ఆమోదం లభించేలా చేసి తీరుతుంది'' అని ప్రకటించారు.

అభిమన్యుడిలా దేశం...

నేటి హరియాణాలోని కురుక్షేత్రలో వేల ఏళ్ల కింద జరిగిన యుద్ధంలో ఆరుగురు ఒక్కటై చక్రవ్యూహం పన్ని బాలుడైన అభిమన్యుని పొట్టన పెట్టుకున్నారంటూ మహాభారత గాథను రాహుల్ ఉటంకించారు. ''హింస, భయోద్వేగాలతో కూడిన చక్రవ్యూహమది. దాన్ని పద్మవ్యూహమని కూడా అంటారు'' అంటూ బీజేపీ ఎన్నికల గుర్తు కమలాన్ని పరోక్షంగా గుర్తు చేశారు. ''నేడు 21వ శతాబ్దంలో మన దేశంపై మోదీ ఓ నయా చక్రవ్యూహాన్ని పన్నారు. అభిమన్యునికి పట్టిన గతినే దేశానికి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశ యువతను, రైతులను, మహిళలను, చిన్న, మధ్యతరహా వ్యాపారులను సర్వనాశనం చేసేందుకు రాత్రింబవళ్లు ప్రయత్నిస్తున్నారు. ఆరుగురు వ్యక్తులు కేంద్ర స్థానంలో ఉండి చక్కవ్యూహాన్ని నియంత్రిస్తున్నారు. వాళ్లు మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పారిశ్రామికవేత్తలు అంబానీ–అదానీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్' అని చెప్పుకొచ్చారు. చివరి నలుగురూ సభలో లేనందున వారి పేర్ల ప్రస్తావనను అనుమతించబోనని స్పీకర్ స్పష్టం చేశారు. దాంతో అనంతరం ఆరుగురి పేర్లనూ రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాహుల్ ప్రసంగం పొడవునా అధికార ఎన్డీఏ కూటమి సభ్యులంతా పెద్దపెట్టున నిరసనలకు దిగారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు జోక్యం చేసుకోబోయారు. కానీ రాహుల్ అందుకు అవకాశమివ్వలేదు. సభలో లేనివారి పేర్లు ప్రస్తావించొద్దని స్పీకర్ స్పష్టం చేయడంతో అంబానీ, అదానీలను తన ప్రసంగం పొడవునా ఏ1, ఏ2గా సంబోధించారు. ''ఏ1, ఏ2లను కాపాడేందుకు రిజిజు కూడా ప్రయత్నిస్తున్నారు. మీరిలా చేస్తే మాకే లాభం. వారిద్దరినీ ఇంకెంతగా కాపాడే ప్రయత్నం చేస్తారో చేయండి'' అంటూ ఎద్దేవా చేశారు.

చక్రవ్యూహం... మూడు శక్తులు

మోదీ చక్రవ్యూహం వెనక మూడు శక్తులున్నాయని రాహుల్ అన్నారు. ''మొదటిది గుత్తాధిపత్య ధోరణి. దేశ సంపదనంతా ఏ1, ఏ2 (అంబానీ, అదానీ) ఇద్దరికే మాత్రమే దోచిపెట్టే ప్రయత్నం. రెండోది సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు. వీటి సాయంతో విపక్షాలను అణగదొక్కే కుట్రలు. మూడోది అన్నింటినీ గుప్పెట్లో పెట్టుకుని ఆడిస్తున్న రాజకీయ, అధికారస్వామ్యం. మోదీ చక్రవ్యూహానికి గుండెకాయ వంటి ఈ శక్తులు దేశాన్ని నాశనం చేస్తున్నాయి'' అంటూ దుయ్యబట్టారు.

మధ్యతరగతికి వెన్నుపోటు

కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతిని దారుణంగా వెన్నుపోటు పొడిచారని రాహుల్ ఆరోపించారు. ''మోదీకి కాస్తో కూస్తో మద్దతుగా నిలిచిన వర్గం మధ్యతరగతి. కొవిడ్ సమయంలో ఆయన మొబైల్ టార్చిలు వేయమంటే వేసింది. పళ్లాలు మోగించండంటే మోగించింది. అలాంటి వర్గంపై బడ్జెట్లో పెను భారం వేశారు. తద్వారా వారి వెన్నులోనూ, ఛాతీలోనూ కత్తులు దింపారు మోదీ'' అన్నారు. ''ఇదీ మా మంచికే. మధ్యతరగతి ఇక ఇండియా కూటమి వైపు మొగ్గుతుంది'' అని జోస్యం చెప్పారు. ''మోదీ చక్రవ్యూహపు దుష్ప్రభావాన్ని కేంద్ర బడ్జెట్ బలహీనపరుస్తుందని, యువత, రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులను ఆదుకుంటుందని ఆశించా. కానీ వ్యాపార, రాజకీయ గుత్తాధిపత్యాలను కాపాడటమే ఏకైక లక్ష్యంగా బడ్జెట్ రూపొందింది. దేశంలోని టాప్ 500 కంపెనీల్లో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారట! బడ్జెట్లో విత్త మంత్రి పేర్కొన్న ఈ పథకం హాస్యాస్పదంగా ఉంది. ఎందుకంటే 99 శాతం మంది యువతకు అది అందని ద్రాక్షే. నిరుద్యోగ చక్రవ్యూహం, పేపర్ లీకేజీ చక్రవ్యూహం, అగ్నివీర్ చక్రవ్యూహం... ఇలా విద్యార్థులు, యువత, సైన్యంతో పాటు ఏ రంగాన్నీ వదలకుండా సమస్యల సుడిగుండంలో ముంచెత్తారు'' అంటూ మండిపడ్డారు. ''మీరు సృష్టించిన అన్ని చక్రవ్యూహాలనూ మేం ఛేదించేస్తాం. దేశవ్యాప్త కులగణనే అందుకు సరైన అస్త్రం'' అన్నారు. ''దేశ యువత, వెనకబడ్డ వర్గాలు అభిమన్యులని ఈ చక్రవ్యూహ సృష్టికర్తలు అపోహ పడుతున్నారు. కానీ నిజానికి వాళ్లంతా ఆ వ్యూహాన్ని ఛేదించే అర్జునులు'' అని హెచ్చరించారు. అగ్నివీర్ వంటి సున్నితమైన పథకంపై విమర్శలు సరికావంటూ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభ్యంతరం వెలిబుచ్చారు.

మాది శివుని ఊరేగింపు

ఇండియా కూటమిని శివుని పెళ్లి ఊరేగింపుతో రాహుల్ పోల్చారు. ''అందులో ఎవరైనా పాల్గొనవచ్చు. మోదీ చక్రవ్యూహం కేవలం ఆరుగురికే పరిమితం. ఆ చక్రవ్యూహానికి, శివుని ఊరేగింపుకు పోరాటమిది'' అన్నారు.

'హల్వా' ఫొటోపై విసుర్లు



ప్రసంగం సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రదర్శించిన బడ్జెట్ హల్వా ఫొటో కలకలానికి దారి తీసింది. బడ్జెట్ ముద్రణకు ముందు దాని తయారీ ప్రక్రియలో పాల్గొన్న ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి హల్వా తయారు చేయడం రివాజు. అలా ఈసారి నిర్మలా సీతారామన్ బృందం బడ్జెట్ హల్వా తయారు చేస్తున్న ఫొటోను చూపిస్తూ, ''ఇందులో కన్పిస్తున్న 20 మంది అధికారుల్లో దళితులు, ఆదివాసీలు ఒక్కరు కూడా లేరు. మైనారిటీ, ఓబీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు'' అంటూ రాహుల్ ఆక్షేపించారు. రాహుల్ ఆ ఫొటోను ప్రదర్శిస్తున్న సమయంలో నిర్మల రెండు చేతుల్లో ముఖం దాచుకుంటూ కన్పించారు.



కేజ్రీవాల్ బెయిల్‌పై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీఎం కేజ్రీవాల్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వులో ఉంచింది. సోమవారం కేజ్రీవాల్, సీబీఐ తరఫు లాయర్లు తమ వాదనలు వినిపించారు. 'ఎక్సైజ్ కుంభకోణం ప్రధాన సూత్రధారి కేజ్రీవాల్. ఆయన్ను విడుదల చేస్తే సాక్ష్యులను ప్రభావితం చేస్తారు. ఆయన అరెస్టయితేనే ఈ కేసు విచారణ ముగింపునకు వస్తుంది. నెలలోగా చార్జిషీటు వేస్తాం'అని సీబీఐ లాయర్ డీపీ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్‌ను జైలు నుంచి బయటకు రాకుండా చేసేందుకే సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారని ఆయన తరఫు సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వి వాదించారు. ఊహాకల్పనలతోనే కేజ్రీవాల్‌కు అరెస్ట్ చేశారే తప్ప, ఆయనకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా ఎటువంటి ఆధారాలు లేవన్నారు. వాదనలు విన్న అనంతరం జస్టిస్ నీనా బన్సన్ కృష్ణ తీర్పును రిజర్వ్‌లో ఉంచుతూ ఆదేశాలిచ్చారు.

ఆఖరి చార్జిషీటు

అంతకుముందు, సీబీఐ అధికారులు మద్యం కుంభకోణం కేసులో ఆఖరి చార్జిషీటును రౌజ్ అవెన్యూ కోర్టులో దాఖలు చేశారు. ఇందులో సీఎం కేజ్రీవాల్, ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌తోపాటు అరబిందో ఫార్మా డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డి, బడ్డీ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమిత్ అరోరా, హవాలా ఆపరేటర్ వినోద్ చౌహాన్, వ్యాపారవేత్త ఆశిష్ మాథుర్ పేర్లున్నాయి.

గొలుసుతో చెట్టుకు కట్టేసి




మహిళను రక్షిస్తున్న పోలీసు అధికారి. (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో బాధితురాలు

- మహారాష్ట్ర అడవుల్లో 40 రోజులు నిరాహారంగా
- రక్షించిన మహారాష్ట్ర పోలీసులు
- 40 రోజులుగా ఆహారం లేక చిక్కిశల్యమైన శరీరం
- తమిళనాడులో ఉంటున్న యూఎస్ మహిళగా గుర్తింపు
- ఆస్పత్రికి తరలింపు

ముంబై: మహారాష్ట్రలోని సింధుదుర్గ్ అడవుల్లో ఇనుప గొలుసుతో చెట్టుకు కట్టేసి ఉన్న ఓ మహిళ కనిపించింది. రోజులుగా ఆహారం లేక ఆమె శరీరం చిక్కి శల్యమైపోయింది. పశువుల కాపరి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. మహిళ దగ్గర దొరికిన యూఎస్ పాస్‌పోర్ట్, ఆధార్, ఇతర డాక్యుమెంట్ల ఆధారంగా లలిత కాయి కుమార్ ఎస్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. సింధుదుర్గ్‌లో సోనుర్లి గ్రామానికి చెందిన ఓ పశువుల కాపరి శనివారం సమీపంలోని అడవులకు వెళ్లాడు. అక్కడ అతనికి మనిషి మూలుగు వినిపించింది. దగ్గరకు వెళ్లి చూడగా ఓ మహిళ కాలికి ఇనుప గొలుసులతో చెట్టుకు కట్టేసి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను సావంత్‌వాడీ ఆరోగ్యకేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గోవా మెడికల్ కాలేజీకి తరలించారు. మహిళ దగ్గర యూఎస్ పాస్‌పోర్ట్, తమిళనాడు అడ్రస్‌తో ఆధార్ ఉందని, పదేళ్లుగా ఆమె తమిళనాడులో ఉంటోందని పోలీసులు తెలిపారు. కొన్ని రోజులుగా ఆహారం లేకపోవడంతో ఆమె మాట్లాడలేని స్థితిలో ఉందన్నారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న మహిళను.. ఇంట్లో గొడవల కారణంగా భర్తే.. 40 రోజుల కిందట అడవిలో వదిలేసి వెళ్లినట్లుగా ఆస్పత్రిలో ఆమె రాసిన వివరాల ఆధారంగా తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. ఆమె వీసా గడువు కూడా ముగిసిందని, విదేశీయుల స్థానిక నమోదు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. మరోవైపు ఆమె భర్త, బంధువుల గురించి విచారించేందుకు కొన్ని బృందాలు తమిళనాడు, గోవా, ఇతర ప్రాంతాలకు వెళ్లాయన్నారు.

రష్యా యుద్ధక్షేత్రంలో మరో భారతీయుడు మృతి

చండీగఢ్: ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో మరో భారతీయుడు బలయ్యారు. రవాణా విధులకని తీసుకున్న రష్యా యుద్ధంలోకి పంపి తన సోదరుడిని పొట్టనబెట్టుకుందని హరియాణాకు చెందిన అజయ్ మౌన్ అనే వ్యక్తి సోమవారం ప్రకటించారు. బాధితుడు రవి మౌన్ జనవరి 13న రష్యా వెళ్లారు. కందకాలు తవ్వడంలో శిక్షణ ఇప్పించి నేరుగా యుద్ధక్షేత్రంలోకి పంపారని అజయ్ ఆరోపించారు. రవిని రష్యాకు పంపేందుకు ఎకరం భూమి అమ్మడంతోపాటు రూ.11.50 లక్షలు ఖర్చుపెట్టామని వాపోయారు. రవి మరణవార్తను మాస్కోలోని భారతీయ ఎంబసీ ధ్రువీకరించింది. యుద్ధంలో ఉన్న భారతీయులను వెనక్కి పంపేస్తామంటూ ప్రధాని మోదీ పర్యటన వేళ రష్యా ప్రకటించిన కొద్దిరోజులకే ఈ విషాదం వెలుగుచూడటం గమనార్హం. యుద్ధంలో పనిచేయడం రవికి సుతరామూ ఇష్టంలేదని, ఫోన్‌లో ముభావంగా మాట్లాడేవారని మార్చి 12వ తేదీ దాకా అతనితో టచ్‌లోనే ఉన్నామని సోదరుడు అజయ్ చెప్పారు. మృతదేహం గుర్తింపు కోసం డీఎన్ఏ నమూనాలను పంపాలని డిమాండ్ చేస్తున్నారని, అంత సొమ్ము తమ వద్ద లేదని, మృతదేహం రప్పించేందుకు భారత సర్కార్ సాయం చేయాలని ఆయన వేడుకున్నారు.



రవి మౌన్

విద్యార్థుల జలసమాధిపై ఉన్నతస్థాయి కమిటీ

ఆదేశించిన కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ: ఢిల్లీలో కోచింగ్ సెంటర్‌లో విద్యార్థుల జలసమాధి ఘటనపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అదనపు కార్యదర్శి ఆధ్వర్యంలో దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్ర హోం శాఖ సోమవారం ప్రకటించింది. ఘటనకు కారణాలను తెల్సుకోవడంతోపాటు బాధ్యులెవరో తేల్చనుంది. ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలతోపాటు అవసరమైతే విధానపర నిర్ణయాల్లో చేపట్టాల్సిన మార్పులను కమిటీ సిఫార్సుచేయనుంది. గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ఢిల్లీ ప్రభుత్వ(హోంశాఖ) ముఖ్య కార్యదర్శి, ఢిల్లీ పోలీస్, ఫైర్ స్పెషల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. హోం శాఖ సంయుక్త కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. 30 రోజుల్లోపు ఈ కమిటీ తన నివేదికను సమర్పించనుందని హోం శాఖ అధికార ప్రతినిధి సోమవారం చెప్పారు

మరో ఐదుగురి అరెస్ట్

ఈ ఘటనలో బేస్‌మెంట్ యజమానుల పాటు మొత్తం ఐదుగురిని సోమవారం పోలీసులు అ రెస్ట్‌చేశారు. డ్రైనేజీలపై అక్రమ కట్టడాలను అధికారులు బుల్డోజర్లతో కూల్చేయడం మొదలెట్టారు.



20 బేస్‌మెంట్లకు సీలు

కోచింగ్ కేంద్రాలకు నిలయమైన పాత రాజేందర్ నగర్ ప్రాంతంలో సోమవారం అధికారులు అక్రమ కట్టడాలపై చర్యలకు ఉపక్రమించారు. అక్రమంగా నడుస్తున్న పలు కోచింగ్ సెంటర్లకు సంబంధించిన 20 బేస్‌మెంట్లకు సీల్‌వేశారు. అధిక కోచింగ్ సెంటర్లు ఉండే మరో ప్రాంతం ముఖర్జీ నగర్‌లోనూ ఆకస్మిక పర్యటనలు చేయించండి. అభ్యర్థులను శాంతింపజేయడానికి లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సోమవారం అక్కడి చేరుకుని వారితో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు తలో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

వెనిజులాలో... మళ్లీ పాత కథే!



అధ్యక్షుడు మదురో గెలిచినట్టు ఈసీ ప్రకటన	మేమే గెలిచాం, ఫలితాల్ని మార్చేశారు: విపక్షాల ఆరోపణ	బూత్‌లవారీగా ఫలితాల వెల్లడికి డిమాండ్, ఈసీ ససేమిరా



కారకాస్: వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో అంతా ఊహించిందే జరిగింది. అధ్యక్షుడు నికొలస్ మదురో వరుసగా మూడోసారి విజయం సాధించినట్టు ఆ దేశ ఎన్నికల సంఘం (సీఎన్ఈ) ప్రకటించింది. ఆదివారం జరిగిన దేశవ్యాప్త పోలింగ్ అనంతరం రాత్రి ఓట్ల లెక్కింపు చేపట్టారు. 80 శాతం ఓట్లను లెక్కించే సరికి మదురోకు విజయానికి అవసరమైన 51 శాతం ఓట్లు లభించినట్టు సీఎన్ఈ చీఫ్ ఎల్విస్ అమోరోసో అర్ధరాత్రి అనంతరం ప్రకటన విడుదల చేశారు. విపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్‌కు 44 శాతం ఓట్లొచ్చినట్టు వెల్లడించారు. దీనిపై విపక్షాలన్నీ తీవ్రంగా మండిపడ్డాయి. ఓట్ల లెక్కింపును ప్రహసనప్రాయంగా మార్చేసి ప్రజాస్వామ్యాన్ని మరోసారి మంటగలిపారని విపక్ష నేత మరియా కొరీనా మచాడో దుమ్మెత్తిపోశారు. ''మదురోను ఓడించేందుకు జనమంతా వెల్లువలా కదిలొచ్చి గొంజాలెజ్‌కు ఓటేశారు. ఆయన కనీసం మూడింట రెండొంతుల ఓట్లతో ఘనవిజయం సాధించారు. మా బూత్‌లవారీ విశ్లేషణలో కూడా అదే తేలింది. ఓటింగ్ సరళిని చూసిన మీదట ఓటమి ఖాయమని మదురోకు అర్థమైపోయింది. ఫలితాలను తారుమారు చేసేందుకు పథకం ప్రకారం విపక్ష కూటమి పర్యవేక్షకులను పోలింగ్ బూత్‌ల నుంచి తరిమేశారు. అనంతరం మదురో చేతిలో కీలుబొమ్మ అయిన సీఎన్ఈ చీఫ్ ఫలితాలను ఆయనకు అనుకూలంగా వక్రీకరించారు'' అంటూ ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణం దేశవ్యాప్తంగా మొత్తం 30 వేల పోలింగ్ బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సీఎన్ఈ మాత్రం అందుకు సుముఖంగా లేదు. దీనికి తోడు పోలింగ్ ముగిశాక ఫలితాల వెల్లడిని నిర్ధారిత సమయం కంటే ఏకంగా ఆరు గంటలపాటు ఆలస్యం చేశారు. ఫలితాలను మదురోకు అనుకూలంగా మార్చేందుకే ఇలా చేశారని విపక్ష కూటమి దుయ్యబట్టింది. ఫలితాలను చట్టపరంగా సవాలు చేస్తామని ప్రకటించింది. మదురో మాత్రం విదేశీ శక్తులతో కలిసి కొందరు కుట్ర పన్ని ఈవీఎంలను హాక్ చేసేందుకు ప్రయత్నించారంటూ విపక్షాలపై ప్రత్యారోపణలకు దిగారు. శాంతిభద్రతలకు భంగం కలిగించజూస్తే ఏం చేయాలో పోలీసులు, సైన్యం చూసుకుంటాయని హెచ్చరించారు. వెనిజులాలో పాతికేళ్లుగా యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ పాలనకు తెరదించేందుకు విపక్షాలన్నీ మచాడో సారథ్యంలో ఒక్కతాటిపైకి వచ్చి పోటీ చేశాయి.

ఫలితాలపై దేశాల పెదవి విరుపు

వెనిజులా ఎన్నికల ఫలితాలు అస్సలు నమ్మశక్యంగా లేవని అమెరికా, చిలీ,ఉరుగ్వేతో పాటు చాలా దేశాలు పేర్కొన్నాయి. అవి ప్రజల మనోగతాన్ని, ఓటింగ్ సరళిని ప్రతిఫలించడం లేదని స్పష్టం చేశాయి. చిలీ అధ్యక్షుడు గేబ్రియెల్ బోరిక్, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో పాటు బ్రిటన్ కూడా ఈ మేరకు ప్రకటన చేసింది.

వారం రోజుల స్పెషల్ లోక్ అదాలత్

వజ్రోత్సవాల సందర్భంగా సుప్రీంకోర్టు నిర్ణయం

సామరస్యంగా పరిష్కరిస్తే ఎనలేని తృప్తి: సీజేఐ



న్యూఢిల్లీ: వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి, తద్వారా పెండింగ్ భారాన్ని తగ్గించుకునేందుకు సుప్రీంకోర్టు సోమవారం ప్రత్యేక లోక్ అదాలత్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా సుప్రీంకోర్టులోని మొదటి ఏడు ధర్మాసనాలు మధ్యాహ్నం 2 గంటలకు కేసులను విచారిస్తాయి. సుప్రీంకోర్టు వజ్రోత్సవాల సంబరాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వెల్లడించారు. ప్రత్యేక లోక్ అదాలత్ వారం పాటు కొనసాగుతుందని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు, లాయర్లు దీన్ని వినియోగించుకోవాలని కోరారు. వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడంలో కక్షిదారులకు సాయపడితే కలిగే తృప్తి వెల కట్టలేనిదని ఆయన అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారంలో లోక్ అదాలత్‌ల ప్రాధాన్యతకు సంబంధించి స్వీయానుభవాన్ని ఉదాహరించారు. ''నా ముందుకు ఒక విడాకుల కేసు వచ్చింది. భార్య నుంచి విడాకులు కోరుతూ భర్త కింది కోర్టుకు వెళ్లాడు. అతడి నుంచి పరిహారం, పాప సంరక్షణ హక్కులు కోరుతూ భార్య కూడా కోర్టుకెక్కింది. వారితో సామరస్యపూర్వకంగా మాట్లాడిన మీదట మనసు మార్చుకున్నారు. కలిసుండేందుకు ఒప్పుకున్నారు. వైవాహిక జీవితాన్ని ఆనందంగా కొనసాగిస్తామని చెబుతూ కేసులు వెనక్కు తీసుకున్నారు'' అని వివరించారు. ఇలా లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు చరిత్రలో ఇదే తొలిసారి! పైగా సోమవారం జరిగిన విచారణల కవరేజీ కోసం మీడియాను కోర్టు రూముల లోపలికి అనుమతించడం విశేషం.

538 నియోజకవర్గాల ఓట్లలో తేడా: ఏడీఆర్



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 538 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసం ఉందని ఆసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సోమవారం తెలిపింది. 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. లెక్కించిన ఓట్లు తక్కువగా ఉన్నాయని వెల్లడించింది. ఈ 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. లెక్కించిన ఓట్లు 5,54,596 తక్కువగా ఉన్నాయని వివరించింది. అలాగే 176 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. లెక్కించిన ఓట్లు 35,093 అదనంగా ఉన్నాయని తెలిపింది. దీనిపై ఎన్నికల కమిషన్ ఇంకా స్పందించలేదు.

సుప్రీంలో నితీశ్ సర్కార్‌కు చుక్కెదురు

బిహార్‌లో రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టు స్టేను ఎత్తేయలేమన్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానంలో బిహార్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు 65 శాతానికి పెంచుతూ నితీశ్ ప్రభుత్వం తెచ్చిన రిజర్వేషన్ల సవరణ చట్టం అమలును నిలుపుదల చేస్తూ పట్నా హైకోర్టు ఇచ్చిన స్టేను తొలగించబోమని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టంచేసింది. తీర్పును వ్యతిరేకిస్తూ తాజాగా దాఖలైన 10 పిటిషన్లను సెప్టెంబర్‌లో విచారిస్తామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం పేర్కొంది.

మేధా పాట్కర్ శిక్ష నిలిపివేత



న్యూఢిల్లీ: 'నర్మదా బచావో ఆందోళన్'సారథి, పర్యావరణ ఉద్యమకారిణి మేధా పాట్కర్‌కు ఊరట లభించింది. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గతంలో 'కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్'అనే ఎన్జీవోను నడిపే సమయంలో 23 ఏళ్ల క్రితం వేసిన పరువునష్టం కేసులో ఢిల్లీ కోర్టు ఆమెకు విధించిన ఐదు నెలల జైలు శిక్షను కొట్టివేసింది. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రాఘవ్ శర్మ ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరిస్తూ వీకే సక్సేనాకు నోటీసు జారీ చేశారు. ఈ నోటీసుపై కేసు తదుపరి విచారణ జరిగే సెప్టెంబర్ 4వ తేదీలోగా సమాధానమిస్తామని ఆయన తరఫు లాయర్‌గజీందర్ కుమార్ చెప్పారు.

హేమంత్ బెయిల్ రద్దుకు సుప్రీం నో



న్యూఢిల్లీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఊరట లభించింది. ఆయన బెయిల్ రద్దు చేయాలంటూ ఈడీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. సోరెన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు జూన్ 28న వెలువరించిన తీర్పు 'చాలా సహేతుక'మని పేర్కొంది. ఇంప్లీడ్ ఆర్డర్‌లో తాము జోక్యం చేసుకోబోమని, లేదంటే ఈడీ కష్టాల్లో పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది.

ఏఎన్‌సీ నుంచి జుమా బహిష్కరణ



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) నుంచి బహిష్కరణకు గురయ్యారు. సొంతంగా ఎంకే అనే పార్టీ ఏర్పాటు చేసుకుని ఇటీవలి ఎన్నికల్లో ఆయన పోటీకి దిగారు. ఈ ఎన్నికల్లో ఏఎన్‌సీ ఓట్లను భారీగా చీల్చిన ఏకే పార్టీ ఏకంగా 15 శాతం ఓట్లతో దేశంలోనే మూడో అతి పెద్ద పార్టీగా అవతరించడం తెల్సిందే. 1994 తర్వాత మొట్టమొదటి ఏఎన్‌సీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో డెమొక్రటిక్ అలయెన్స్ వంటి పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఫ్రాన్స్‌లో కమ్యూనికేషన్ లైన్ల ధ్వంసం



పారిస్: పారిస్‌లో ఒలింపిక్స్ ప్రారంభం రోజున శుక్రవారం రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించిన గుర్తు తెలియని దుండగులు..ఈసారి టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నగరాల్లో ఒలింపిక్స్ ఈవెంట్లు జరుగుతుండగా పలు ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ కేబినెట్లలోని కేబుల్‌ను, సెల్‌ఫోన్, ల్యాండ్ లైన్లను దుండగులు ధ్వంసం చేసినట్లు ఫ్రాన్స్ ప్రభుత్వం తెలిపింది. నష్టం తీవ్రత, ఒలింపిక్ కార్యక్రమాలపై ఏమేరకు ప్రభావం పడిందనే విషయాలను ప్రభుత్వం వెల్లడించలేదు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వరకు స్థానికంగా టెలీకమ్యూనికేషన్ సేవలకు అంతరాయం కలిగినట్లు మాత్రమే సంబంధిత మంత్రిత్వ శాఖ వివరించింది. పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు ఈ పరిణామంపై ఎటువంటి ప్రకటనా చేయలేదు.

కత్తిపోట్లకు ఇద్దరు చిన్నారులు బలి

ఆరుగురి పరిస్థితి విషమం.. బ్రిటన్లో ఘోరం



లండన్: బ్రిటన్‌లోని సౌత్‌పోర్ట్‌లో సోమవారం కత్తిపోట్ల ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇద్దరు చిన్నారులు చనిపోగా 9 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. డ్యాన్స్ క్లాసులకు హాజరయ్యేందుకు వచ్చిన 6–11 ఏళ్ల చిన్నారులతో పాటు 13 మందిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనపై ప్రధాని కెయిర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అసోం పీఎస్‌సీ మాజీ ఛైర్మన్‌కు 14 ఏళ్ల జైలు



గువాహటి: రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి అధికారుల(ఏడీవో) పోస్టుల భర్తీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్న అసోం పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ ఛైర్మన్ రాకేశ్ పాల్‌కు ప్రత్యేక కోర్టు 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కమిషన్ మాజీ సభ్యులిద్దరికి పదేళ్ల చొప్పున, మరో 29 మందికి నాలుగేళ్ల చొప్పున కఠిన కారాగార జైలు శిక్షలు విధిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి దీపాంకర్ ఠాకూరియా సోమవారం తీర్పు వెలువరించారు. డబ్బులిచ్చిన వారికే వ్యవసాయ అధికారుల ఎంపిక పరీక్షలో ఎక్కువ మార్కులు వేశారంటూ కేసు నమోదైంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 30 । జూలై । 2024



సారెతో వచ్చి.. భక్తితో కొలిచి..
దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు కొన సాగుతున్నాయి. సోమవారం పలువురు భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు.
-8లో▸



అతిసారపై 'ఓఆర్ఎస్' అస్త్రం
వర్షాకాలంలో డయేరియా ప్రబలుతుంది. ఈ వ్యాధిబారిన పడిన వారికి ఓఆర్ఎస్ ద్రావణం సంజీవనిలా పనిచేస్తుంది.
-8లో▸



36,353 బస్తాల మిర్చి విక్రయం
కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు సోమవారం 40,891 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,353 బస్తాలు విక్రయించారు.

రైతుపై గుర్రపు స్వారీ

- పూడిక, తూటికాడ, గుర్రపు డెక్కతో నిండిన డ్రెయిన్లు
- ఓ మోస్తరు వర్షం కురిసినా ముంపుబారిన పడుతున్న పంట పొలాలు
- రూ.36.17 కోట్లతో టెండర్లు పిలిచినా జరగని పనులు
- టీడీపీ ఎమ్మెల్యేల ఒత్తిడితో ముందుకురాని కాంట్రాక్టర్లు



నందివాడ మండలం తమిరిశ వద్ద చంద్రయ్య డ్రెయిన్‌ను ఆక్రమించిన గుర్రపు డెక్క



చాట్రగడ్డవానిగూడెం - జోడుగూడెం వద్ద గుండేరు డ్రెయిన్‌లో విస్తరించిన గుర్రపుడెక్క

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కనుచూపు మేర విస్తరించిన గుర్రపు డెక్క.. దట్టంగా అల్లుకున్న తూటికాడ... ఆపై పేరుకున్న పూడికతో కృష్ణా డెల్టాలోని ఇరిగేషన్ డ్రెయిన్లు అస్తవ్యస్తంగా మారాయి. మురుగు నీరు ముందుకు కదిలేందుకు వీలులేదంటూ మొరాయిస్తున్నాయి. ఫలితంగా ఓ మోస్తరు వర్షం పడినా పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. ప్రధానంగా గుడివాడ, పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల పరిధిలో పంట పొలాలు నీట మునుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుడూరు, చల్లపల్లి, ఘంటసాల, తోట్లవల్లూరు, ఉయ్యూరు, గుడివాడ, పెదపారుపూడి ప్రాంతాల్లో వరి నారు మళ్లతోపాటు వెద పద్ధతిలో సాగుచేస్తున్న చేలు కూడా నీట మునిగి దెబ్బతిన్నాయి.

రైతుల్లో ఆందోళన
ఈ ఖరీఫ్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,65,879 హెక్టార్లుగా అధికారులు అంచనా వేశారు. సాగునీటి విడుదలలో జాప్యం కారణంగా ఇప్పటి వరకు 69,644 హెక్టార్లలోనే వరి సాగు జరుగుతోంది. ఉంగుటూరు, బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు, తోట్లవల్లూరు, గుడూరు, చల్లపల్లి, పెదపారపూడి, గుడివాడ తదితర ప్రాంతాల్లో 37,850 హెక్టార్లలో వెదపద్ధతిలో రైతులు వరిసాగు చేస్తున్నారు. కాలువలకు సాగు నీరు విడుదల చేయడంతో ఇప్పుడిప్పుడే కంకిపాడు, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి. కాలువలకు నాలుగు వేల క్యూసెక్కులే విడుదల చేస్తుడంతో చివరి ఆయకట్టుకు నీరు అందటం లేదు. పులిచింతల ప్రాజెక్టుకు వరద చేరితే గానీ కాలువలకు పూర్తిస్థాయిలో నీరు ఇచ్చే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో వరినాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే పంట కోతకొచ్చే సమయంలో తుపానుల బారినపడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ సమయంలో డ్రెయిన్లు పొంగి పంట పొలాలు మునిగితే పూర్తిగా నష్టపోతామని పేర్కొంటున్నారు.

అధ్వానంగా డ్రెయిన్లు
గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో పూడికతీత జరగక డ్రెయిన్లు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా బుడమేరు, చంద్రయ్య, నెహ్రాల్లీ, మోటూరు ఎల్ఎస్ మేజర డ్రెయిన్లు గుర్రపుడెక్క, పూడికతో నిండిపోయాయి. జిల్లా వ్యాప్తంగా లజ్జబండ, శివగంగ, తాళ్లపాలెం, ఏనుగుల కోడు, వన్నేరు, ముస్తాఫా కోడు, యూటీ, పెద్దలంక, గుండేరు, రత్నకోడు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, నాచు, తూడు దట్టంగా పేరుకుపోయి మురుగు నీరు దిగువకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. విజయవాడ నుంచి నందివాడ మండలం ఎల్ఎన్‌పురం వరకు ఉన్న బుడమేరులో గుర్రపుడెక్క దట్టంగా పేరుకుంది. గుడివాడ నుంచి మండవల్లి మండలం పెనుమాకలంక వరకు చంద్రయ్య డ్రెయిన్‌లో గుర్రపు డెక్క మేటవేసింది. నందివాడ నుంచి మండవల్లి మండలం నందిగామలంక వరకు ప్రవహిస్తున్న నెహ్రాల్లీ డ్రెయిన్, రాళ్లకోడు డ్రెయిన్ కిక్కిసతో నిండిపోయాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇంత వరకు పనులు ప్రారంభించలేదని టీడీపీ నాయకులే ఆరోపణలు చేస్తున్నారు. డ్రెయిన్లలో పూడిక తొలగించాలని కలెక్టర్ సైతం ఆదేశాలు ఇచ్చినా అధికారులు, కాంట్రాక్టర్లు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయిన్లలో డెక్క, తూటు, పూడిక తొలగించి మురుగు నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

టెండర్లు పూర్తయినా జరగని పనులు
ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు సక్రమంగా అందించేందుకు వీలుగా కాలువల నిర్వహణ పనులు, మరమ్మతులకు నీటి పారుదల శాఖ అధికారులు ఆలస్యంగా టెండర్లు పిలిచారు. కొంత మంది కాంట్రాక్టర్లు 40 నుంచి 48 శాతానికి పైగా తక్కువకు టెండర్లు వేశారు. తక్కువకు టెండర్లు వేసినందున అడిషనల్ డిపాజిట్లు, బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సి ఉంది. మరో వైపు కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడితో అగ్రిమెంట్ చేసుకునేందుకు కొందరు కాంట్రాక్టర్లు ముఖం చాటేస్తున్నారు. పలు చోట్ల ఎమ్మెల్యేల సూచనలతో వారి అనుకూలురైన కాంట్రాక్టర్లు అనధికారికంగానే డ్రెయిన్లలో గుర్రపు డెక్కతీత పనులు చేపట్టారు. నామమాత్రంగా పనులు చేసి, నిధులను స్వాహా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ముంపు సమస్య తొలగిపోదని, పంట చేతికి వచ్చే వరకు కంటి మీద కునుకు ఉండదని రైతులు వాపోతున్నారు.

కాలువల నిర్వహణ టెండర్లు ఇలా..		
డివిజన్	పనుల సంఖ్య	విలువ (రూ.కోట్లలో)
కృష్ణా తూర్పు	42	8.49
కృష్ణా సెంట్రల్	40	6.77
డ్రెయిన్ గుడివాడ	73	16.41
స్పెషల్	05	1.12
మొత్తం	160	32.79

ముంపు సమస్య తీవ్రం



మేజర్ డ్రెయిన్లు అయిన చంద్రయ్య, బుడమేరు, నెహ్రాల్లీ డ్రెయిన్లలో గుర్రపు డెక్క దట్టంగా పేరుకుపోయింది. దీంతో మురుగునీరు దిగువకు సక్రమంగా ప్రవహించడం లేదు. చిన్నపాటి వర్షానికి సైతం డ్రెయిన్లు ఎగదన్ని పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. డ్రెయిన్లలో పూడికతీత పనులను సత్వరమే చేపట్టాలి.
–పెన్నేరు ప్రభాకరరావు, రైతు, గుడ్లవల్లేరు

అధికారుల నిర్లక్ష్యం



డ్రెయిన్లలో పూడికతీత సమస్య తీవ్రంగా ఉన్న అధికారుల్లో చలనం లేదు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. వర్షాల వల్ల డ్రెయిన్లు పొంగిపార్లి మురుగు నీరు సక్రమంగా దిగువకు వెళ్లడం లేదు. డ్రెయిన్ల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించాలి.
– సి.నాగూర్, రైతు నందివాడ

కీసర ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఘర్షణ

- బాహాబాహీకి దిగిన స్థానికులు, స్థానికేతరులు
- స్థానికులు వరుస క్రమం పాటించకపోవడంతో వివాదం



కీసర స్టాక్ పాయింట్ వద్ద బాహాబాహీకి దిగిన స్థానికులు, స్థానికేతరులు

కంచికచర్ల: మండలంలోని కీసర ఇసుక నిల్వ కేంద్రం వద్ద సోమవారం స్థానికుల, స్థానికేతరుల మధ్య కొట్లాట జరిగింది. విజయవాడ, మచిలీపట్నం తదితర పట్టణాల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు లారీలు వచ్చాయి. అయితే స్థానికులు కొంత మంది ట్రాక్టర్లతో స్టాక్ పాయింట్ వద్దకు చేరుకున్నారు. వారు వరుస క్రమం పాటించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీ డ్రైవర్లు అభ్యంతరం తెలిపారు. వరస క్రమంలో ఇసుకను తీసుకెళ్లాలని సూచించారు. అయితే వారు తాము స్థానికులం అంటూ లారీ డ్రైవర్లను బెదిరించారు. లారీ డ్రైవర్లు ఆగ్రహంతో స్థానికులను చేతులతో గుద్దారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు మరికొంత మంది వచ్చి స్థానికేతరులతో ఘర్షణకు దిగారు. రెండు వర్గాల మధ్య తోపులాటతో పాటు కొట్లాట జరిగింది. ఈ విషయం తెలుసుకున్న సెబ్ సీఐ సత్యనారాయణ, సివిల్ ఎస్ఐ పి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం పోలీసులతో ఘటనా స్థలానికి చేరుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు. రెండు వర్గాల్లో ఎవరూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

న్యూస్‌రీల్

బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు రూ.5 లక్షల విరాళం సమర్పించారు. గుంటూరుకు చెందిన ఎన్.సాయివీణ కుటుంబ సభ్యులు సోమవారం దుర్గమ దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈఈ కె.వి.ఎస్. కోటేశ్వరరావు అమ్మ వారి చిత్ర పటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా కార్తికేయుడి పవిత్రోత్సవాలు



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆడి కృత్తిక పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోపూజ, సుప్రభాతసేవ, నిత్యార్చన, సుబ్రహ్మణ్య మూల మంత్ర అనుష్ఠానములు, హవనం, పవిత్ర జల ప్రోక్షణ, పూర్ణాహుతి, వేదాశీర్వచనం, నీరాజన మంత్రపుష్పాలతో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పతకాలతో భారత కీర్తి పతాక రెపరెపలాడాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్యారిస్‌లో జరుగుతున్న 33వ ఒలింపిక్ క్రీడల్లో భారత కీర్తి పతాక రెపరెపలాడేలా క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని కోరుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయం ఆవరణలో జాయింట్ కలెక్టర్ నిధి మీనాతో కలిసి 'ఐ చీర్ 4 భారత్' సెల్ఫీస్టాండ్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జేసీ వేర్వేరుగా సెల్ఫీ స్టాండ్‌లో సెల్ఫీలు తీసుకున్నారు. ఒలింపిక్ క్రీడల ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు, భారతీయ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపడంలో భాగంగా సెల్ఫీ స్టాండ్‌ను ఆవిష్కరించినట్లు కలెక్టర్ సృజన తెలిపారు. ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారుల బృందం సత్తాచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పారిస్ ఒలింపిక్స్‌లో షూటింగ్ క్రీడాకారిణి మను బాకర్ భారత్‌కు తొలి పతకం సాధించారని, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన క్రీడాకారులు పతకాలు కైవసం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.

వేదాద్రి నరసింహుడికి రూ.21.89 లక్షల ఆదాయం



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న యోగానంద లక్ష్మీనరసింహ స్వామికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ.21.89 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ హేమలతాదేవి తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. విదేశీ డాలర్లు 60, కరెన్సీ 25 నోట్లు వచ్చాయని పేర్కొన్నారు. నాలుగు నెలల తొమ్మిది రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని వెండి, బంగారం లెక్కింపులో రాలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యమ్మ అమ్మ వారి ఆలయ ఈఓ సీతారామయ్య, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, దుర్గాశివసాయి భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో అర్జీల పరిష్కారం

కలెక్టర్ డాక్టర్ సృజన



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీకుమారి తదితరులతో కలిసి కలెక్టర్ సృజన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమీక్ష సమావేశాలకు అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో నోట్ ఫైల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సిద్ధం చేసుకుని హాజరుకావాలని స్పష్టంచేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 111 అర్జీలు అందాయన్నారు. వీటిలో రెవెన్యూ పరిధిలో అత్యధికంగా 40 అర్జీలు అందాయి. శాఖల వారీగా పోలీస్ 18, పంచాయతీ రాజ్ 9, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిలో ఆరు చొప్పున, డీఆర్‌డీఏ 5, కోపరేటివ్, సాంఘిక సంక్షేమం నాలుగు చొప్పున, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 3, ఏపీసీపీడీసీఎల్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, విద్య, పరిశ్రమల శాఖకు సంబంధించి రెండేసి, అగ్రి ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్, ఆర్టీసీ, పౌర సరఫరాలు, దేవదాయ, అటవీ, గ్రామ/వార్డు సచివాలయం, వైద్య ఆరోగ్యం, హౌసింగ్, ఐసీడీఎస్, మైన్స్ అండ్ జియాలజీ, మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ హైవే, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌కు సంబంధించి మిగిలిన అర్జీలు అందాయి.

సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

కలెక్టర్ డాక్టర్ సృజన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, డీఆర్వో వి.శ్రీనివాసరావుతో కలిసి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) తదితరాలపై ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. పట్టణ పారిశుద్ధ్యంపై విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, గ్రామీణ ప్రత్యేక పారిశుద్ధ్యంపై డీపీఓ ఎస్.వి.శివప్రసాద్ యాదవ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సన్నద్ధతపై డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చేపడుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని, కచ్చా, పక్కా డ్రెయిన్లలో పూడిక తీత, దోమల నిర్మూలన చర్యలు, పైపులైన్ల మరమ్మతులు తదితర కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణకు గ్రామస్థాయిలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు వాటర్ ప్లాంట్లను కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు. జూలై మాదిరిగానే ఆగస్టులోనూ పెన్షన్ల పంపిణీని తొలిరోజే పూర్తిస్థాయిలో పూర్తిచేసేలా సన్నద్ధంగా ఉండాలన్నారు. 2,34,143 మంది లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే రూ.98.80 కోట్లను ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పంపిణీచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, డీఈఓ ఎస్.వి.సుబ్బారావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, జీఎం–డీఐసీ ఎ.సుధాకర్, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, ఏపీఎంఐపీ పీడీ పి.ఎం.సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బీట్‌కు సాంకేతిక హంగులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తదితరులు

- ఇకపై పోలీసుల ఈ–పహారా
- పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: సాంకేతిక హంగులతో సరికొత్తగా పోలీస్ బీట్ వ్యవస్థను రూపొందించామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు తెలిపారు. పోలీస్ నేస్తం అప్లికేషన్‌తో అనుసంధానమైన ఈ–పహారా అనే టెక్నికల్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఈ విధానంతో పోలీసుల పని తీరు అత్యంత పారదర్శకంగా ఉంటుందన్నారు. కమిషనరేట్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు.

జీపీఎస్ లోకేషన్ ఆధారంగా సక్రమమైన పద్ధతిలో పనిచేసే ఈ– పహారాతో పోలీస్ వ్యవస్థలో కొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టామన్నారు. పోలీస్ బీట్ వ్యవస్థ ఇప్పటి వరకు సంప్రదాయ పద్ధతిలో కొనసాగిందని, ఇకపై సాంకేతికతను అందిపుచ్చుకుని బీట్ వ్యవస్థను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ–పహారా పోలీస్ కమిషనర్, డీసీపీ, ఏసీపీ, సీఐల డాష్ బోర్డుకు అనుసంధానమై ఉంటుందన్నారు. బీటు కానిస్టేబుళ్లు వారికి నిర్దేశించిన బీటుల్లో ఉంటున్నారా? లేదా? అనేది సింగిల్ క్లిక్‌తో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. బీట్ సిబ్బంది పనితీరును మెరుగుపరచడానికి, ప్రజలకు సేవలు త్వరితగతిన అందించడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీలు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఆయా ప్రాంతాల ప్రజల సమస్యల పరిస్కారం దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. చెడు నడత కలిగిన వ్యక్తులు, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు సంచరించే, దొంగతనాలు జరిగే ప్రాంతాలను మ్యాపింగ్ చేసి ఉంచామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గస్తీని పటిష్టం చేసి శాంతిభద్రతలను కాపాడేదిశగా ఈ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సైబర్ సేఫ్టీ, రోడ్డు సేఫ్టీ, మహిళా భద్రతపై త్వరలో నిర్వహించే వీడియో కాంటెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీపీలు హరికృష్ణ, గౌతమిశాలి, ఏడీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏసీపీలు తేజేశ్వర్, స్రవంతిరాయ్, పార్థసారథి పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు రూ.11.17 కోట్ల రుణం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 11.17 కోట్ల రుణం మంజూరుకు ప్రతిపాదించినట్లు కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ సోమవారం సాయంత్రం నిర్వహించారు. గూడూరు మండలంలోని పోలవరం, కప్పలదొడ్డి, రాయవరం, మల్లవోలు, ఐదుగుళ్లపల్లి, పెడనటౌన్, చల్లపల్లి, గన్నవరం మండలాల్లోని ముస్తాబాద్ ప్రాంతాలకు చెందిన 25 చేనేత సహకార సంఘాలకు వర్కింగ్ క్యాపిటల్ కింద రుణం మంజూరుకు ప్రతిపాదిస్తున్నట్లు కమిటీ ఆమోదం తెలిపింది. చేనేత, జౌళిశాఖ ఆర్‌జేడీ డి.ధనుంజయరావు, ఏడీ రఘునందన్, డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ భాస్కరరావు పాల్గొన్నారు.

చర్మకారుడికి చిరు సాయం



వర్షంలో చెప్పులు కుడుతున్న కృష్ణ



కృష్ణతో ఎస్ఐ అభిమన్యు

వత్సవాయి: వర్షంలో తడుస్తూ చెప్పులు కుడుతున్న చర్మకారుడికి పోలీస్ అధికారి చేయూతనిచ్చారు. వత్సవాయికి చెందిన చర్మకారుడు ఉప్పర కృష్ణ స్థానిక జెడ్పీ సెంటర్‌లో రోడ్డు వెంట పాక వేసుకుని చెప్పులు కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం వర్షంలో తడుస్తూనే అతను చెప్పులు కుట్టడాన్ని స్థానిక ఎస్ఐ బి.అభిమన్యు చూసి చలించారు. వెంటనే సిబ్బందికి చెప్పి అతను చెప్పులు కుట్టే ప్రదేశం వద్దనే వర్షానికి తడవకుండా, ఎండ తగలకుండా చిన్నపాటి షాపు ఏర్పాటు చేయాలని సూచించి, దానికి అయ్యే ఖర్చు ఇచ్చారు. వెంటనే సిబ్బంది ఇనుప ఫ్రేమ్‌లతో షాపును తయారు చేయించారు. ఆ షాపునకు కృష్ణ పాదరక్షల ఆస్పత్రి అని పేరు పెట్టారు. అందంగా తయారు చేసిన షాపును ఎస్ఐ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐను గ్రామస్తులు అభినందించారు.

క్లుప్తంగా

నగర రంగస్థల కళాకారులకు అవార్డుల పంట



విజయవాడ కల్చరల్: జాతీయ పద్యనాటిక పోటీలలో నగరానికి చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్, సాయిబాబా నాట్య మండలి ప్రదర్శించిన చారిత్రక పద్యనాటకం పృధ్వీరాజ్ రాసోకు అవార్డుల పంట పండిందని నాటక రచయిత దర్శకుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రదర్శన పృధ్వీరాజ్ రాసో, ఉత్తమ రచన, దర్శకత్వం డాక్టర్ పీవీఎన్ కృష్ణ, ఉత్తమ రంగాలంకరణ, ఎస్. వెంకటరాయ రాజు, సతీష్, జ్యూరీ బహుమతి జీఎస్‌డీ సాయికి లభించినట్లు తెలిపారు. తిరుపతిలోని మహతీ స్టేడియంలో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 9 రోజులపాటు ఈ పోటీలు జరిగాయన్నారు. చివరి రోజు కార్యక్రమ నిర్వాహకుడు బీఎన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు వివరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు

సాక్షి ఎఫెక్ట్

పెనమలూరు: కృష్ణానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ డివిజనల్ అధికారి డి.రాజు హెచ్చరించారు. 'సాక్షి'లో ఇసుక అక్రమ తవ్వకాలు, అమ్మకాలపై 'దర్జాగా దందా' శీర్షికతో వార్త కథనం ప్రచురించటంతో ఆర్‌డీఓ వెంటనే స్పందించారు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా ఎవరూ అక్రమంగా ఇసుక తరలించినా చట్టప్రకారం చర్యలు తీసుకోవటమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి రెవెన్యూ, పోలీసు అధికారులతో ప్రత్యేక కమిటీలు వేశామని కమిటీలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాయని తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినట్లు కమిటీ నుంచి నివేదిక అందితే వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి, తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వేణు తెలిపారు. ఆగస్టు 2న రాత్రి 10 గంటలకు బయల్దేరే వాడపల్లి ప్రత్యేక బస్సు సర్వీసు వీఎం బంజరు, సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా తెల్లవారు జామున 3 గంటలకు వాడపల్లి చేరుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ బస్సుకు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, ఒక్కొక్కరికీ రానుపోను చార్జీ రూ.350గా నిర్ణయించినట్లు తెలిపారు. తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ఆగస్టు 17 సాయంత్రం 5 గంటలకు బయల్దేరి 18వ తేదీ రాత్రి అరుణాచలం చేరుతుందని తెలిపారు. 19వ తేదీ రాత్రి అరుణాచలంలో బయల్దేరి 20వ తేదీ రాత్రి తిరువూరు చేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ముందుగా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9885661835లో సంప్రదించాలని సూచించారు.

అతిసారపై ఓఆర్‌ఎస్ అస్త్రం

వర్షాకాలంలో అప్రమత్తంగా లేకుంటే ముప్పే

- కలుషిత నీరు, ఆహారం విషయంలో జాగ్రత్త వహించాలి
- ఐదేళ్లలోపు పిల్లలపై నిర్లక్ష్యం వద్దు
- ఇటీవల మన జిల్లాలోనూ డయేరియా మరణాలు
- ఓఆర్‌ఎస్ వినియోగంపై విస్తృతస్థాయిలో అవగాహన



ఐజీఎంసీ స్టేడియం వద్ద ఓఆర్‌ఎస్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పిల్లల వైద్యుల సమాఖ్య సభ్యులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): సాధారణంగా సీజన్ మారే సమయంలో పిల్లలకు డయేరియా(అతిసార) సోకే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు మే, జూన్ నెలల్లో ఎక్కువగా పిల్లలు డయేరియా(నీళ్ల విరేచనాలు) బారిన పడేవారు. ఆరు నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు డయేరియాతో మరణించిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కూడా మరణాలు మన జిల్లాలో నమోదయ్యాయి. డయేరియాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఏటా జూలై చివరి వారంలో అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాల్లో డయేరియాపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కలిగించడమే కాకుండా, నీళ్ల విరేచనాలు అయిన చిన్నారులకు తక్షణమే వైద్య సేవలు అందించడంపై అవగాహన కలిగించనున్నారు.

ఈ సీజన్‌లో జాగ్రత్త..

వర్షాకాలంలో రోటా వైరస్ కారణంగా ఉద్ధృత డయేరియా సోకుతుంది. రోటా వైరస్ తాగే నీరు, కలుషిత ఆహారం, ఇతర తినుబండారాల ద్వారా శరీరంలోకి వెళ్లి డయేరియాకి దారి తీస్తుంది. పెద్దలు, పిల్లలు అందరికీ సోకే అవకాశం ఉన్నప్పటికీ, పిల్లల్లో ప్రాణాంతకంగా మారుతుంది. ఒకప్పుడు డయేరియా కారణంగా ఏడాది లోపు చిన్నారుల్లో ఎక్కువ మంది మరణించే వారు. అందుకే కాచి చల్లార్చిన నీరు తాగడం, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. కుళ్లిన పండ్లు, వీధుల్లో అపరిశుభ్ర ప్రాంతాల్లోని ఆహారం తినకూడదు.

ఓఆర్‌ఎస్ సంజీవని..

డయేరియా సోకిన చిన్నారులకు ఓఆర్‌ఎస్ ద్రావణం సంజీవని అని చెప్పవచ్చు. ఓఆర్‌ఎస్ ద్రావణం అందుబాటులోకి వచ్చి.. ప్రజల్లో అవగాహన పెరిగిన తర్వాత డయేరియాతో పిల్లల మరణాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. మారు మూల ప్రాంతాల్లో సైతం ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంటున్నాయి. పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతున్నప్పుడు ఓఆర్‌ఎస్‌ను పట్టించడం ద్వారా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడవచ్చు.

ఐఏపీ అవగాహన కార్యక్రమాలు..

ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్(ఐఏపీ) ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద అవగాహన నడక నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లను పంచుతూ వాటి ప్రాధాన్యతను వివరించారు. వాంతులు, విరేచనాలు సమస్య చిన్నారుల్లో ఉత్పన్నమైనప్పుడు వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలని సూచించారు. అతిసార నుంచి మానవ ప్రాణాలకు కాపాడే దివ్య ఔషధం ఓఆర్‌ఎస్ అని సూచించారు. మధుమేహం ఉన్న వారు కూడా ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తీసుకోవచ్చన్నారు.

డయేరియాకు దివ్య ఔషధం ఓఆర్‌ఎస్..



డయేరియాకు ఓఆర్‌ఎస్ ద్రావణం దివ్య ఔషధం లాంటిది. ఒకప్పుడు ఏడాది లోపు చిన్నారుల్లో మరణాలు కూడా సంభవించేవి. ఇప్పుడు ప్రజల్లో అవగాహన పెరగడంతో తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీరు తాగడం, తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఒకవేళ నీళ్ల విరేచనాలు అవుతుంటే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని పట్టించాలి. ఎక్కువగా విరేచనాలు అవుతుంటే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ పరుచూరి అనిల్‌కుమార్, ఐఏపీ, రాష్ట్ర అధ్యక్షుడు

అవగాహన మరింత పెరగాలి..



ఓఆర్‌ఎస్ ద్రావణంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలి. ఇటీవల కాలంలో పలువురు డయేరియాతో ఆస్పత్రుల్లో చేరిన సంఘటనలు చూశాం. నీళ్ల విరేచనాలు ప్రారంభమైన వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలి. అప్పుడు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చూడవచ్చు. ముఖ్యంగా పిల్లలకు ఓఆర్‌ఎస్ ద్రావణం సంజీవని లాంటిదే. చిన్నారులను డయేరియా మరణాలను నుంచి ఓఆర్‌ఎస్ కాపాడుతుంది. ఇంట్లో కూడా ఓఆర్‌ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి.

– డాక్టర్ ఎస్‌ఎస్ విఠల్‌రావు, రిటైర్డ్ ఏడీఎంఈ, వైద్య విద్యాశాఖ

'ఇన్‌స్పైర్' చేద్దాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో జరిగే ఇన్‌స్పైర్ మనాక్ –2024 పోటీల్లో అన్ని పాఠశాలలు పాల్గొనాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పైర్ మనాక్ పోస్టర్‌ను జేసీ నిధి మీనా, డీఈవో యూవీ సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి డిపార్ట్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లాలోని అన్ని యజమాన్యాలకు సంబంధించిన పాఠశాలలు పాల్గొనాలన్నారు. హైస్కూల్ నుంచి ఐదుగురు, యూపీ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులను నామినేట్ చేయాలని సూచించారు. పాఠశాలలు నామినేట్ చేసే ప్రాజెక్ట్‌లలో నవ్యత, సామాజిక అవశ్యకత వంటి లక్షణాలు ఉండాలన్నారు. అలాగే స్థానిక సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆయా ప్రాజెక్ట్‌లు ఉండాలన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

సారెతో వచ్చి.. భక్తితో కొలిచి..



అమ్మవారికి సారె సమర్పణకు ఊరేగింపుగా వస్తున్న ఇంజినీరింగ్ విభాగం

దుర్గమ్మ సన్నిధిలో కొనసాగుతున్న ఆషాఢ మాసోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయ ఇంజినీరింగ్ విభాగం సారెను సమర్పించింది. బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలోని రావి చెట్టు వద్ద అమ్మవారికి ఆలయ ఈవో కేఎస్ రామరావు, డీఈవో లీలాకుమార్, ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఏఈవో ఎన్. రమేష్‌బాబు, సుధా రాణి, చంద్రశేఖర్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని ఆలయ అర్చకులకు అందజేశారు. అనంతరం సారె సామగ్రిని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, డీఈఈలు కోటేశ్వరరావు, రవీంద్రనాథ్, ఠాగూర్, ఏఈఈలు అశోక్‌కుమార్, సునీల్, మస్తానయ్య, విజయకృష్ణ పాల్గొన్నారు.



సారె సమర్పించేందుకు విచ్చేస్తున్న ద్వారకా తిరుమల దేవస్థాన అర్చకులు, అధికారులు

ద్వారకాతిరుమల దేవస్థానం నుంచి..

ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి దుర్గమ్మకు ఆషాఢ సారెను సోమవారం సమర్పించారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు ద్వారకాతిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు భాను, ఏఈవో దుర్గారావు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సారెగా పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని ఆలయ అర్చకులకు సమర్పించారు. అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి పూజా సామగ్రికి అందజేయగా, ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఈవో కేఎస్ రామరావు ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకున్న ఆర్‌పీఎఫ్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణాపై విజయవాడ డివిజన్ ఆర్‌పీఎఫ్ బృందం బొకారో ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రత్యేక తనిఖీలు చేపట్టి ఎనిమిది మంది మైనర్ బాలురను సంరక్షించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్‌పీఎఫ్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ బచపన్ బచావో ఆందోళన్ (బీబీఏ) బృందంతో కలసి బొకారో ఎక్స్‌ప్రెస్‌లో తుని–రాజమండ్రి సెక్షన్‌లలో తనిఖీలు చేపట్టారు. అందులోని స్లీపర్ క్లాస్, జనరల్ కోచ్‌లలో 8 మంది బాలురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వీరిలో జార్కండ్‌కు చెందిన ఆరుగురు, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. విచారణలో వీరిని కూలి పనుల కోసం విజయవాడ, చెన్నై, తిరుపూర్, కేరళకు తరలిస్తున్నట్లుగా తేలింది. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో మైనర్‌లను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను సైతం ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మైనర్‌ల సంరక్షణ నిమిత్తం రాజమండ్రి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎఫ్, బీబీఏ బృందాన్ని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర ప్రత్యేకంగా అభినందించారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థుల సత్తా



నాగబాలాజీని అభినందిస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల విద్యార్థి నాగబాలాజీ జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటినట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో నాగబాలాజీకి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో నాగబాలాజీ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన నాగబాలాజీ రాష్ట్ర జట్టు రజత పతకం సాధించడంలో కీలకపాత్ర వహించినట్లు తెలిపారు. విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు ధనియాల నాగరాజు, షేక్ మీరాసాహెబ్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు. హాస్టల్ వార్డెన్ ప్రకాష్, ఉపాధ్యాయుడు మోషే తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఉషారాణి

జమీగొల్వేపల్లి విద్యార్థికి సిల్వర్ మెడల్

జమీగొల్వేపల్లి(పామర్రు): చెన్నైలోని నాదల్ యూనివర్సిటీలో నిర్వహించిన 6వ ఎడిషన్ జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలలో తమ స్కూల్ విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించారని జమీగొల్వేపల్లిలోని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం టి. ఉషారాణి పేర్కొన్నారు. విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టీమ్ తరఫున తమ విద్యార్థులు ఎం. అనురాగ్, కె. ఊర్వ కె. ధనలక్ష్మి, డి. ఏసు ప్రియ, బి. వర్ష పాల్గొన్నారన్నారు. వీరిలో బాలుర టీమ్‌లో పాల్గొన్న ఎం. అనురాగ్ సిల్వర్ మెడల్ సాధించారని అన్నారు. మిగిలిన వారు కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: బాలిక(17)పై లైంగికదాడి చేసిన ముగ్గురు నిందితులు ఒక్కొక్కరికీ 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు సోమవారం తీర్పు చెప్పారు. ఈ లైంగికదాడిలో పాల్గొన్న మరో నలుగురు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. విజయవాడ కొత్తపేట ఆంజనేయస్వామి వాగు సెంటర్‌కు చెందిన బాలిక ఎనిమిదో తరగతి వరకు చదువుకుంది. తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో భవానీపురం నాలుగు స్తంభాల ప్రాంతానికి చెందిన ఉత్తరాది గురుసాయిచంద్ర అలియాస్ సాయి ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2019 సెప్టెంబర్ 29వ తేదీన బాలికను తన ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు.

ఆ తర్వాత వెంటనే అతని స్నేహితుడు గొల్ల సాయి అలియాస్ మెంటల్ సాయి, మరో ఇద్దరు మైనర్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఎవరికైనా చెబితే పెళ్లి చేసుకోనని గురుసాయిచంద్ర బెదిరించడంతో ఆమె ఎవరికీ చెప్పలేదు. ఆ మరుసటి రోజునే బాలికను గురుసాయిచంద్ర పున్నమీఘాట్‌కు తీసుకెళ్లి.. అక్కడ కొద్దిసేపు మాట్లాడుకున్న తరువాత నీలిమా థియేటర్ వెనుక వైపున ఉన్న షాదీఖానా సమీపంలోకి తీసుకెళ్లి మరోసారి లైంగికదాడి చేశాడు. ఆ తర్వాత ఆర్టీసీ వర్క్‌షాపులో పని చేసే సాయి స్నేహితుడు పెయ్యల తరుణ్‌కుమార్, మరో ఇద్దరు మైనర్లు ఆమెపై అత్యాచారం చేశారు. వీరందరూ లైంగికదాడి చేయడానికి ముందు బాలికకు మత్తు బిళ్లలు ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి భవానీపురంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ఏడాది డిసెంబర్ 12వ తేదీన నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లోని నలుగురు మైనర్లను ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ జువైనల్ జస్టిస్ బోర్డ్ వద్ద హాజరుపర్చి జువైనల్ హోంకు తరలించారు.

మేజర్‌లు అయిన గురుసాయిచంద్ర, మెంటల్ సాయి, తరుణ్‌కుమార్‌పై రౌడీషీట్ తెరిచి పోక్సో కోర్టులో హాజరుపర్చారు. బాధితురాలి తరపున పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు గురుసాయిచంద్ర, మెంటల్ సాయి, తరుణ్ కుమార్‌కు కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పోక్సో చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోక్సో చట్టాన్ని సమర్థంగా అమలు చేయడం ద్వారా లైంగిక వేధింపులను అరికట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో లైంగిక వేధింపుల నివారణపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'అరవండి', 'పరుగెత్తండి', 'చెప్పండి' నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాలికల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాలను సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికల రక్షణకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్కడక్కడ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. లైంగిక నేరాల నుంచి బాలిక రక్షణకు పోక్సో చట్టాన్ని రూపొందించామన్నారు. లైంగిక వేధింపులు, అశ్లీల చిత్రాల నేరాల బారిన పడకుండా పిల్లల బంగారు భవిష్యత్తును కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు.

తక్షణ స్పందన..

బాలికలపై వేధింపులు, దోపిడీ, హింస వంటి సంఘటనలను గుర్తిస్తే చైల్డ్ లైన్ 1098, పోలీసు 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, వంటి టోల్ ఫ్రీ నంబర్‌లకు సమాచారం అందిస్తే తక్షణమే స్పందించి తగు రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. జేసీ డాక్టర్ నిధి మీనా, డీఆర్వో వి. శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ టీఈఎం రాజు పాల్గొన్నారు.

ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా భువనగిరి వెంకట గణేష్ (ఎన్టీఆర్ జిల్లా), ప్రధాన కార్యదర్శిగా నాగరాజు (గుంటూరు) కోశాధికారిగా పాతర్లపాటి దివాకర్‌రావు (విజయవాడ) ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురంలో జరిగిన ఎన్నికలలో నూతన కమిటీ ఎన్నిక జరిగినట్లు నూతన కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు భువనగిరి వెంకట గణేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమపై నమ్మకంతో తమకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు తెలియ చేశారు. ఆర్య క్షత్రియుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

గుణదల(విజయవాడతూర్పు): పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఏపీ సమగ్ర శిక్షణ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. గుణదలలోని హయత్ ప్లేస్ హోటల్‌లో పౌష్టికాహార పంపిణీపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది.

ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతోపాటు, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆహార నాణ్యత, భద్రతపై క్వాలిటీ కంట్రోల్ విభాగం దృష్టి సారించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 80 వేల మంది ఆహార నిర్వాహకులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించే దిశగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వేదికను ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త జె. వినోద్, బీఐఎస్ డెప్యూటీ డైరెక్టర్ డి. వివేక్ వర్ధన్‌రెడ్డి, బీఐఎస్ అధికారులు, ఫుడ్ కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని హోంగార్డు మృతి

ఇబ్రహీంపట్నం: గుర్తుతెలియని వాహనం ఢీకొని హోంగార్డు మృతి చెందిన ఘటన గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ హాల్ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. ఎన్టీటీపీఎస్ ఏ కాలనీలో నివాసం ఉంటున్న కూనపురెడ్డి కృష్ణ(35) జి. కొండూరు పోలీస్ స్టేషన్‌లో గత ఆరేళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా విజయవాడ వెళ్లాడు. విధులు ముగించుకుని బైక్ తిరిగి వస్తున్న సమయంలో గుంటుపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు, జి.కొండూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

రేపు కాళీమాతకు శాకంబరీదేవి అలంకారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఈ నెల 31వ తేదీ బుధవారం కాళీమాత అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలంకారానికి అవసరమైన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను భక్తులు మంగళవారం ఉదయం 10గంటల లోపు అందజేసి సహకరించాలని కోరారు.

బ్యాడ్మింటన్‌లో ఎన్ఆర్ఐ విద్యార్థుల సత్తా



పటమట(విజయవాడతూర్పు): కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ సంఘ ఆధ్వర్యాన నగరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచారని పటమట ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. లక్ష్మణరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో చదువుతున్న సయ్యద్ హాజియ అండర్-15 సింగిల్స్‌లో రన్నరప్‌గా నిలిచారని పేర్కొన్నారు. సోమవారం హాజియాకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ చైతన్య, కోచ్ గంగాధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల అవసరాలు తీర్చడానికి తమ సంస్థ కృషి చేస్తోందని హ్యాపీ ఫీట్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు గుడిసేవ హరీష్, శ్రావణ్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా కృష్ణలంక, గోశాల, పటమట ఎలక్ట్రిసిటీ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, మిఠాయిలు పంచారు. శ్రవణ్ మాట్లాడుతూ సంస్థ సభ్యుల సహకారంతో ఇప్పటివరకు ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న 50 మంది విద్యార్థులకు రూ.20 లక్షల వరకు నగదు చెల్లించామన్నారు. ఆర్గనైజేషన్ సభ్యులు ప్రసాద్, ముఖేష్, రాజా, నాగేంద్ర, షఫీ, విజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో భారత్ అపూర్వ ప్రగతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం అపూర్వమైన ప్రగతి సాధించిందని షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారత అంతరిక్ష ప్రయాణం'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధనా రంగంలో దూసుకెళ్లడంతో శాస్త్రీయ పురోగతికి, దేశ ఆర్థిక సామాజిక ప్రగతికి అండగా నిలిచిందన్నారు. 1969 ఇస్రో స్థాపనతో భారత అంతరిక్ష యాత్రకు పునాది పడిందన్నారు. 1975లో మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను పంపారన్నారు. టెలి కమ్యూనికేషన్స్, బ్రాడ్‌కాస్టింగ్, పర్యావరణ, వైద్యారోగ్యం అనేక అంశాల్లో భారతీయ అంతరిక్ష పరిశోధనలు అండగా నిలుస్తున్నాయన్నారు. మానవ సహిత అంతరిక్ష యాత్ర, చంద్రయాన్-3 వంటి పలు అంశాలపై ఆయన ఉత్తేజపూర్వక ప్రసంగం చేశారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు ఏహెచ్‌డీ ప్రకాష్, మౌనిక, శృతి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందాలి

మైలవరం: హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్ వంటి ప్రాథమిక భాషలతో పాటు రియాక్ట్.జేఎస్ వంటి ఫ్రేంవర్క్‌లు నేర్చుకోవాలని, ఈ కొత్త నైపుణ్యాలు వెబ్ డెవలప్‌మెంట్‌లో మరింత నైపుణ్యంగా మారడానికి సహాయ పడతాయని ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ బ్రాంచ్ ఇన్‌చార్జి, భావరాజు సాయి శశాంక ఇన్ఫోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎస్. నాగాంజనేయులు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వారం రోజులు శిక్షణా కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో విద్యార్థులు వెబ్ డెవలప్‌మెంట్ ప్రాథమికాలు, ఆధునిక సాంకేతికతల వరకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామని వివరించారు. ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి. శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్స్‌గా హేమలత, సాంబ శివరావు, శ్రీకృష్ణారెడి పాల్గొన్నారు.

రోడ్డే పార్కింగ్ అడ్డా!

- పటమటలో రోడ్డుపైనే భారీ వాహనాల పార్కింగ్
- ఇదే అదునుగా చెలరేగుతున్న అసాంఘిక శక్తులు



భారీ వాహనాలను పార్కింగ్ చేసిన హెచ్‌టీలైన్ రోడ్డు

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని హైటెన్షన్ లైన్ రోడ్డు భారీ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. పటమట పంటకాల్వ రోడ్డు నుంచి ఆయుష్ ఆస్పత్రి వరకు వెళ్లే హెచ్‌టీ(హైటెన్షన్ లైన్) రోడ్డును.. 2016లో పుష్కరాల సమయంలో మూడులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయడానికి వీఎంసీ ప్రణాళిక చేపట్టింది. ఇందులో భాగంగా కొంతమేర 100 అడుగుల వరకు రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే నగరంలో బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు చాలా వరకు ట్రాఫిక్ తగ్గుతుంది. అయితే పలు సాంకేతిక కారణాలతో బిట్లుబిట్లుగా నిర్మాణం జరిగింది. పటమట రెల్లీస్ కాలనీ వద్ద పంటకాల్వ నుంచి గురునానక్ కాలనీ వరకు పనులు పూర్తవ్వలేదు. దీంతో విస్తారంగా ఉన్న ఈ రోడ్డు భారీవాహనాలకు పార్కింగ్ జోన్‌గా మారింది. కొంతమంది ట్రాన్స్‌పోర్టు వ్యాపారులు వాహనాలను ఇక్కడికి తీసుకువచ్చి పార్కింగ్ చేసి క్లీనింగ్ తదితర పనులన్నీ రోడ్డుపైనే చేస్తున్నారు. మరికొంతమంది ట్రాన్స్‌పోర్టర్లు దీర్ఘకాలంగా ఇక్కడే పార్కింగ్, వాటికి మరమ్మతులు చేయటం పరిపాటిగా మారింది.

అసాంఘిక పనులకు అడ్డా..

ఈ రోడ్డులో భారీ వాహనాలు పార్కింగ్ చేయడం, దానికితోడు వీధి దీపాలు కూడా అంతగా లేవు. దీంతో ఈ రోడ్డు అసాంఘిక పనులకు అడ్డాగా మారుతోంది. కొంతమంది ఈ ప్రాంతంలో మద్యం, గంజాయి తాగటం వంటివి చేస్తూ రాత్రి వేళల్లో స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనిపై అడిగితే దాడులు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

రేస్‌లకు వేదికగా

విశాలంగా తక్కువగా ట్రాఫిక్ ఉండే ఈ రోడ్డు బైకర్లకు, కార్ రేసులకు కూడా అడ్డాగా మారుతోంది. సాయంత్రం వేళ్లలో, చీకట్లో రేసులు కూడా నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేసినప్పుడు కొంతకాలం కార్యకలాపాలు కట్టడిలో ఉన్నా మళ్లీ సమస్య యథాతథంగా మారింది. ఈ రోడ్డులో ఏప్రిల్‌లో వరుసగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల యనమలకుదురుకు చెందిన దంపతులు వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన ఓ యువకుడు వారిని ఢీకొట్టడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు

డంపింగ్‌యార్డ్‌గా..

ఈ రోడ్డును స్థానికులు, సమీపంలో ఉన్న వ్యాపారులు డంపింగ్‌యార్డుగా మార్చేశారు. ఇంటింటి నుంచి చెత్తను, స్థానికంగా ఉండే బార్లు, ఉల్లిపాయల వ్యాపారులు, రెస్టారెంట్ల నుంచి వచ్చే చెత్తను ఇక్కడే వేయటంతో దుర్గంధం వెదజల్లుతోంది.

ఈప్రాంతంలో విధులు నిర్వహించే శానిటరీ ఇన్‌స్పెక్టర్ కూడా ఈ ప్రాంతంవైపు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డును రాకపోకలకు అవరోధంగా ఉంటున్న భారీవాహనాల పార్కింగ్‌ను నిరోధించాలని, అసాంఘిక పనులకు నెలవుగా ఉన్న ఈ ప్రాంతంలో పోలీసు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదులు వచ్చాయి

ఈ రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్‌పై ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికే పలు ట్రావెల్స్, ట్రాన్స్‌పోర్టు చేసే వ్యాపారులకు నోటీసులు ఇచ్చాం. వాటిని అక్కడి నుంచి తరలించేలా చర్యలు తీసుకుంటాం.

–రామారావు, ట్రాఫిక్ సీఐ, పటమట

చర్యలు తీసుకోవాలి

రోడ్డులో పెరుగుతున్న అసాంఘిక పనులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రివేళల్లో మద్యం సేవించేవారికి అది అడ్డాగా మారింది. బైక్‌రేసులు, ఇతరత్రా ఇక్కడ జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బెజవాడ నజీర్, అధ్యక్షుడు, యువజన చైతన్య వేదిక

రాష్ట్రంలో ఆటవిక పాలన!

- బడ్జెట్ కూడా ప్రవేశ పెట్టలేని స్థితిలో చంద్రబాబు
- శ్వేతపత్రాల పేరుతో సంక్షేమ పథకాలు ఎగ్గొట్టే ప్లాన్
- మోసపూరిత హామీలను ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోననే భయం చంద్రబాబులో ఉంది
- ప్రజలు ఏమీ అడగకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు
- మీడియాతో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలతో ఆటవిక పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ విమర్శించారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, కనీసం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని ప్రచారం చేశారనీ, సీట్లోకి వచ్చి చూస్తే ఆ నంబర్ కనిపించలేదన్నారు. దీంతో అసెంబ్లీలో రూ.10 లక్షల కోట్లు అని గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారన్నారు. వాస్తవంగా ఉన్న అప్పు ఎంతో మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారని పేర్కొన్నారు. రాష్ట్ర ఖజానాలో 2019లో అక్షరాల రూ.100 కోట్లు ఉంటే, 2024లో మీ అధికారంలోకి వచ్చే సరికి దాదాపు రూ.7 వేల కోట్లు ఉన్నాయని గుర్తు చేశారు. అప్పులు అంటూ శ్వేతపత్రాలు విడుదల చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రవేశ పెడితే సూపర్‌సిక్స్‌కు ఎంత ఖర్చు పెడుతున్నారో ప్రజలకు చెప్పాల్సి ఉంటుందన్నారు. ఇప్పుడు మోసపూరిత హామీలపై ప్రజలు ప్రశ్నిస్తారని చంద్రబాబు భయపడుతున్నాడని దేవినేని అవినాష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా, ముఠా రాజ్యం నడుస్తోందా అని ప్రశ్నించారు. పోలవరం నుంచి సంక్షేమ పథకాల వరకూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రజలు మరిచిపోలేదన్నారు. ఆయన సీఎంగా ఉంటే మాకు ఇప్పటికే అన్నీ అందేవని భావిస్తున్నారని చెప్పారు. భూముల విషయంలో కూడా అబద్ధాలు, అవాస్తవాలు చెప్పాడని, ల్యాండ్ రీ సర్వే, టైట్లింగ్ యాక్ట్ లాంటి మంచి చట్టంపై తప్పుడు ప్రచారం చేశారన్నారు. లిక్కర్‌పై శ్వేతపత్రం చూస్తే బాగా మద్యం సేవించి పడిపోయిన వాళ్లు కూడా అలా అబద్ధాలు చెప్పరని ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో సిండికేట్‌లదే రాజ్యమని, పర్మిట్‌రూమ్‌లు, బెల్ట్ దుకాణాలతో మద్యం ఏరులై పారిన విషయం అందరికీ తెలిసిందేనని దేవినేని అవినాష్ పేర్కొన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు వారిని రోడ్డున పడేశారని, పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటూ కత్తిరింపులు ఉంటాయని చెప్పకనే చెబుతున్నారని అవినాష్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం మొగల్రాజపురం సెక్షన్ జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాడవపేట కొంత ఏరియా, జాన్ స్ట్రీట్, జక్రయ్య వీధి, ఎల్లాటి ఆంజనేయులు వీధి, కార్వే ఆఫీస్ ఏరియా, వాటర్ ట్యాంక్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- ఆటోనగర్ (విజయవాడతూర్పు) : న్యూబ్రిడ్జి సెక్షన్ ఉపకేంద్రం, 11 కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళిపురం, ఎంజీరోడ్డు, బెంజిసర్కిల్‌ప్రాంతం, మైత్రేయవీధి, బీఎస్ఎన్ఎల్ హెచ్‌టీ పాయింట్‌తో పలు ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.
- మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎస్ఎన్‌బీ వాటర్ ట్యాంక్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ వెనుక ప్రాంతం, జాతీయ రహదారికి అనుకుని ఉన్న సర్వీస్ రోడ్డు, సమోసా కంపెనీ ఏరియా, అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రి, చందమామ ఆస్పత్రి ఏరియా, న్యూ పీఅండ్‌టీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, విద్యుత్ కాలనీ, సాయిబాబా గుడి ప్రాంతం, ఎస్‌బీహెచ్ కాలనీలో కొంతభాగం, పటమట ఎన్టీఆర్ విగ్రహం పరిసర ప్రాంతాలు, భద్రయ్యనగర్, నిర్మల కాన్వెంట్ రోడ్డు, కేపీనగర్, సాయిబాబా టెంపుల్ రోడ్డు, వాసవ్యనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చివరి అంకానికి ఆషాఢ ఉత్సవాలు



సారె సమర్పిస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఆషాఢ మాసోత్సవాలు ఆగస్టు 4వ తేదీతో ముగియనున్నాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పిస్తున్నాయి. సోమవారం ఏలూరు నుంచి డాక్టర్ రేవతి బృందంతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని శ్రీదుర్గ శివసాయి సేవా బృందానికి చెందిన 150 మంది, శ్రీభ్రమరాంబికా సేవా సమితికి చెందిన 90 మంది, శ్రీశివాలలితా మండలి బృందానికి చెందిన 70 మంది, బాపట్ల నుంచి విచ్చేసిన ఝాన్సీలక్ష్మి బృందానికి చెందిన 70 మందితో పాటు నగరానికి చెందిన పలువురు భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించాయి.

ఆప్కాస్ వర్కర్లకు డెత్ బెనిఫిట్స్ ఇవ్వాలి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఆప్కాస్ వర్కర్లు చనిపోతే వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ సక్రమంగా చెల్లించడం లేదని వీఎంసీపై విజయవాడ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆసుల రంగనాయకులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. నగరపాలక సంస్థలో ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, పరిపాలన, ఉద్యానవన విభాగం వంటి తదితర విభాగాల్లో సుమారు 5000 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని వీరందరికీ ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లకు వేతనాల నుంచి మినహాయించుకుంటున్నారని తెలిపారు.

అనారోగ్యం, రోడ్డు ప్రమాదాల్లో ఇటీవల కాలంలో 50 మంది ఆప్కాస్ వర్కర్లు చనిపోయారని కానీ ఇప్పటి వరకు వారి కుటుంబాలకు ఎలాంటి చెల్లింపులు చేయటం లేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై లోకాయుక్త చొరవ తీసుకుని డెత్ బెనిఫిట్ అందజేయాలని ఆయన కోరారు.

సుజనాతో ఎటువంటి గొడవలు లేవు

మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరితో తనకు ఎటువంటి గొడవలు లేవని మాజీ ఎమెల్సీ, టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు. 'నా దందాల జోలికి రావద్దు' శీర్షికన సాక్షి మెయిన్‌లో వచ్చిన కథనంపై బుద్దా వెంకన్న స్పందించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

సుజనాచౌదరి కృష్ణా జిల్లాకు ఇన్ చార్జిగా ఉన్నప్పటి నుంచి ఆయనతో అనుబంధం ఉందన్నారు. తనను టీడీపీ నగర అధ్యక్షుడిని చేసింది సుజనానే అని చెప్పారు. అనేక అంశాల్లో కేశినేని నాని తనను వ్యతిరేకించినా సుజనా ప్రోత్సహించారని చెప్పారు. నా జీవితంలో నేను ఆయనతో ఎప్పుడూ గొడవ పడనని చెప్పారు.

బుద్దా దందాలపై లోకేష్ ఆరా

'నా దందాల జోలికి రావద్దు' పేరుతో వచ్చిన కథనంపై టీడీపీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆరా తీసినట్లు తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బుద్దా వెంకన్న చేస్తున్న దందాల పేరుతో పత్రికల్లో వస్తున్న కథనాలపై నగరానికి చెందిన పలువురు నాయకులు టీడీపీ అధిష్టానానికి వివరించినట్లు సమాచారం. ఈ అంశాలపై పార్టీ అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

'సిద్ధార్థ' విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ రమేష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రవికిరణ్



ప్రతిభ చూపిన విద్యార్థులతో స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య, ఉపాధ్యాయులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్ర లయోలా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు సమీక్ష-2024 పేరుతో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి వివిధ అంశాల్లో బహుమతులను పొందారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. వారిని కళాశాల ఆవరణలో సోమవారం అభినందించారు. నగరంలోని లయోలా కళాశాల ఆవరణలో ఈ నెల 26, 27 తేదీల్లో పోటీలు జరిగాయన్నారు. టెక్నికల్ క్విజ్‌లో ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు ఏఎస్ శివకుమార్, ఐ.శివాజీ, ఎస్.రూపేష్‌లకు మొదటి బహుమతి, బ్లెండ్ టాక్ పోటీలో ఎంఎస్సీ డేటా సైన్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎం.శ్రియ ప్రథమ బహుమతి, కోడింగ్ అండ్ డీబగ్ అంశంలో ఎంఎస్సీ డేటాసైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థిని కె.గాయత్రి ద్వితీయ బహుమతి, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ పోటీలో ఎంఎస్సీ డేటా సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్.పవిత్ర, వి.దేవిశ్రీ ద్వితీయ బహుమతి పొందారన్నారు. వీరిని కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.ఉదయశ్రీ తదితరులు అభినందించారు.

జిమ్నాస్టిక్స్ పోటీల్లో సిద్ధార్థ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఈ-జింక్విన్-2024 పేరుతో ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులను గెలుచుకున్నారని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య చెప్పారు. పతకాలు పొందిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో సోమవారం అభినందించారు.

బ్యాలెన్సింగ్ భీమ్ విభాగంలో గోల్డ్, టేబుల్ వాల్ట్ విభాగంలో సిల్వర్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో సిల్వర్ పతకాలను వి.మౌనిక గెలుచుకుందన్నారు. బ్యాలెన్సింగ్ బీమ్, టేబుల్ వాల్ట్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో కె.శ్రీసరయు రజత పతకాలు గెలుపొందిందని తెలిపారు.

ఇంటర్ బాలికలకు పాఠ్యపుస్తకాలు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ పాఠశాల ప్లస్‌లో ఇంటర్ బాలికలకు టెక్స్ట్‌బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ నడకుదిటి పుష్ప, హెచ్ఎం బి.పద్మలత బాలికలకు పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పిల్లలు ప్రయోజకులైతే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలి: వైవీబీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వై.వి.బి. రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో 27, 28 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను సోమవారం ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్, కౌన్సిలర్, కార్పొరేటర్, చైర్మన్, మేయర్ ఒక నెల గౌరవ వేతనాన్ని అమరావతి అభివృద్ధికి విరాళంగా ఇవ్వాలని తీర్మానించారన్నారు. వారి గౌరవ వేతనాన్ని ప్రతి నెలా వారి బ్యాంక్ ఖాతాలో వేయాలని, గతంలో మాదిరే గ్రామాల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు కేంద్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులకు సంవత్సరంలో ఒక రోజు తిరుమల దర్శనానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ తీర్మానించామన్నారు. 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అందజేసి పరిష్కరించాలని కోరాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

నగరవాసుల ఆరోగ్యం పెంపునకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత అందంగా, సుందరంగా మార్చడానికి నగర వాసుల ఆరోగ్యాన్ని పెంచేలా గ్రీనరీని పెంపొందించాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ప్రకాశం బ్యారేజ్, ఫ్లైఓవర్, ఎంజీ రోడ్డులో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ, నగరంలో గ్రీనరీని పరిశీలించారు. నగరాన్ని మరింత అందంగా ఆహ్లాదంగా మార్చడానికి మొక్కలను నాటాలని, వాల్ పెయింటింగ్‌లను వేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే బ్యానర్లను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశించారు. కనకదుర్గ ఫ్లైఓవర్ వాల్ పెయింటింగ్స్ వేయడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద ప్రజలకు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడానికి ప్రణాళికను రచించాలని చెప్పారు. నగరంలో, డివైడర్లపై మొక్కలని మరింత పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌కు ఆదేశాలు ఇచ్చారు. అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్‌మహేష్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ వన్ రమ్య కీర్తన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 1 ఏఎస్ఎన్ ప్రసాద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ చీరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 2 శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నలందలో పెంపుడు జంతువులు, పక్షుల ప్రదర్శన



పెట్స్‌కు బహుతులు అందజేసిన వెటర్నరీ డాక్టర్ రవి, తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులకు కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లో భాగంగా నలంద విద్యానికేతన్‌లో సోమవారం పెట్ లవర్స్ వీక్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. కేర్‌వెల్ హాస్పటల్ వెటర్నరీ వైద్యుడు రవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేజీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ ఇళ్లలో పెంచుతున్న వివిధ రకాల పక్షులను, జంతువులను స్కూల్ ప్రాంగణంలో ప్రదర్శించారు. కొండచిలువ, అరేబియన్ పిల్లి, హస్కి, రంగు రంగుల చేపలు, అందమైన చిలుకలు ప్రదర్శనలో ప్రేక్షకులను కనువిందు చేశాయి. వెటర్నరీ వైద్యుడు వివిధ కేటగిరిల్లో అందమైన హెల్దీ పెట్లకు బహుమతీ ప్రదానం చేశారు. పిల్లలు తమ పెట్ గురించి, వాటితో తమ అనుబంధాన్ని ముద్దు ముద్దు మాటలతో వివరించారు. కార్యక్రమంలో కేజీ ఇన్‌చార్జి రాజేశ్వరి, స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు ఎండీఎస్ వెబ్ఆప్షన్ల నమోదుకు ఆఖరు

సాక్షి, అమరావతి: మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జన్ (ఎండీఎస్) కోర్సుల్లో రాష్ట్ర కోటా సీట్లలో 2024–25 సంవత్సరానికి ప్రవేశాలకు నేడు (జూలై 30) రాత్రి 7 గంటల్లో గా ఆన్లైన్ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సోమవారం తెలిపారు. ఇందు కోసం https://drysr.uhsap.in వెబ్సైట్ను సందర్శించాలన్నారు. నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే 9000780707 నంబర్ను సంప్రదించాలని సూచించారు. 2 ప్రభుత్వ, 13 ప్రైవేట్ డెంటల్ కళాశాలల్లో 249 ఎండీఎస్ సీట్లను భర్తీ చేయనున్నారు.

బడిలో ఏ మాధ్యమం ఉంటుందో తేల్చండి: డీటీఎఫ్

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యలో సమూల మార్పులు తీసుకువస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.నరహరి, ఎస్వీ రమణయ్య సోమవారం ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం కొనసాగుతున్నందున బోధనలో ఇబ్బందులు రాకుండా తెలుగు మీడియం అమలు చేస్తారా, లేక ఇంగ్లిష్ బోధనే కొనసాగిస్తారన్న అంశంపై విద్యా శాఖ మంత్రి స్పష్టతనివ్వాలన్నారు. ఇటీవల పదో తరగతి మాదిరి ప్రశ్న పత్రాలను ఇంగ్లిష్ మీడియంలోనే అందించారని, అయితే ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం కూడా అమలు చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. త్వరలో ఫార్మాటివ్ పరీక్షలు ఉన్నందున విద్యార్థులు ఏ మీడియంలో పరీక్షలు రాయాలో తేల్చుకోలేని పరిస్థితి నెలకొందని ఈ నేపథ్యంలో బోధనా మాధ్యమంపై స్పష్టతనివ్వాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీకి ఇంటర్ విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటి సంవత్సరం 1,08,619 మందికి, రెండో సంవత్సరం 92,134 మందికి ఒకటి రెండు రోజుల్లో వీటిని పంపిణీ చేయనుంది. ఒక్కో విద్యార్థికి 12 నోటుపుస్తకాలతో గ్రూప్ పాఠ్యపుస్తకాలు, బ్యాగ్ అందించనుంది.

వరల్డ్ రోబో పోటీల్లో లక్ష్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వరల్డ్ రోబో పోటీల్లో లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి సోమవారం తెలిపారు. హైదరాబాద్ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూలులో నిర్వహించిన వరల్డ్ రోబో ఒలింపియాడ్ చాలెంజ్లో తమ విద్యార్థులు శేష రితీష్రెడ్డి, సత్యశ్రీ పార్వతి, ఇయాన్ అడామ్బరే టీమ్ బంగారు పతకం సాధించి ఢిల్లీలో నిర్వహించే జాతీయ పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, రోబోటిక్ డీన్ సిద్ధార్థరెడ్డిని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ వందన బోహ్రా అభినందించారు.

భూముల రీసర్వే కొనసాగిస్తాం

- మంత్రి అనగాని సత్యప్రసాద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూముల రీసర్వే కొనసాగిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. గత ప్రభుత్వం సర్వే పూర్తి చేసిన 7 వేల గ్రామాల్లో మొదట గ్రామసభలు పెట్టి అక్కడ ఇబ్బందులను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మిగిలిన గ్రామాల్లో సర్వే కొనసాగించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. భూములకు సంబంధించిన అంశాలపై సోమవారం వెలగపూడి సచివాలయంలో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలను మంత్రి మీడియాకు వివరించారు. ఇకపై రైతుల భూములకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు. అలాగే గత సీఎం ఫొటోతో రైతులకు జారీచేసిన పాస్ పుస్తకాల స్థానంలోనూ రాజముద్రతో కొత్తవి ఇస్తామని, ఇందుకోసం రూ.15 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. అలాగే రైతుల భూముల్లో గత సీఎం పేరుతో ఉన్న సర్వే రాళ్లను తొలగించడానికి రూ. 20 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. కొత్త పాస్పుస్తకాలపై కూడా గతంలోలాగే క్యూఆర్ కోడ్, లొకేషన్ వివరాలు ఉంటాయన్నారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే చట్టాన్ని ఉపసంహరించుకునే ఆలోచన లేదని చెప్పారు. కానీ గడిచిన ఐదేళ్లలో 22ఏ జాబితాలో భూముల వివరాలపై అధ్యయనం చేస్తామన్నారు.

మదనపల్లె ఫైళ్ల దహనం కుట్రే: మదనపల్లె ఆర్డీవో ఆఫీసులో ఫైళ్ల దహనం కుట్ర పూరితంగా జరిగినట్టు సిసోడియా చెప్పారు. ఫైళ్లు కాలిపోయిన రోజు పాత ఆర్డీవో అక్కడకు రావడం, సీనియర్ అసిస్టెంట్ అక్కడే ఉండడంతో పాటు ఓ భూమికి సంబంధించి లక్షన్నర సొమ్మును ఆర్డీవోకు ఇవ్వడం కోసం అల్మారాలో పెట్టారని చెప్పారు. 14 వేల ఎకరాల చుక్కల భూములను 22ఏ నుంచి తొలగించడంతో పాటు ఎమ్మార్వో సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తెలుస్తోందన్నారు.

శాంతిస్తున్న గోదావరి

- ఎగువన వరద తగ్గుముఖం
- దీంతో భద్రాచలం వద్ద 43.2 అడుగులకు తగ్గిన నీటిమట్టం
- ధవళేశ్వరం నుంచి 14.42 లక్షల క్యూసెక్కులు కడలిలోకి
- ఇక్కడ 14.7 అడుగులకు తగ్గిన నీటిమట్టం.. కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక


పోలవరం వద్ద గోదావరి వరద

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/ధవళేశ్వరం : గోదావరి పరీవాహక ప్రాంతం (బేసిన్)లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎగువనున్న ప్రాణహిత, ఇంద్రావతి, శబరి తదితర ఉప నదులు, వాగులు, వంకల్లో వరద ప్రవాహం నెమ్మదిస్తోంది. దీంతో సోమవారం గోదావరిలో వరద ప్రవాహం క్రమేణ తగ్గుతోంది. ఉగ్రరూపం దాల్చిన గోదావరి శాంతిస్తుండడంతో తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజ్లోకి చేరుతున్న ప్రవాహం 5.12 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. దీనికి ఇంద్రావతి ప్రవాహం తోడవుతుండడంతో తుపాకులగూడెం (సమ్మక్క) బ్యారేజ్లోకి చేరుతున్న 8.56 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే, దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బ్యారేజ్లోకి 9.52 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతేస్థాయిలో వచ్చింది వచ్చినట్లుగా కిందకు వదిలేస్తున్నారు. మరోవైపు.. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గుతుండడంతో భద్రాచలం వద్ద సోమవారం సా.6 గంటలకు నీటి మట్టం 43.2 అడుగులకు చేరుకుంది. మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు కొనసాగిస్తున్నారు. అలాగే, పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న ప్రవాహం కూడా 11.78 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో స్పిల్ వే ఎగువన నీటి మట్టం 33.46 మీటర్లకు తగ్గింది. ప్రాజెక్టు 48 గేట్లను ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. ఆ తర్వాత ధవళేశ్వరం బ్యారేజ్లోకి 14,50,084 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టా కాలువకు 8,700 క్యూసెక్కులను వదులుతున్న అధికారులు మిగులుగా ఉన్న 14,42,384 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ బ్యారేజ్లో సోమవారం సా.6గంటలకు నీటి మట్టం 14.7 అడుగులకు తగ్గింది. 24 గంటల్లో ఒక అడుగు మేర నీటి మట్టం తగ్గింది. నీటిమట్టం 13.75 అడుగులకు దిగువకు చేరితే రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోనున్నారు. ఇక మంగళవారం ధవళేశ్వరం బ్యారేజ్లోకి చేరే వరద ఉధృతి మరింత తగ్గనుంది.

లంక గ్రామాలు అస్తవ్యస్తం

- 12 రోజులుగా వరద నీటితో సహజీవనం.. 12 మండలాల్లో 47 గ్రామాల చుట్టూ ముంపు
- మరో మూడు, నాలుగు రోజులు ఇదే పరిస్థితి.. పాడి, ఉద్యాన, ఆక్వా రైతులకు తీరని నష్టం
- వందల ఎకరాల్లో పంటలు కోల్పోయిన రైతులు
- పడవలలో ప్రయాణాలు చేయలేక స్థానికుల ఇబ్బంది


డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలో ఇప్పటికీ పడవలలోనే రాకపోకలు సాగిస్తున్న లంక ప్రజలు

సాక్షి, అమలాపురం : పాడి పంటలు.. అన్నపానీయాలు అందించి డెల్టాను సస్యశ్యామలంగా మార్చిన గోదావరే.. ఏటా ఉగ్రరూపం దాల్చి గ్రామాలను ముంచెత్తుతోంది. పాడి పంటలకు అంతులేని నష్టాన్ని మిగులుస్తోంది. అపారమైన నష్టాన్ని కలగజేస్తోంది. రోడ్లు, డ్రెయిన్లు, కాలువలను ఏకం చేస్తోంది. వాహనాలను పక్కనబెట్టి పడవల మీద రాకపోకలు సాగించేలా చేస్తోంది. చేలు, చెరువులు, ఉద్యాన పంటలను కబళిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే లంక గ్రామాలను అస్తవ్యస్థం చేస్తోంది. వరుసగా రెండుసార్లు ముంచెత్తిన గోదావరి వరద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక వాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

వరద ముంపులో 21వేల కుటుంబాలు..

గోదావరి వరదలవల్ల జిల్లాలో 12 మండలాల్లోని 47 శివారు గ్రామాలు నీట మునిగాయి. 21,492 కుటుంబాలు వరద ముంపు బారినపడ్డాయి. పి.గన్నవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, ఐ.పోలవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో ఇది అధికంగా ఉంది. వరదకు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎక్కడికక్కడ స్థానికులు పడవల మీదే రాకపోకలు సాగిస్తున్నారు. ఎటుచూసినా వరద నీరు తప్ప మరొకటి కనిపించడంలేదని లంక వాసులు వాపోతున్నారు. అల్లవరం మండలం బోడసుకుర్రు, ముమ్మిడివరం మండలం ఠానేలంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇక్కడ 293 కుటుంబాలకు చెందిన 809 మందికి పునరావాసం కల్పించి ఆహార పొట్లాలను అందిస్తున్నారు. ఎనిమిది గృహాలు దెబ్బతిన్నాయి. 3,943.30 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అరటి, కంద, పసుపు, కర్ర పెండలం, కోకో పంటలతోపాటు కూరగాయ పంటలకు అధిక నష్టం కలిగింది. పన్నెండు రోజులుగా నదీపాయల్లో వరద కొనసాగుతుండడంవల్ల డెల్టాలోని మురుగునీటి కాలువల ద్వారా ముంపు నీరు దిగడంలేదు. వరద నీరు రాకుండా అవుట్ ఫాల్ స్లూయిజ్లు మూసివేశారు. ఇదే సమయంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డెల్టాలో వరిచేలు నీట మునగడంతో పంట దెబ్బతింది. అధికారుల లెక్కల ప్రకారం ఇక్కడ 2,734 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. కానీ, ఇంతకు రెట్టింపు నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. వీటితోపాటు 300 ఎకరాల్లో వెనామీ రొయ్యల సాగు తుడుచుపెట్టుకుపోయిందని అంచనా.

పాలు మా వద్దే ఉండిపోతున్నాయి..



నాకు మూడు గేదెలున్నాయి. రోజుకు ఆరు లీటర్ల పాలు వస్తాయి. పాలు కొనుగోలు చేసే వ్యాపారులు వరదలు కారణంగా రావడంలేదు. ఇంట్లోనే కొంత వాడాల్సి వస్తోంది. వరదలవల్ల పచ్చగడ్డి కొరత అధికంగా ఉంది. గతంలో వరదల సమయంలో ఎండు గడ్డి ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడంలేదు.

– కుసుమ కోటేశ్వరరావు, అయినవిల్లి లంక, అయినవిల్లి మండలం

ఈ నాలుగు నెలలు పడవ ప్రయాణమే..



వరదలు ఉండే ఈ నాలుగు నెలలు పడవ మీదనే రాకపోకలు చేయాల్సింది. ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకు రేవు దాటి బస్సుపై నరసాపురం వెళ్తుంటా. తిరిగి వచ్చేసరికి రాత్రి ఏడవుతుంది. ఎక్కువ సమయం పడవ మీదే సరిపోతోంది. తిరిగొచ్చే వరకూ ఇంట్లో వారికి ఆందోళనే.

– దొడ్డా శివ, బూరుగుపూడి, పి.గన్నవరం మండలం

బీర, బెండ పంట దెబ్బతింది..



రెండు ఎకరాల్లో బీర, బెండ పాదులు సాగుచేశా. ఎకరాకు రూ.40 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. పంట మంచి కాపు మీద ఉంది. దిగుబడి బాగా వస్తుందని ఆశించాను. 11 రోజులుగా వరదలు ముంచెత్తడంతో కాయగూర పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి. పాదులు కుళ్లిపోయాయి. పెట్టుబడులు కూడా వచ్చే అవకాశంలేదు. లంక గ్రామాల్లో రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి.

– ధూళిపూడి రామకృష్ణ, సలాదివారిపాలెం, ముమ్మిడివరం మండలం

చెరువులను ముంచేసింది



అన్నంపల్లిలో నాలుగు ఎకరాల్లో ఆక్వా సాగుచేశా. ఈసారి కౌంట్ అనుకున్నంత వేగంగా రాలేదు. దీంతో చెరువుల పట్టుబడులు ఆలస్యమయ్యాయి. ఆగస్టులో రావాల్సిన వరద జూలైలో వచ్చింది. చెరువులు మొత్తం మునిగిపోయాయి. కౌంట్ 120 ఉన్న సమయంలో పట్టుబడులు చేసినా అనుకున్నంత రేటు రాలేదు. నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. – దంతులూరి నానిరాజు, అన్నంపల్లి, ఐ.పోలవరం మండలం

సాయం అందించాలి..



ఏటా వరదల సమయంలో వేటకు విరామం ప్రకటించాల్సి వస్తోంది. మాకు చేపల వేట మాత్రమే జీవనోపాధి. వేటకు వెళ్లకపోతే కుటుంబ పోషణ కష్టం. వరదల సమయంలో ప్రభుత్వం నిత్యావసర వస్తువుల రూపంలో ఇచ్చే సాయం కంటే ఆర్థికంగా సాయం అందించాలి.

– సంగాడి ముత్యాలు, మత్స్యకారుడు, మసకలపల్లి. కె.గంగవరం మండలం

సాగర్ వైపు కృష్ణమ్మ బిరబిరా..

- శ్రీశైలం ప్రాజెక్టులోకి 4.52 లక్షల క్యూసెక్కులు ప్రవాహం
- 879.3 అడుగుల్లో 184.70 అడుగులకు చేరిన నిల్వ
- ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 82వేల క్యూసెక్కులు దిగువకు నీరు విడుదల
- కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ కూడా దిగువకు..
- దీంతో నాగార్జునసాగర్లోకి పెరుగుతున్న వరద
- 512.6 అడుగుల్లో 136.13 టీఎంసీల నిల్వ


శ్రీశైలం డ్యామ్ నుంచి మూడు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్టు: నాగార్జునసాగర్ వైపు కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి సోమవారం రాత్రి 7 గంటలకు 4,52,583 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 879.3 అడుగుల్లో 184.70 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి భారీ వరద వస్తుండటం.. నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లు పది అడుగుల మేర ఎత్తి 82వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు వదిలేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 23 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులను తరలిస్తున్నారు. మరోవైపు.. శ్రీశైలం స్పిల్ వే గేట్లు, విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు విడుదల చేస్తున్న ప్రవాహం నాగార్జునసాగర్ వైపు పరుగులు తీస్తోంది. సాగర్లోకి సోమవారం సా.6 గంటలకు 54,772 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 512.6 అడుగుల్లో 136.13 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా.. పూర్తినిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సాగర్ నిండాలంటే ఇంకా 176 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి వరద ప్రవాహం ఇదే రీతిలో కొనసాగితే మరో ఆరేడు రోజుల్లో నాగార్జునసాగర్ నిండే అవకాశం ఉంటుంది.

స్థిరంగా వరద ప్రవాహం..

మహారాష్ట్ర, కర్ణాటకలలోని పశ్చిమ కనుమల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా, ఉప నదుల్లో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యాంలోకి 3 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతేస్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యాంలోకి 2.90 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 2.70 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక తెలంగాణలోని జూరాల ప్రాజెక్టులోకి 3.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 3.11 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే, కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. తుంగభద్ర డ్యాంలోకి 1.31 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.06 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్ నుంచి దిగువకు విడుదల చేస్తున్న ప్రవాహంతో మంత్రాలయం వద్ద తుంగభద్ర నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నీటి మట్టం 311 మీటర్లు (సముద్ర మట్టానికి) కొనసాగుతుండటంతో మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఇక సుంకేశుల బ్యారేజ్లోకి 1.51 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. కేసీ కెనాల్కు 1,504 క్యూసెక్కులను వదులుతూ మిగులుగా ఉన్న 1.48 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఇటు సుంకేశుల నుంచి.. అటు జూరాల నుంచి వరద వస్తుండటంతో శ్రీశైలంలోకి చేరుతున్న ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది.

పిలిపించుకొని.. పరామర్శ

- వరద బాధితులను చులకన చేసిన జనసేన ఎమ్మెల్యే అంజిబాబు
- తన కార్యాలయానికి రప్పించుకొని ప్రభుత్వ సాయం అందజేత
- ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు


భీమవరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరద ముంపు బాధితులకు ప్రభుత్వ సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు తదితరులు

భీమవరం: భారీ వర్షాలు, వరదల వల్ల సర్వం కోల్పోయి కష్టాల్లో ఉన్న బాధితులతో భీమవరం జనసేన ఎమ్మెల్యే అంజిబాబు చులకనగా వ్యవహరించారు. వరద ప్రభావిత ప్రాంతాలను స్వయంగా పరిశీలించి బాధితులకు అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే.. ప్రతిగా తన వద్దకే బాధితులను రప్పించుకున్నారు. తూతూమంత్రంగా సాయమందించి చేతులు దులుపుకున్నారు. వివరాలు.. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల భీమవరంలోని పలు వార్డుల్లోని ప్రజల నివాసాల్లోకి వరద నీరు చేరింది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సుమారు 32 కుటుంబాలను ప్రభుత్వం సురక్షిత ప్రాంతానికి పంపించింది. ఈ నేపథ్యంలో వరదల వల్ల నష్టపోయిన ఒక్కొక్క కుటుంబానికి రూ.3 వేలు ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళా దుంపలు, లీటర్ పామాయిల్ అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో భీమవరంలో 32 మందికి రూ.3 వేల చొప్పున రూ.96 వేలు, 444 మందికి ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసరాలు ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సహాయాన్ని బాధితుల వద్దకు వెళ్లి పంపిణీ చేయాల్సిన ఎమ్మెల్యే అంజిబాబు వారినే పట్టణంలోని తన క్యాంపు కార్యాలయానికి రప్పించి అందజేశారు. ఎమ్మెల్యే తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంటే అంత చులకనైపోయారా అని మండిపడ్డారు.

14 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

- తాత్కాలిక షెడ్యూల్ విడుదల చేసిన ఎంసీసీ
- ఏపీ నుంచి అర్హత సాధించిన 43,788 మంది విద్యార్థులు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆల్ ఇండియా కౌన్సెలింగ్ ఆగస్టు 14 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) తాత్కాలిక షెడ్యూల్ను సోమవారం విడుదల చేసింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి స్ట్రే వేకెన్సీ రౌండ్కౌన్సెలింగ్ను ముగించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. అక్టోబర్1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నీట్ యూజీ–2024 తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. కాగా, ఇటీవల సవరించిన మార్కులు, ర్యాంకుల జాబితాను ఎన్టీఏ విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో 64,299 మంది విద్యార్థులు నీట్ రాయగా 43,788 మంది అర్హత సాధించారు. జూన్ 4 తేదీ నాటి ఫలితాలతో పోలిస్తే ఏపీలో 70 మంది విద్యార్థులు అనర్హులుగా మారారు. రాష్ట్రం నుంచి నీట్లో అర్హత సాధించిన విద్యార్థులు ఎన్టీఏ నుంచి వైఎస్సార్ విశ్వవిద్యాలయానికి రావాల్సి ఉంది. వర్సిటీ ప్రతినిధి ఢిల్లీకి వెళ్లి ఈ సమాచారం తీసుకుని రావాల్సి ఉండగా, ఇప్పటి వరకూ ఢిల్లీ నుంచి ఎటువంటి పిలుపు రాలేదు. ఇక ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ ప్రారంభమైన అనంతరం రాష్ట్రస్థాయిలో వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ కౌన్సెలింగ్ ప్రారంభించనుంది.

కౌన్సెలింగ్ రౌండ్	రిజిస్ట్రేషన్/ పేమెంట్	ఆప్షన్ల నమోదు	సీట్ల కేటాయింపు ఫలితాలు	కళాశాలల్లో రిపోర్టింగ్
మొదటి విడత	ఆగస్టు 14-21	ఆగస్టు 16-20	ఆగస్టు 23	ఆగస్టు 24-29
రెండో విడత	సెప్టెంబర్ 5-10	సెప్టెంబర్ 6-10	సెప్టెంబర్ 13	సెప్టెంబర్ 14-20
మూడో విడత	సెప్టెంబర్ 26- అక్టోబర్ 2	సెప్టెంబర్ 27- అక్టోబర్ 2	అక్టోబర్ 5	అక్టోబర్ 6-12 వరకు
స్ట్రే వేకెన్సీ రౌండ్	అక్టోబర్ 16-20	అక్టోబర్ 17-20	అక్టోబర్ 23	అక్టోబర్ 24-30

2029 నాటికి పేదలందరికీ

ఇళ్లు కట్టిస్తాం

- గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదలందరికీ 2029 నాటికి ఇళ్లు నిర్మిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన 8.25 లక్షలను ఏడాదిలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. వందరోజుల్లో మరో 1.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలా కార్యాచరణ ఉందన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాల కోసం వేసిన లేఅవుట్లలో ఎవరికీ కేటాయించని భూమిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణంపై విచారణ చేపడతామన్నారు. పీఎంఏవై 2.0లో కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు యూనిట్కు రూ.4 లక్షలు మంజూరు చేస్తామని చెప్పారు. మధ్యతరగతి వర్గాల కోసం గృహనిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వమే స్థలాన్ని సేకరించి కాంట్రాక్టర్ల ద్వారా ఇంటిని నిర్మించి సరసమైన ధరలకు అందిస్తుందని చెప్పారు.

సారూ.. మాకు విద్యాకానుక అందలేదు


సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్యతో మాట్లాడుతున్న విద్యార్థినులు

నాయుడుపేట టౌన్ (తిరుపతి జిల్లా): గత జగనన్న ప్రభుత్వంలో మాకు విద్య కానుక అందింది. ఇప్పుడు చంద్ర బాబు పాలనలో రాలేదు' అంటూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థినులు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎదుట వాపోయారు. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి సమీపంలో ఉన్న విద్యార్థినులు వసతి గృహానికి వెళుతూ మార్గం మధ్యలో సంజీవయ్యను ఆయన నివాసం వద్దకు వచ్చి కలిశారు. తాము ఉంటున్న వసతి గృహం అద్దె భవనంలో ఉందని కొంత ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం భవనం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు విన్నవించాలని సంజీవయ్య కోరారు.

వైఎస్సార్ ఏఎఫ్యూలో కౌన్సెలింగ్ ప్రారంభం


విద్యార్థికి ప్రవేశపత్రం అందజేస్తున్న వీసీ

ఏఎఫ్యూ: వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఏడీసెట్–24 కమిటీ చైర్మన్, ఇన్చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ ఆధ్వర్యంలో ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏడీసెట్)–2024కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించారు. ఒక్క రోజే 50 మందికిపైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు. బీఎఫ్ఏలో పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్స్, శిల్పం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. అనంతరం విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందజేశారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు ప్రవేశాల కోసం రావడం విశేషం. వైవీయూ ఇన్చార్జి రిజిస్ట్రార్ పాల్గొన్నారు.





లీగల్

తల్లిదండ్రులకు ఆ హక్కు ఉంటుంది!

ప్రదీప్, శాంత భార్యాభర్తలు. ఇద్దరూ 60 ఏళ్లకు పైబడిన వారే! ఇద్దరికీ బీపీ, సుగర్లున్నాయి. వాళ్లకిద్దరు పిల్లలు. మంచి జీతాలు గల ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కానీ అమ్మానాన్నలను పూర్తిగా గాలికి వదిలేయడంతో దయనీయమైన స్థితిలో రోజులను గడుపుతున్నారు ఆ దంపతులు. పిల్లల నుంచి పోషణ కోసం వీరు కోర్టును ఆశ్రయించవచ్చా?

తల్లిదండ్రుల, వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 కింద తల్లిదండ్రులకు, వయోవృద్ధులకు చాలా హక్కులే ఉన్నాయి. ముఖ్యంగా తమను తాము పోషించుకోలేని, తమ సంక్షేమాన్ని, తమ ఆరోగ్యాన్ని తాము పర్యవేక్షించుకోలేని తల్లిదండ్రులు, వయోవృద్ధులకు... తమ పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు లేదా బంధువుల (వయోవృద్ధుల ఆస్తికి వారసులు లేదా ఆర్థికంగా గానీ, మరేరకంగా గానీ లబ్ధి పొందిన వారు)ను మెయింటెనెన్స్ అడిగే హక్కును కలిపిస్తోందీ చట్టం. ఈ చట్టం కింద వయోవృద్ధులు, తల్లిదండ్రులు నేరుగా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు (స్థానిక ఆర్డీఓ). అలా ఆశ్రయించలేని పరిస్థితుల్లో ఉంటే వాళ్ల పక్షాన ఓల్డ్ ఏజ్ హోమ్ లాంటి ఏ సంస్థ అయినా పిటిషన్ దాఖలు చేయవచ్చు. నోటీసులు అందిన 90 రోజులలోగా పిటిషన్‌పై విచారణ జరిపి ఆదేశాలు ఇవ్వవలసి ఉంటుంది. ఇంటెరిమ్ మెయింటెనెన్స్‌కు కూడా ఆదేశించవచ్చు. వారసులు, పిల్లలు లేదా బంధువులు ట్రిబ్యునల్ ముందుకు రానట్లయితే... ట్రిబ్యునల్ క్రిమినల్ కోర్ట్‌లా కూడా వ్యవహరించవచ్చు. స్థిరాస్తులకు సంబంధించి ఏ ఇతర చట్టాల్లో లేని వెసులుబాటు, హక్కు కేవలం ఈ చట్టంలోనే పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ కలిగి ఉన్నారు. ఏ ఇతర ప్రాపర్టీ చట్టాలకిందైనా ఒకసారి అమ్మేసిన లేదా గిఫ్ట్‌గా ఇచ్చిన స్థిరాస్తిని తిరిగి తీసుకోవడం కానీ రద్దు చేయడం కానీ కుదరదు. కానీ ఈ 2007 చట్టం కింద మాత్రం ఆస్తిని తమ సంతానానికి లేదా తన బంధువులకు లేదా మరే ఇతర వ్యక్తికైనా రాసిచ్చేటప్పుడు 'మమ్మల్ని చూసుకోవాల్సిన బాధ్యతను నిర్వర్తించాలి.. లాంటి నిబంధనతోనే ఈ ఆస్తిని రాసిస్తున్నాను' అంటూ ఆస్తిపత్రాలలో పొందుపరచి.. దాన్ని సదరు వారసులు ఉల్లంఘిస్తే.. తమ ఆస్తిని తాము తిరిగి తీసేసుకోవచ్చు.

చాలా సందర్భాలలో ఆస్తి రాయించుకున్న తర్వాత తల్లిదండ్రులను లేదా వృద్ధులను ఓల్డేజ్ హోమ్స్‌లో వదిలేయడం లేక సరిగ్గా పట్టించుకోకపోవడం చూస్తుంటాం. అలాంటి సందర్భాలకు ఈ చట్టం చక్కటి ఆయుధం. పైన తెలిపిన నిబంధన కలిగి ఉన్న ఆస్తి పత్రాలను మరెవరైనా కొనుగోలు చేస్తే, అలా కొనుక్కున్న వారిపైనా మెయింటెనెన్స్ విధించవచ్చు. అంతేకాదు వయోవృద్ధులను లేదా తల్లిదండ్రులను వదిలించుకుందామని వారిని ఎక్కడికైనా తీసుకెళ్లి వదిలేయడం లాంటివి చేస్తే అది నేరం. వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుంది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వకేట్

నాలుక అబద్ధం చెప్పదు

నీర్ దోసె అంటే నూనె వేయకుండా పెనం మీద నీటిని చల్లి వేసే దోసె. మైసూర్ మసాలా దోసె, రసం ఇడ్లీ, టొమాటో ఉప్మా, ఆనియన్ ఊతప్పం... ఇవన్నీ మనకు తెలిసినవే. ఖోట్టో... ఇది ఇడ్లీ పిండిని పనస ఆకులతో అల్లిన బుట్టలో వేసి ఆవిరి మీద ఉడికించే వంటకం. ఈ దక్షిణాది రుచుల పేరు చెబితే ముంబయి వాసుల నోట్లో నీళ్లూరతాయి. క్రికెట్ ప్లేయర్లు సునీల్ గవాస్కర్, సచిన్ టెండుల్కర్‌లు ఈ రుచుల కోసం ముంబయి నగరం, మాతుంగలో ఉన్న మైసూర్ కేఫ్‌ను విజిట్ చేసేవాళ్లు. స్వాతంత్య్రానికి ముందు 1936 నుంచి ముంబయిలో స్టవ్ వెలిగించిన ఈ కేఫ్‌కి గవాస్కర్, సచిన్‌ల కంటే ముందు ఏ ప్రముఖులు క్యూ కట్టారో తెలియదు. కొత్త పెళ్లికొడుకు అనంత్ అంబానీ ఆదివారాలు ఇక్కడే గడిపేవాడని ఇటీవల తెలిసింది. తన పెళ్లి వేడుకలో ఈ కేఫ్ స్టాల్ కూడా పెట్టించారు. వధువు రాధికా మర్చంట్‌కు ఈ కేఫ్ నిర్వాహకురాలు శాంతేరీ నాయక్‌ను చూపిస్తూ 'మీట్ మైసూర్ కేఫ్ ఓనర్' అని పరిచయం చేశాడు. వధువు ఆ పెద్దావిడ పాదాలను తాకి నమస్కరించింది. ఈ వీడియోతో శాంతేరీ ఒక్కసారిగా దేశం దృష్టిని ఆకర్షించింది.

ముంబయి నగరం, మాతుంగ ఏరియాలో కింగ్స్ సర్కిల్ రైల్వేస్టేషన్ దగ్గర ఉంది మైసూర్ కేఫ్. శాంతేరీ నాయక్ మామగారు నాగేశ్ రామ నాయక్ ఈ కేఫ్‌ను స్థాపించాడు. కర్నాటక నుంచి ముంబయిలో అడుగు పెట్టి ఆహారమే తన కుటుంబానికి అన్నం పెడుతుందని నమ్మారాయన. ఆ నమ్మకాన్ని నిలబెట్టారు శాంతేరీ నాయక్. ఇప్పుడామె కుమారుడు నరేశ్ నాయక్ సహాయంతో కేఫ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'బెస్ట్ సౌత్ ఇండియన్ రెస్టారెంట్' అనే ప్రజల ప్రశంసలే ఆమె అందుకున్న పురస్కారాలు. వివిధ ప్రదేశాలను పర్యటించడం ఆమె హాబీ. పర్యటనలో

టూర్‌లో 'టేస్ట్' చూస్తాను

భాగంగా ఆయా ప్రదేశాల్లో ఏయే ఆహారాలు అందుబాటులో ఉంటున్నాయి, పర్యాటకులు ఏ రుచులను ఎక్కువగా ఇష్టపడుతున్నారో గమనిస్తూ, వాటిని రుచి చూస్తానని చెప్తారామె.



అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌లతో శాంతేరీ నాయక్

కస్టమర్ అభిప్రాయమే తుదితీర్పు

"వంటలను ఇష్టపడడమే నా సక్సెస్ ఫార్ములా. అమ్మకు సహాయం చేసే క్రమంలోనే రుచిగా వండడంలో మెళకువలు తెలిశాయి. అమ్మ వండిన పదార్థాలను ఇంటికి వచ్చిన అతిథులకు వడ్డించే బాధ్యత కూడా నాదే. వాళ్లకు ఏది నచ్చిందో అర్థమయ్యేది. అదే ఫార్ములాను కేఫ్ నిర్వహణలోనూ అనుసరించాను. మన ఉద్యోగులను నమ్మాలి, అంతకంటే ఎక్కువగా కస్టమర్లను నమ్మాలి. రుచి, అభిరుచుల విషయంలో కస్టమర్‌ల నోటి నుంచి వచ్చిన మాటే వేదవాక్కు. పదార్థాల రుచిని ఆస్వాదించిన నాలుక ఫీడ్ బ్యాక్ విషయంలో అబద్ధం చెప్పదు'' అంటారు శాంతేరీ నాయక్. డెబ్బైఏళ్ల వయసులో కూడా చురుగ్గా, కేఫ్ నిర్వహణ పట్ల శ్రద్ధగా ఉన్నారామె. వార్ధక్యం దేహానికి మాత్రమే, మనసుకు కాదు, పనిచేసే మనస్తత్వానికి కాదని నిరూపిస్తున్నారు శాంతేరీ నాయక్.



కుమారుడు నరేశ్‌నాయక్‌తో శాంతేరీ నాయక్

వచ్చేస్తాగా..!

సాహసం అంటే సునీతకు సరదా! అంతరిక్షంలో భారరహిత స్థితిలో తలకిందులుగా తేలియాడుతూ... 'డ్యూటీ' చేయటం ఆమెకొక విహారం. ఇక స్పేస్‌లో ఉన్నన్నాళ్లూ ఒక్క రోజు కూడా ఆమె వ్యాయామం ఆపలేదు! ఆరోగ్యానికి, ఎముకల దృఢత్వానికి మేలు చేసే ఎక్సర్‌సైజ్‌లే అన్నీ. మానసికంగా శక్తినిచ్చే సాధనకు సైతం ఏనాడూ ఆమె విరామం ఇవ్వలేదు. ఆ సాధనే... అనుదిన భగవద్గీత పఠనం. ప్రస్తుతం సునీత ఆ అంతరిక్షంలోనే చిక్కుబడిపోయారు. భూమిపై అందరూ ఆమె కోసం భయాందోళనలు చెందుతూ ఉంటే ఆమె మాత్రం... చిరునవ్వుతో... "వచ్చేస్తాగా..." అని తనే రివర్స్‌లో నాసాకు, భారతీయులకు నమ్మకం ఇస్తున్నారు!

సునీతా విలియమ్స్ గత 53 రోజులుగా అంతరిక్షంలోనే ఉండిపోయారు. సునీతను, సహ వ్యోమగామి బచ్ విల్మోర్‌ను భూకక్ష్యకు 400 కి.మీ ఎత్తున ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఐ) విజయవంతంగా మోసుకెళ్లిన 'బోయింగ్ స్టార్‌లైనర్' వ్యోమనౌక తీరా వారిని అక్కడికి చేర్చాక చేతులెత్తేసింది. జూన్ 5న వాళ్లు వెళ్లారు. తిరిగి జూన్ 12కి, కనీసం జూన్ 15 కి వారు భూమి పైకి రావలసింది. స్టార్‌లైనర్‌లోని రాకెట్ మోటార్లు (థ్రస్టర్స్) మొరాయించటంతో విల్మోర్‌తో పాటుగా సునీత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. మరోవైపు నాసా టీమ్ భూమి మీద నుంచే ఆకాశంలోని స్టార్‌లైనర్‌కు నెలన్నరకు పైగా మరమ్మతులు చేస్తూ ఉంది. స్టార్‌లైనర్ మానవ ప్రయాణానికి పనికొస్తుందా లేదా అని ప్రత్యక్షంగా పరీక్షించేందుకు వెళ్లిన సునీత, విల్మోర్ అక్కడే ఉండిపోయారు. వారు ఎప్పటికి తిరిగొస్తారు అనే ప్రశ్నకైతే ఇప్పటి వరకు సమాధానం లేదు. తాజాగా చిన్న ఆశ మినుకుమంది! థ్రస్టర్స్‌ని మండించి చూసిన నాసాకు అవి పని చేయబోతున్న సంకేతాలు కనిపించాయి. ఇది గుడ్ న్యూస్. నాసాకే కాదు, సునీతా విలియమ్స్ సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్న యావత్భారతావనికి కూడా. "స్టార్‌లైనర్ మమ్మల్ని భూమికి చేర్చుతుందని నా మనసు చెబుతోంది'' అని సునీత భూమి పైకి సందేశం పంపారు. ''ఆమె చాలా ధైర్యంగా ఉన్నారు'' అని సహ వ్యోమగామి విల్మోర్ ఆమె గురించి గొప్పగా చెప్పారు.



● వైరల్ అయిన సునీతా విలియమ్స్ స్పేస్ డాన్స్

అంతరిక్షంలో డాన్స్!

విల్మోర్ చెప్పారనే కాదు.. సునీతా విలియమ్స్ గట్టి అమ్మాయి. భూమి మీద ఉండి మనం ఆమె గురించి భయపడుతున్నాం కానీ.. అంతరిక్షంలో ఆమె ఉల్లాసంగా గడుపుతున్నారు. నాసా వారు ఇచ్చిన వీక్ ఆఫ్‌ని చక్కగా ఎంజాయ్ చేశారు. ఇంటికి ఫోన్ చేసి మాట్లాడారు. గేమ్స్ ఆడుతున్నారు కూడా. ఇంకా.. మైక్రో గ్రావిటీలో మొక్కలు నీటిని ఎలా సంగ్రహిస్తాయో సునీత పరీక్షిస్తున్నారు. నిజానికి రోదసీయానం సునీతా విలియమ్స్‌కి ఇదే మొదటిసారి కాదు. 2006లో, 2012లో ఐఎస్ఎస్‌కి వెళ్లారు. 322 రోజులు అంతరిక్షంలో గడిపారు. మొత్తం కలిపి 50 గంటల 40 నిముషాల పాటు స్పేస్ వాక్ చేశారు. ఈసారి అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగానే ఆనందంతో ఆమె డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయింది కూడా. సునీతకు అంతరిక్ష యాత్ర ఇదే తొలిసారి కాకున్నా.. బోయింగ్ స్టార్ లైనర్‌తో మానవ సహిత యాత్రను నిర్వహించటం నాసాకు మొదటిసారే.

కన్నవారి కల

కల్పనా చావ్లా తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన భారతీయ మూలాలు కలిగిన రెండో మహిళ సునీతా విలియమ్స్. అమెరికాలోని ఒహాయో పట్టణంలో 1965లో జన్మించారు సునీత. ఆమె తండ్రి దీపక్ పాండ్యా గుజరాతీ. తల్లి ఉర్సులిన్ స్లొవేనియా మహిళ. సునీత ఫిజిక్స్ లో డిగ్రీ చేశారు. ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. అమెరికన్ నావికాదళంలో కొన్నాళ్లు డైవింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేశారు. 1998లో రోదసీయానంలో శిక్షణ తీసుకున్నారు. వ్యోమగామి కావాలన్నది మాత్రం తల్లిదండ్రుల కల. ఆ కల నెరవేరటానికి కూడా కారణం అమ్మానాన్నే అంటారు సునీత. సునీత త్వరగా భూమిపైకి తిరిగి రావాలని ఆకాంక్షిద్దాం.

సినిమా



● ప్రభాస్

పుష్ప గుచ్ఛం ఎవరికి?

ప్రభాస్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో ఈ సినిమాను టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి సోమవారం ఫ్యాన్ ఇండియా వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోలో బైక్ నడుపుకుంటూ వచ్చి, ఒకచోట ఆగి చేతిలోకి పుష్ప గుచ్ఛం తీసుకుని, బైక్ అద్దంలో తన ముఖాన్ని చూసి, మురిసిపోతూ పువ్వుల రెక్కలతో దిష్టి తీసుకుంటూ కనిపించాడు రాజా సాబ్. మరి... ఈ పుష్ప గుచ్ఛాన్ని ఎవరికి ఇస్తాడో సినిమాలో చూడాలి. ''రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతోన్న చిత్రం 'రాజా సాబ్'. ప్రభాస్ ఇప్పటివరకూ చేయని జానర్‌తో పాటు ఆయన ఫ్యాన్స్‌కు గుర్తుండిపోయేలా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు మారుతి. 'రాజా సాబ్' షూటింగ్ 40 శాతం పూర్తయింది. ఆగస్టు 2న ఓ భారీ షెడ్యూల్ ఆరంభిస్తాం. 2025 ఏప్రిల్ 10న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ మూవీని విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

కామెడీ... హారర్

సప్తగిరి, ధనరాజ్, అజయ్, 'షకలక' శంకర్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భవనమ్'. బాలాచారి కూర్మెళ్ల దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో ఆర్బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 9న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సప్తగిరి మాట్లాడుతూ– ''సూపర్ గుడ్ ఫిల్మ్స్ సంస్థ 95వ సినిమాగా ఇంతమంది కమెడియన్స్‌ని పెట్టి 'భవనమ్' వంటి హారర్ కామెడీ సినిమా చేసింది. ఈ బ్యానర్‌లో చేయాలనే ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది'' అన్నారు. ''సస్పెన్స్ థ్రిల్లర్, హారర్ నేపథ్యంలో రూపొందిన 'భవనమ్' అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు బాలాచారి. ''అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న హారర్ కామెడీ మూవీ ఇది'' అన్నారు షకలక శంకర్. ''సూపర్ గుడ్ ఫిల్మ్స్‌లో మ్యూజిక్ చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు చరణ్ అర్జున్.



● సప్తగిరి, మాళవికా సతీషన్, షకలక శంకర్, బాలాచారి



● మధుబాల

రాణి పన్నగ

'చేపట్టిన కత్తులు వాళ్ల విజయాన్ని చెక్కుతాయి... అడ్డుపెట్టిన డాలులు శత్రు దాడిని అడ్డుకుంటాయి... మాతృస్వామ్య వ్యవస్థ ఆనవాళ్లు... నారీకోన మహారాణి పన్నగ... ఆమె కుమార్తె వీరనారి నెమలి... సదా యుద్ధానికి సిద్ధం అంటూ మధుబాల లుక్‌ని విడుదల చేసింది 'కన్నప్ప' యూనిట్. ఈ చిత్రంలో రాణి పన్నగగా మధుబాల కనిపించనున్నారు. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్ వంటి స్టార్స్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. శివ భక్తుడు కన్నప్ప కథ నేపథ్యంలో ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో డా. మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

నే వంట చేస్తే...

నే వంట చేస్తే అందరూ ఓ పట్టు పట్టాల్సిందే అంటూ చేతిలో గరిటెలు పట్టుకుని వంట చేయడానికి రెడీ అవుతోంది రత్నమ్మ. మరి... ఆమె చేతి వంట ఎలా ఉంటుందో రుచి చూసినవాళ్లే చెప్పాలి. రత్నమ్మగా సంగీత నటిస్తున్న చిత్రం 'పరదా'. 'సినిమా బండి'తో దర్శకుడిగా మంచి ప్రశంసలు అందుకున్న ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్న రెండో చిత్రం ఇది. ఈ లేడీ ఓరియంటెడ్ మూవీలో అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత లీడ్ రోల్స్ చేస్తున్నారు. సోమవారం సంగీత లుక్‌ని విడుదల చేశారు. శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: మృదుల్ సుజిత్ సేన్.



● సంగీత



● తమన్నా

బోనాల పండగలో...

బోనాల పండగ జోరుగా జరుగుతున్న సంగతి తెలిసిందే. తమన్నా కూడా బోనం ఎత్తారు. అయితే ఆమె పండగ చేసుకుంటున్నది 'ఓదెల 2' చిత్రం కోసం. తమన్నా లీడ్ రోల్‌లో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్న చిత్రం ఇది. దర్శకుడు సంపత్ నంది సూపర్‌విజన్‌లో 'ఓదెల రైల్వేస్టేషన్' (2021) సినిమాకి సీక్వెల్‌గా అశోక్ తేజ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ బహు భాషా చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ మల్లన్న టెంపుల్ సెట్‌లో క్లైమాక్స్‌ని చిత్రీకరిస్తున్నారు. తమన్నా, ఇతర నటీనటులతో పాటు 800 మంది జూనియర్ ఆర్టిస్టులు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. బోనాల సంబరాల నేపథ్యంలో సాగే ఎపిసోడ్ ఇది. ఈ సన్నివేశాల్లోని తమన్నా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఈ సినిమాలోని పాత్ర కోసం తమన్నా శిక్షణ తీసుకున్నారు. యాక్షన్ సన్నివేశాలను ఆమె అద్భుతంగా చేస్తున్నారు'' అని మేకర్స్ పేర్కొన్నారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహ, యువ, నాగమహేశ్, వంశీ, గగన్ విహారి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్.

పదింటికే చలీ జ్వరం...



● రామ్, కావ్యా థాపర్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. వీరి కాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఆగస్టు 15న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'క్యా లఫ్డా..' అంటూ సాగే మూడో పాటని సోమవారం రిలీజ్ చేశారు. 'నరం నరం గరం గరం... పదింటికే చలీ జ్వరం, నీ ఊహలే నిరంతరం... పోతోందిరా నాలో శరం...' అంటూ ఈ పాట సాగుతుంది. శ్రీ హర్ష ఈమాని సాహిత్యం అందించిన ఈ పాటని ధనుంజయ్ సీపాన, సింధూజ శ్రీనివాసన్ పాడారు. రామ్, కావ్యాల మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్ ఇది. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, జియాని జియాన్నెలి.



ఆ కష్టాలు ఎలా ఉంటాయో చూశాను

- విజయ్ దేవరకొండ

"తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్' నిర్వహిస్తున్న దర్శక సంజీవని మహోత్సవంలో భాగం కావడం సంతోషంగా ఉంది. మీరంతా ఎన్నో కలలు కంటుంటారు. డ్రీమర్స్ కష్టాలు ఎలా ఉంటాయో హీరోగా ఎదగక ముందు చూశాను. స్థిరమైన ఆదాయం ఉండదు... భవిష్యత్ మీద భరోసా ఉండదు. కానీ, కలను సాకారం చేసుకోవడానికి ముందుకు సాగుతుంటారు'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీని 'దర్శక సంజీవని మహోత్సవం' పేరుతో హైదరాబాద్‌లో నిర్వహించింది. దివంగత దర్శకుడు డా. దాసరి నారాయణరావు పేరు మీద దాసరి హెల్త్ కార్డులను అందించారు. ''మధ్యాహ్న భోజనం పెట్టడంతో పాటు ఉచిత హెల్త్ కార్డ్స్ ఇవ్వడం మంచి ఆలోచన. ఈ అసోసియేషన్‌కు నా సహకారం ఉంటుంది'' అన్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్ దేవరకొండ. ''అసోసియేషన్‌లోని 720 మంది హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారు, వారి కుటుంబ సభ్యులతో కలిపి 1920 మందికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాం'' అన్నారు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్.

ఉషా పరిణయం చిత్రాన్ని ఆదరించాలి

- సాయి దుర్గ తేజ్



● విజయభాస్కర్, సాయి దుర్గ తేజ్, శ్రీ కమల్

''విజయభాస్కర్‌గారి దర్శకత్వంలో నేను 'ప్రేమకావాలి' సినిమా చేయాల్సింది... మిస్ అయ్యింది. ఆది సాయికుమార్ 'రేయ్' చేయాలి... కానీ 'ప్రేమ కావాలి' చేశాడు. నేను 'రేయ్' చేశాను. విజయభాస్కర్‌గారు కొత్తవాళ్లతో చేసిన 'ఉషా పరిణయం' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి. అప్పుడే ఇలాంటి కొత్త సినిమాలు వస్తాయి'' అన్నారు హీరో సాయి దుర్గ తేజ్. శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా నటించిన చిత్రం 'ఉషా పరిణయం'. కె. విజయభాస్కర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ మూవీ ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ– ''నాకు ఎంతో ఆప్తుడైన సతీష్ అన్న కూతురు తాన్వీ ఆకాంక్షకి అన్నయ్యగా ఈ ఫంక్షన్‌కు వచ్చాను. ఈ మూవీ విజయం సాధించి యూనిట్‌కి మంచి పేరు తీసుకురావాలి'' అన్నారు. విజయభాస్కర్ మాట్లాడుతూ– ''14 ఏళ్ల క్రితం సాయి దుర్గ తేజ్‌ని నేనే హీరోగా పరిచయం చేయాల్సింది.. కానీ కుదరలేదు. మా ఫ్యామిలీ సపోర్ట్‌తో 'ఉషా పరిణయం' నిర్మించాను'' అన్నారు. శ్రీ కమల్ మాట్లాడుతూ– ''నాన్నగారి (కె. విజయభాస్కర్) పేరు నిలబెట్టడానికి ప్రయత్నిస్తాను'' అన్నారు.

దేవదాసు నుంచి విరాట పర్వం వరకూ...



● మోక్ష

''అలనాటి రామచంద్రుడు' క్లాసిక్, యూనివర్సల్ లవ్ స్టోరీ. ఇందులో నా పాత్ర పేరు ధరణి. చాలా హైపర్, అల్లరిగా ఉంటుంది. ప్రతి అమ్మాయి రిలేట్ చేసుకునేలా నా పాత్ర ఉంటుంది'' అన్నారు హీరోయిన్ మోక్ష. కృష్ణవంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మోక్ష మాట్లాడుతూ– ''నేను బెంగాలీ అమ్మాయిని. తెలుగులో నా మొదటి సినిమా 'లక్కీ లక్ష్మణ్'. 'అలనాటి రామచంద్రుడు' రెండో సినిమా. ఆకాశ్‌గారు చాలా మంచి విజన్‌తో తీసిన సినిమా ఇది. సావిత్రిగారి 'దేవదాసు' నుంచి అనుష్కగారి 'అరుంధతి', సాయి పల్లవిగారి 'విరాట పర్వం' వరకూ తెలుగు సినిమాలు చాలా ఎంజాయ్ చేశాను. 'సీతారామం, హను–మాన్' చిత్రాలు ఎంతగానో నచ్చాయి. హీరో నానీగారంటే ఇష్టం. ఆయనతో వర్క్ చేయాలని ఉంది. ప్రస్తుతం 'రామం రాఘవం' సినిమా చేస్తున్నాను. అలాగే నేను చేసిన ఒక మలయాళ సినిమా విడుదలకు రెడీ అవుతోంది'' అన్నారు.



నాదల్‌పై జొకోవిచ్ పైచేయి

పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ ఈవెంట్ సింగిల్స్ విభాగంలో స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ పోరాటం ముగిసింది. సోమవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) 6-1, 6-4తో నాదల్‌ను ఓడించాడు. వీరిద్దరు ఇప్పటి వరకు 60 సార్లు తలపడ్డారు. జొకోవిచ్ 31 సార్లు గెలుపొందగా... నాదల్ 29 సార్లు విజయం సాధించాడు. వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న జొకోవిచ్‌కు ఒలింపిక్ స్వర్ణం లోటుగా ఉంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో కాంస్యం నెగ్గిన జొకోవిచ్... 2012 లండన్, 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మాత్రం పతకాలు సాధించలేకపోయాడు.

హర్మీత్ దేశాయ్ పరాజయం

పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) పురుషుల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. ప్రిలిమినరీ రౌండ్ తొలి మ్యాచ్‌లో గెలిచి ప్రధాన 'డ్రా'కు అర్హత సాధించిన భారత రెండో ర్యాంకర్ హర్మీత్ దేశాయ్ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. మూడో సీడ్ ఫెలిక్స్ లెబ్రూన్ (ఫ్రాన్స్)తో 28 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో హర్మీత్ 8-11, 8-11, 6-11, 8-11తో ఓడిపోయాడు.

మరో కాంస్యం వేటలో

షూటింగ్ యువ తార మనూ భాకర్ రెండు రోజుల వ్యవధిలో తన రెండో ఒలింపిక్ పతకంపై గురి పెట్టింది. ఆదివారం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం నెగ్గిన మనూ భాకర్‌కు ఈసారి సరబ్‌జోత్ సింగ్ జత కలిశాడు. ఈ జోడీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది. జిన్ ఓయె-లీ వన్‌హో (దక్షిణ కొరియా) జంటతో నేడు జరిగే ఈ పోరులో గెలిస్తే ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా మను చరిత్ర సృష్టిస్తుంది. వ్యక్తిగత విభాగంలో త్రుటిలో ఫైనల్ అవకాశాలు చేజార్చుకున్న సరబ్‌జోత్‌కు కూడా తొలి పతకం గెలుచుకునేందుకు ఇది మంచి అవకాశం. మరోవైపు సోమవారం పతకం కోసం బరిలోకి దిగిన షూటర్లలో అర్జున్ బబూతా నాలుగో స్థానంలో నిలిచి దురదృష్టవశాత్తూ కాంస్యం చేజార్చుకోగా, రమిత ఏడో స్థానంతో నిరాశగా నిష్క్రమించింది.

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మనూ భాకర్-సరబ్‌జోత్ జోడీ ముందంజ

- నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కాంస్య పతక పోరు
- నాలుగో స్థానంతో ముగించిన అర్జున్ బబూతా


మనూ భాకర్, సరబ్‌జోత్

పారిస్: ఒలింపిక్స్ షూటింగ్ సమరాల్లో భారత్‌కు సోమవారం మిశ్రమ ఫలితాలు లభించాయి. మనూ భాకర్-సరబ్‌జోత్ జోడీ కాంస్య పతకం గెలుచుకునే అవకాశాలు సృష్టించుకోగా... ఇతర షూటర్లు విఫలమయ్యారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ-సరబ్ జోడీ క్వాలిఫయింగ్‌లో మెరుగైన చక్కటి ప్రదర్శన కనబర్చింది. నేడు జరిగే కాంస్య పతక పోరులో మనూ-సరబ్ ద్వయం గెలిస్తే భారత్ ఖాతాలో షూటింగ్ నుంచి మరో పతకం చేరుతుంది. ఈ మ్యాచ్‌లో కొరియాకు చెందిన జిన్ ఓయె-లీ వన్‌హో జంటతో భారత జోడీ తలపడుతుంది. సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో 580 స్కోరు సాధించిన భారత షూటింగ్ జంట పతకం కోసం ముందంజ వేసింది. మూడు సిరీస్‌లలో ఇద్దరు భారత షూటర్లు కలిసి వరుసగా 193, 195, 192 స్కోర్లు సాధించారు. తొలి రెండు సిరీస్‌లలో 98, 98 పాయింట్లు సాధించిన మనూ చివరి సిరీస్‌లో 95కే పరిమితం కావడం తుది ఫలితంపై ప్రభావం చూపించింది. సరబ్‌జోత్ 95, 97, 97 స్కోర్లు నమోదు చేశాడు. నేటి భారత్ ప్రత్యర్థి కొరియా 579 స్కోరుతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో తొలి రెండు స్థానాలు సాధించిన టర్కీ (582), సెర్బియా (581) నేడు జరిగే ఫైనల్లో స్వర్ణ-రజత పతకం కోసం పోటీ పడతాయి. ఇదే ఈవెంట్‌లో బరిలోకి దిగిన మరో భారత జోడీ రిథమ్ సాంగ్వాన్-అర్జున్ సింగ్ చీమా ఓవరాల్‌గా 576 పాయింట్లు స్కోరు చేసి 10వ స్థానంతో ముగించింది.


అర్జున్


రమిత

బబూతా పోరాడినా...

పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో పతక ఆశలతో బరిలోకి దిగిన అర్జున్ బబూతాను చివరకు దురదృష్టం పలకరించింది. స్టేజ్-1లో పది షాట్‌ల తర్వాత 105 పాయింట్లతో అతను మూడో స్థానంతో మెరుగైన స్థితిలో నిలిచాడు. స్టేజ్-2 ఎలిమినేషన్ రౌండ్ తొలి సిరీస్‌లో కూడా 10.6, 10.6 స్కోర్లతో పతకావకాశాలు మెరుగుపర్చుకున్నాడు. అయితే ఇదే జోరును బబూతా కొనసాగించలేకపోయాడు. రెండో సిరీస్ తొలి షాట్‌లో పేలవంగా 9.9 స్కోరు చేయడం అతడిని బాగా దెబ్బ తీసింది. అయినా సరే... మూడు సిరీస్‌లు ముగిసిన తర్వాత 167.8 స్కోరుతో క్రొయేషియా షూటర్ మరిసిచ్‌తో సమంగా నిలిచాడు. కానీ నాలుగో సిరీస్ రెండో షాట్‌లో 10.1 మాత్రమే సాధించి వెనకబడిపోయాడు. ఓవరాల్‌గా 208.4 పాయింట్లతో నాలుగో స్థానమే దక్కింది. ఈ ఈవెంట్‌లో షెంగ్ లిహావో (చైనా-252.2), విక్టర్ లింగ్రెన్ (స్వీడన్-251.4), మిరాన్ మరిసిచ్ (క్రొయేషియా-230) స్వర్ణ, రజత, కాంస్యాలు గెలుచుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల విభాగం ఫైనల్లో భారత షూటర్ రమిత జిందాల్ నిరాశపర్చింది. మొత్తం 145.3 పాయింట్లతో ఆమె ఏడో స్థానంతో ముగించింది. పురుషుల ట్రాప్ ఈవెంట్ క్వాలిఫయింగ్‌లో తొలి రోజు భారత షూటర్ పృథ్వీరాజ్ తొండైమన్ పేలవ ప్రదర్శనను కనబర్చాడు. 75 పాయింట్ల మూడు రౌండ్ల తర్వాత పృథ్వీరాజ్ 68 పాయింట్లు సాధించి ప్రస్తుతం 30వ (చివరి) స్థానంలో కొనసాగుతున్నాడు. అతను వరుసగా 22, 25, 21 పాయింట్లు స్కోరు చేశాడు. మంగళవారం మరో 25 పాయింట్లు చొప్పున రెండు రౌండ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత ఓవరాల్ పాయింట్లను బట్టి టాప్-6లో నిలిచినవారు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు.

పతకాల పట్టిక




ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	దక్షిణ కొరియా	5	3	1	9
2	జపాన్	5	2	4	11
3	చైనా	5	2	2	9
4	ఫ్రాన్స్	4	7	3	14
5	ఆస్ట్రేలియా	4	3	0	7
6	అమెరికా	3	7	4	14
7	బ్రిటన్	2	4	3	9
25	భారత్	0	0	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

ఐదు దేశాలు దాటి ఒలింపిక్స్ వరకు...

అఫ్గానిస్తాన్ శరణార్థి జూడో ప్లేయర్ అసాధారణ ప్రయాణం



పారిస్: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నేతృత్వంలోని శరణార్థి జట్టు తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ప్రతికూల పరిస్థితుల మధ్య పోరాటం, పట్టుదలతో విశ్వ క్రీడలకు వెళ్లాలని ప్రయత్నించే వారి ప్రయాణం అసాధారణం. ఇలాంటి వారిలో అఫ్గానిస్తాన్‌కు చెందిన సిబ్గతుల్లా అరబ్ ఒకడు. ఈ ఒలింపిక్స్‌లో అతను జూడో (81 కేజీల విభాగం)లో బరిలోకి దిగాడు. 2021లో అఫ్గానిస్తాన్ తాలిబాన్ల చేతుల్లోకి వెళ్లిపోయాక అక్కడి పరిస్థితులు మారిపోవడంతో అరబ్ ఆ దేశం నుంచి పారిపోయాడు. అప్పటికి 19 ఏళ్ల వయసులో ఉన్న అతను అఫ్గాన్ జాతీయ జూడో జట్టులోకి ఎంపికయ్యాడు కూడా. అక్కడి నుంచి బయల్దేరి తొమ్మిది నెలల పాటు ఎన్నో కష్టాలకు ఓర్చి ఇరాన్, టర్కీ, గ్రీస్, బోస్నియా అండ్ స్లొవేనియాలలో తలదాచుకుంటూ చివరకు జర్మనీ చేరాడు. డార్ట్‌మండ్ సమీపంలోని శరణార్థి శిబిరంలో తనలాగే ఇరాన్ నుంచి వచ్చిన కోచ్ ఆధ్వర్యంలో జూడోలో శిక్షణ కొనసాగించాడు. అక్కడే ఆటలో రాటుదేలిన అరబ్... యూరోపియన్ ఓపెన్ తదితర టోర్నీల్లో రాణించి ఎట్టకేలకు ఐఓసీ శరణార్థి టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటికీ అరబ్ కుటుంబం అఫ్గానిస్తాన్‌లో ఉంటోంది. తన తల్లి, సోదరుడితో మాట్లాడుతుంటానని... భవిష్యత్తులో తన పరిస్థితి మెరుగవుతుందని అరబ్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

మన బాణం విఫలం

క్వార్టర్ ఫైనల్లోనే ఓడిన భారత పురుషుల ఆర్చరీ జట్టు


ప్రవీణ్ తరుణ్‌దీప్ ధీరజ్

పారిస్: సీజన్‌లో రెగ్యులర్‌గా జరిగే ప్రపంచకప్ టోర్నీలలో పతకాలు సాధించే భారత ఆర్చర్లు ఒలింపిక్స్ క్రీడల్లో మాత్రం తమ వైఫల్యాన్ని కొనసాగిస్తున్నారు. ఆదివారం భారత మహిళల రికర్వ్ జట్టు నిరాశాజనక ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరగ్గా... భారత పురుషుల రికర్వ్ జట్టు కూడా అదే బాటలో పయనించింది. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్ (సిక్కిం), ప్రవీణ్ జాధవ్ (మహారాష్ట్ర)లతో కూడిన భారత బృందం లక్ష్యం దిశగా గురి తప్పి క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. ర్యాంకింగ్ రౌండ్‌లో అద్భుత ఆటతీరుతో మూడో స్థానంలో నిలిచి తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు ఈ అడ్డంకిని దాటలేకపోయింది. క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 2-6తో మెటి గజోజ్, బెర్కిమ్ తుమెర్, అబ్దుల్లాలతో కూడిన టర్కీ జట్టు చేతిలో ఓడిపోయింది. తొలి సెట్‌ను 57-53తో, రెండో సెట్‌ను 55-52తో నెగ్గిన టర్కీ 4-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో సెట్‌లో భారత జట్టు 55-54తో గెలిచి ఆధిక్యాన్ని 2-4కి తగ్గించింది. చివరిదైన నాలుగో సెట్‌లో టర్కీ బృందం 58-54తో నెగ్గి విజయాన్ని అందుకోవడంతో పాటు సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో టర్కీ 4-5తో ఫ్రాన్స్ చేతిలో ఓడిపోయింది. అనంతరం కాంస్య పతక పోరులో టర్కీ 6-2తో చైనాపై గెలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. మరోవైపు ఫైనల్లో దక్షిణ కొరియా 5-1తో ఫ్రాన్స్‌పై గెలిచి ఏడోసారి టీమ్ విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

'డ్రా'తో గట్టెక్కిన భారత్


హర్మన్‌ప్రీత్

పారిస్: ఓటమి అంచుల్లో నుంచి భారత పురుషుల హాకీ జట్టు గట్టెక్కి 'డ్రా'తో ఊపిరి పీల్చుకుంది. సోమవారం జరిగిన పూల్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో మాజీ ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌ను భారత్ 1-1తో 'డ్రా'గా ముగించింది. ఆట 22వ నిమిషంలో లుకాస్ మార్టినెజ్ గోల్‌తో అర్జెంటీనా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 36వ నిమిషంలో తమ ఆధిక్యాన్ని 2-0కు పెంచుకునే అవకాశం అర్జెంటీనాకు వచ్చింది. కానీ పెనాల్టీ స్ట్రోక్‌ను మైసో కొసెల్లా వృథా చేశాడు. స్కోరును సమం చేసేందుకు భారత్ శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. నిలకడగా పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. కానీ వాటిని లక్ష్యానికి చేర్చడంలో విఫలమైంది. అయితే మరో నిమిషంలో ముగుస్తుందనగా భారత్‌కు 59వ నిమిషంలో తొమ్మిదో పెనాల్టీ కార్నర్ లభించింది. ఈ పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి స్కోరును సమం చేయడంతోపాటు భారత జట్టును ఓటమి నుంచి కాపాడాడు. నేడు జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో భారత్ ఆడుతుంది.

పారిస్‌లో భారతీయం

PARIS 2024

నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

హాకీ

పురుషుల పూల్ 'బి' మ్యాచ్: భారత్ X ఐర్లాండ్ (సాయంత్రం గం. 4:45 నుంచి).

ఆర్చరీ

మహిళల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: అంకిత భకత్ X వియోలెటా (పోలాండ్) (సాయంత్రం గం. 5:15 నుంచి), భజన్ కౌర్ X సిఫా (ఇండోనేసియా) (సాయంత్రం గం. 5:30 నుంచి). పురుషుల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: బొమ్మదేవర ధీరజ్ X ఆడమ్ లీ (చెక్ రిపబ్లిక్) (రాత్రి గం. 10:45 నుంచి).

బాక్సింగ్

పురుషుల 51 కేజీల ప్రిక్వార్టర్స్: అమిత్ పంఘాల్ X పాట్రిక్ చిన్‌యెంబా (జింబాబ్వే) (రాత్రి గం. 7:15 నుంచి). మహిళల 57 కేజీల మ్యాచ్: జైస్మిన్ లంబోరియా X నెస్తీ పెటెసియా (ఫిలిప్పీన్స్) (రాత్రి గం. 9:25 నుంచి). మహిళల 54 కేజీల ప్రిక్వార్టర్స్: ప్రీతి పవార్ X యెని మెర్సెలా (కొలంబియా) (అర్ధరాత్రి గం. 1.20 నుంచి).

బ్యాడ్మింటన్

పురుషుల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి X అల్ఫియన్ ఫజర్-మహమ్మద్ రియాన్ (ఇండోనేసియా) (సాయంత్రం గం. 5:30 నుంచి). మహిళల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో X సెట్యానా మాపసా-ఏంజెలా యూ (ఆస్ట్రేలియా) (సాయంత్రం గం. 6:20 నుంచి).

షూటింగ్

ట్రాప్ పురుషుల క్వాలిఫికేషన్: పృథ్వీరాజ్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). ట్రాప్ మహిళల క్వాలిఫికేషన్: శ్రేయసి సింగ్, రాజేశ్వరి కుమారి (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక పోరు: భారత్ (మనూ భాకర్-సరబ్‌జోత్ సింగ్) X దక్షిణ కొరియా (జిన్ ఓయె-లీ వన్‌హో) (మధ్యాహ్నం గం. 1:00 నుంచి).

క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



పారిస్: పతకమే లక్ష్యంగా పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తొలి లక్ష్యాన్ని పూర్తి చేసింది. గ్రూప్ 'సి' నుంచి సాత్విక్-చిరాగ్...ఫజర్-అర్దియాంతో (ఇండోనేసియా) జోడీలు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. గాయం కారణంగా గ్రూప్ 'సి'లోని మార్క్ లమ్స్‌ఫుస్-మార్విన్ సిడెల్ (జర్మనీ) జోడీ వైదొలిగింది. ఇదే గ్రూప్‌లో ఉన్న లుకాస్ కోర్వీ-రొనాన్ లాబర్ (ఫ్రాన్స్) జంట ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. దాంతో ఒక్కో మ్యాచ్‌లో నెగ్గిన భారత్, ఇండోనేసియా జోడీలు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి. గ్రూప్ విజేతను నిర్ణయించే మ్యాచ్‌లో నేడు ఫజర్-అర్దియాంతోలతో సాత్విక్-చిరాగ్ తలపడతారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

అశ్విని-తనీషా అవుట్

మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడి క్వార్టర్ ఫైనల్ చేరే అవకాశాన్ని కోల్పోయింది. సోమవారం జరిగిన గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో అశ్విని-తనీషా జోడీ 11-21, 12-21తో నామి మత్సుయామ-చిహారు షిదా (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. మరోవైపు పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎల్' రెండో మ్యాచ్‌లో లక్ష్య సేన్ (భారత్) 21-19, 21-14తో జూలియన్ కరాగి (బెల్జియం)పై గెలిచాడు. గ్వాటిమాలాకు చెందిన కెవిన్ కార్డన్ గాయంతో వైదొలిగాడు. ఫలితంగా కార్డన్‌పై లక్ష్య సేన్ గెలిచిన ఫలితాన్ని రద్దు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై నెగ్గితేనే లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంటాడు.

బోపన్న జోడీ ఓటమి



పారిస్ ఒలింపిక్స్‌లో భారత వెటరన్ ప్లేయర్ రోహన్ బోపన్న నిరాశ పరిచాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-శ్రీరామ్ బాలాజీ జంట 5-7, 2-6తో వాసెలిన్-మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడింది. మ్యాచ్ అనంతరం బోపన్న మాట్లాడుతూ దేశం తరఫున ఇదే తన చివరి పోరు అని పేర్కొన్నాడు. ఇప్పటికే డేవిస్ కప్‌కు వీడ్కోలు పలికిన బోపన్న ఇకపై జాతీయ జట్టు తరఫున ఆడబోనని ప్రకటించాడు.

రెండు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో బోపన్నకు ఒలింపిక్ పతకం అందని ద్రాక్షలాగే మిగిలింది. 2016 రియో ఒలింపిక్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి నాలుగో స్థానంలో నిలిచిన బోపన్న.. ఇంత సుదీర్ఘ కాలం దేశానికి ప్రాతినిధ్యం వహించడాన్ని ఆనందించానని అన్నాడు. ఒలింపిక్స్ చరిత్రలో భారత్‌కు టెన్నిస్‌లో ఏకైక పతకం 1996 అట్లాంటా క్రీడల్లో (లియాండర్ పేస్-కాంస్యం) దక్కింది.

0.1 పాయింట్ తేడాతో స్వర్ణం



కొరియా టీనేజ్ షూటర్ సంచలనం

పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియాకు చెందిన టీనేజ్ షూటర్ బాన్ హ్యోజిన్ 0.1 పాయింట్ తేడాతో స్వర్ణం కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల విభాగం ఫైనల్లో 16 ఏళ్ల బాన్ హ్యోజిన్ చివరి షాట్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో పసిడి పతకం చేజిక్కించుకుంది. 22 షాట్లు ముగిసేసరికి బాన్ హ్యోజిన్‌తో పాటు 17 ఏళ్ల చైనా షూటర్ హువాంగ్ యూటింగ్ 251.8 పాయింట్లతో నిలిచారు. దీంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్' నిర్వహించగా.. అందులో బాన్ 10.4 స్కోరు చేయగా.. హువాంగ్ 10.3 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. తద్వారా బాన్ ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచిన అతిపిన్న వయసు మహిళా షూటర్‌గా రికార్డుల్లోకెక్కింది. స్విట్జర్లాండ్ షూటర్ ఆడ్రే గొగ్నియాల్ 230.3 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
30-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	23	81,356
నిఫ్టీ ▲	1	24,836

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,418	▲ 61
డోజోన్స్	40,561	▽ 28
ఎఫ్‌టీఎస్ఈ 100	8,292	▲ 7
డాక్స్	18,321	▽ 97
షాంఘై	2,892	▲ 1
నికాయ్	38,468	▲ 801

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	68,800
బంగారం (99.5 స్వచ్ఛత)	68,525
వెండి (కిలో)	82,192

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.20	85.53
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	105.16	110.11
€	యూరో	భారతీయ	88.37	92.87
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	43.00	65.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.36	57.20
S$	సింగపూర్ డాలర్	భారతీయ	60.00	64.69
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.91	23.69
¥	చైనా యువాన్	భారతీయ	10.66	12.48

25,000కు చేరి.. వెనక్కి

రికార్డు స్థాయి నుంచి నిఫ్టీ రివర్స్ ● ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ ● ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబై: ట్రేడింగ్ ప్రారంభంలోనే సరికొత్త రికార్డులు నమోదు చేసిన స్టాక్ సూచీలు ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో సోమవారం ఫ్లాటుగా ముగిశాయి. అమెరికా ఫెడరల్ ద్రవ్య విధాన నిర్ణయాల వెల్లడి ముందు ఈక్విటీ మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకుంది. సెన్సెక్స్ 23 పాయింట్లు పెరిగి 81,356 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింటు పెరిగి 24,836 వద్ద నిలిచింది. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాల నేపథ్యంలో ఉదయం సూచీలు భారీ లాభాలతో మొదలయ్యాయి. ప్రథమార్ధంలో క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీయల్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, విద్యుత్ షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 576 పాయింట్లు బలపడి 81,908 వద్ద, నిఫ్టీ 165 పాయింట్లు ర్యాలీ చేసి 25 వేల పాయింట్ల మైలురాయికి అత్యంత చేరువలో **24,999.75** వద్ద సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. మిడ్‌సెషన్ నుంచి గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు ఎఫ్ఎంసీజీ, ఐటీ, యుటిలిటీ, టెక్ షేర్లలో లాభాల స్వీకరణ మొగ్గుచూపారు. దీంతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి ఫ్లాటుగా ముగిశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.17%, 0.80 శాతం రాణించాయి. ఈ వారంలోనే అమెరికా, బ్రిటన్, జపాన్ కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లపై నిర్ణయాలను వెల్లడించనున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు స్వల్ప లాభాలతో కదలాడుతున్నాయి.



నవంబర్ 1 నుంచి ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు

అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సంబంధించి సవరించిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు సెబీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్స్ సంస్థల్లో ఫ్రంట్ రన్నింగ్ ఆరోపణలు వస్తుండడం తెలిసిందే. ఈ తరహా కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు వీలుగా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల క్రయ, విక్రయాలను సైతం ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనల పరిధిలోకి సెబీ తీసుకొచ్చింది.



ఫార్మా కాంట్రాక్ట్ తయారీకి బూస్ట్

- దన్నుగా అమెరికా బయోసెక్యూర్ చట్టం
- దేశీ సంస్థలకు కొత్త అవకాశాలు



దేశీ ఫార్మా కాంట్రాక్ట్ తయారీ వ్యాపార విభాగం త్వరలోనే రెట్టింపు కాగలదని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రభుత్వ సంస్థలు చైనా ఫార్మా కంపెనీల కొనుగోళ్లు జరపకుండా అమెరికా బయోసెక్యూర్ చట్టాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తుండటం ఇందుకు ఊతమివ్వగలదని పేర్కొన్నాయి. చైనా నుంచి తయారీ కార్యకలాపాలు క్రమంగా భారత్‌కు మళ్లుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ తయారీ సెగ్మెంట్ వచ్చే మూడేళ్లలో రెండింతలు కాగలదని, అలాగే కాంట్రాక్ట్ రీసెర్చ్ సెగ్మెంట్ మూడు రెట్లు వృద్ధి చెందగలదనే అంచనాలు నెలకొన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. మోర్డోర్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం 2024లో అంతర్జాతీయంగా కాంట్రాక్ట్ అభివృద్ధి, తయారీ సెగ్మెంట్ (సీడీఎంవో) 22.51 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ఏటా 14.67 శాతం వృద్ధితో 2029 నాటికి 44.63 బిలియన్ డాలర్లకు చేరనుంది. ఇక ఫార్మా విభాగం గణాంకాల ప్రకారం దేశీయంగా కాంట్రాక్ట్ రీసెర్చ్ (సీఆర్‌వో) సెగ్మెంట్ వార్షికంగా 10.75 శాతం చక్రగతీయ వృద్ధితో 2030 నాటికి 2.5 బిలియన్ డాలర్లకు చేరనుంది. భారతీయ సీడీఎంవో సెగ్మెంట్ ఇప్పటికే అభివృద్ధి చెందినా, బయోసెక్యూర్ చట్టం అమలనేది పరిశ్రమకు గణనీయంగా తోడ్పాటునిస్తుందని, వృద్ధిని మరింతగా పరుగులు పెట్టించగలదని కాంట్రాక్ట్ తయారీ సంస్థల వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం చైనా సీడీఎంవో పరిశ్రమకు అంతర్జాతీయంగా 8 శాతం మార్కెట్ వాటా ఉండగా, భారత్‌కు 2.7 శాతం వాటా ఉంది. చైనా వాటాను కొల్లగొట్టడానికి ఈ చట్టం భారత్‌కు బాగా ఉపకరించగలదని పరిశ్రమవర్గాలు తెలిపాయి. ఇప్పటికే పలు అమెరికన్ సంస్థలు ఉత్పత్తి కొనుగోళ్ల కోసం పలు భారతీయ కంపెనీలను సంప్రదిస్తున్నట్లు వివరించాయి. సుమారు 60 శాతం భారతీయ ఫార్మా కంపెనీలు కొత్త వ్యాపార అవకాశాలు వస్తున్నట్లు వెల్లడించాయి.

పోటీ కూడా ఉంది..

బయోసెక్యూర్ చట్టంతో ఉపయోగాలు ఉన్నప్పటికీ మన ఫార్మా కంపెనీలకు ఎకాయెకిన ప్రయోజనాలు వెంటనే లభించకపోవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఐర్లాండ్, సింగపూర్ వంటి దేశాల నుంచి మన కంపెనీలకు గట్టి పోటీ ఉండొచ్చని వివరించాయి. అమెరికాలో ప్రస్తుతం 120 ఔషధ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. చైనా తోడ్పాటు ఉన్న ఈ ప్రాజెక్టులు మన వైపు మళ్లేందుకు సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ప్రస్తుత ఒప్పందాలను మరికొంత కాలం కొనసాగించుకునేందుకు వీలు కల్పించే నిబంధనల వల్ల తక్షణం ఆర్థిక లబ్ధి చేకూరకపోవచ్చని వివరించాయి. అయితే, భారతీయ కంపెనీలకంటూ కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. సిప్లా, సింజీన్ వంటి సీడీఎంవోలు తక్కువ వ్యయాలతో ఔషధాలు తయారు చేయగలవు. అలాగే వాటికి సుశిక్షితులైన సిబ్బంది ఉన్నారు. అంతేగాకుండా పరిశ్రమకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం గ్రాంట్లు, రుణాలు కూడా అందిస్తోంది. మొత్తం మీద బయోసెక్యూర్ చట్టమనేది భారతీయ సీడీఎంవో విభాగానికి గేమ్ చేంజర్‌గా ఉండగలదని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఇందుకోసం మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని, ప్రాజెక్టుల నిర్వహణకు పెద్ద యెత్తున నిపుణుల అవసరం ఉంటుందని పేర్కొన్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇండియన్ బ్యాంక్ జూమ్

క్యూ1లో రూ. 2,403 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 41 శాతం జంప్‌చేసి రూ. 2,403 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం లాభాల్లో వృద్ధికి సహకరించింది. గతేడాది(2023–24) క్యూ1లో రూ. 1,709 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,759 కోట్ల నుంచి రూ. 16,945 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 13,049 కోట్ల నుంచి రూ. 15,039 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 5.47 శాతం నుంచి 3.77 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.7 శాతం నుంచి 0.39 శాతానికి తగ్గాయి. మొండి రుణాలకు కేటాయింపులు రూ. 930 కోట్ల నుంచి తగ్గి రూ. 896 కోట్లకు పరిమితమయ్యాయి. కనీస మూలధన నిష్పత్తి 16.47 శాతంగా నమోదైంది.

ఇండియన్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 587 వద్ద ముగిసింది.

ఓలా @ రూ. 72–76

- ఆగస్టు 2–6 మధ్య ఐపీవో
- రూ. 6,100 కోట్ల సమీకరణ



ముంబై: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ పబ్లిక్ ఇష్యూకి రూ. 72–76 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఆగస్ట్ 2న ప్రారంభమై 6న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 5,500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 8.49 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 6,100 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు పెట్టుబడులున్న కంపెనీ వ్యవస్థాపకుడు భవిష్ అగర్వాల్ 3.8 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 197 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. సమీకరణ నిధుల్లో సెల్ తయారీ ప్లాంటు సామర్థ్యాన్ని ప్రస్తుత 5 జీడబ్ల్యూహెచ్ నుంచి 6.4 జీడబ్ల్యూహెచ్‌కు పెంచనుంది. మరో రూ. 800 కోట్లు రుణ చెల్లింపులు, రూ. 350 కోట్లు కంపెనీ వృద్ధి కార్యక్రమాలకు వెచ్చించనుంది.

ఓలాకు మ్యాప్‌మై ఇండియా నోటీసులు..

తమ డేటాను కాపీ కొట్టి ఓలా మ్యాప్స్ తయారు చేశారంటూ ఓలా ఎలక్ట్రిక్‌కు మ్యాప్‌మైఇండియా బ్రాండ్ మాతృ సంస్థ సీఈ ఇన్ఫో సిస్టమ్స్ (సీఈ ఇన్ఫో) లీగల్ నోటీసులు పంపించినట్లు సమాచారం. అయితే, ఇవన్నీ తప్పుడు ఆరోపణలని ఓలా ఖండించింది. నోటీసులకు తగు విధంగా స్పందిస్తామని స్పష్టం చేసింది.

1న సీగల్ ఇండియా ఐపీవో

మౌలిక సదుపాయాల కంపెనీ సీగల్ ఇండియా పబ్లిక్ ఇష్యూకి రూ. 380–401 ధరల శ్రేణి ప్రకటించింది. ఐపీవో ఆగస్ట్ 1న ప్రారంభమై 5న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 684 కోట్లకుపైగా విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వెరసి ఐపీవో ద్వారా రూ. 1,253 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది.

సైయంట్ డీఎల్ఎంకు బోయింగ్ ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానాల తయారీ దిగ్గజం బోయింగ్ నుంచి కాంట్రాక్టు లభించినట్లు సైయంట్ డీఎల్ఎం వెల్లడించింది. 787 డ్రీమ్‌లైనర్ విమానాల కోసం బ్యాటరీ డయోట్ మాడ్యూల్ (బీడీఎం) తయారీ కోసం ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. కమర్షియల్ విమానాల కోసం పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ, డిజైన్ సపోర్ట్‌కి సంబంధించి బోయింగ్ నుంచి ఇది తమకు తొలి ప్రాజెక్ట్ అని సైయంట్ డీఎల్ఎం పేర్కొంది.



ఒప్పంద పత్రాలతో ప్రతినిధులు

యూనిటీ బ్యాంక్ శాఖల విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కొత్త తరం డిజిటల్ ఫస్ట్ బ్యాంక్ అయిన యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తాజాగా తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కి విస్తరించింది. కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో అయిదు శాఖలను ప్రారంభించింది. నిర్దిష్ట సేవింగ్స్ ఖాతాలపై 7.5 శాతం వరకు, ఎఫ్‌డీలపై 9.5 శాతం వరకు వడ్డీ రేట్లు అందిస్తున్నట్లు బ్యాంక్ ఎండీ ఇందర్‌జిత్ కామోత్రా తెలిపారు. అలాగే ఎంఎస్ఎంఈలకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లపై వ్యాపార రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. సెంట్రమ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రమోట్ చేస్తున్న యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కి రూ. 7,500 కోట్ల పైచిలుకు డిపాజిట్లు, రూ. 8,500 కోట్ల లోన్ బుక్ ఉంది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో సుమారు 400 బ్యాంకింగ్ అవుట్‌లెట్స్ ఉన్నాయి. అయిదేళ్లలో 1 కోటి కస్టమర్లు, రూ. 50,000 కోట్ల లోన్ బుక్ సాధించాలని నిర్దేశించుకున్నట్లు ఇందర్‌జిత్ వివరించారు.



బ్యాంక్ ఎండీ ఇందర్‌జిత్ కామోత్రా

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఫైనాన్స్ డిజిటలైజేషన్‌తో కొత్తతరం బ్యాంకింగ్	లిస్టెడ్ కంపెనీగానే ఇండియా సిమెంట్స్: అల్ట్రాటెక్ సిమెంట్

సాక్షి స్పోర్ట్స్

వచ్చే ఏడాది భారత్‌లో ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీ

పురుషుల ఆసియాకప్ టోర్నమెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీని వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించనున్నారు. 2026లో స్వదేశంలో జరిగే టి20 ప్రపంచకప్‌కు ముందుగా ఈ టోర్నీ నిర్వహిస్తారు. గతంలోనూ 2023 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా పాకిస్తాన్‌లో ఆసియా కప్‌ను వన్డే ఫార్మాట్‌లో నిర్వహించారు. అయితే భారత్ అక్కడికి వెళ్లేందుకు నిరాకరించడంతో హైబ్రిడ్ మోడల్‌తో భారత్ ఆడిన మ్యాచ్‌ల్ని శ్రీలంకలో ఏర్పాటు చేశారు. ఫైనల్లో శ్రీలంకపై గెలిచి భారత్ విజేతగా నిలిచింది. అనంతరం 2027 ఆసియా కప్‌కు బంగ్లాదేశ్ ఆతిథ్యమిస్తుంది. అదే ఏడాది దక్షిణాఫ్రికాలో వన్డే ప్రపంచకప్ ఉండటంతో బంగ్లాలో వన్డే ఫార్మాట్‌లో ఆసియాకప్ జరుగనుంది. ఈ రెండు టోర్నీల్లోనూ భారత్, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లతో పాటు టెస్టు హోదా దక్కని ఒక ఆసియా జట్టు పాల్గొంటుందని ఆసియా క్రికెట్ మండలి తెలిపింది.



చేరువై... దూరమై!

ఒలింపిక్స్ క్రీడల్లో భారత క్రీడాకారులకు త్రుటిలో చేజారిన పలు పతకాలు

చిక్కినట్లే చిక్కి చేజారితే కలిగే బాధ వర్ణనాతీతం! ఒలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై పతకం పట్టాలని ప్రతి అథ్లెట్ కలలు కంటాడు. ఏళ్ల తరబడి కఠోర సాధన, అలుపెరగని పోరాటం చేస్తూనే ఉంటారు. మరి అలాంటిది... మెడల్‌కు అత్యంత చేరువైన తర్వాత అందినట్లే అంది ఆ విజయం దూరమైతే కలిగే బాధ అంతా ఇంతా కాదు! ప్రస్తుతం జరుగుతున్న పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో భారత షూటర్ అర్జున్ బబుతాకు ఇలాంటి మనసు వికలమయ్యే అనుభవం ఎదురైంది. అయితే త్రుటిలో పతకాలు చేజార్చుకున్న భారత ప్లేయర్లలో అర్జున్ బబుతా మొదటి క్రీడాకారుడేమీ కాదు... గతంలోనూ పలుమార్లు విశ్వ క్రీడల్లో భారత్‌కు ఎదురైన ఇలాంటి చేదు అనుభవాలను పరిశీలిస్తే...

ఫుట్‌బాల్‌తో మొదలు



1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చింది. హైదరాబాదీ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ శిక్షణలో రాటుదేలిన మన జట్టు.. ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. క్వార్టర్స్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాపై నెవిల్లె డిసౌజా హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించడంతో సెమీస్‌లో అడుగుపెట్టి పతకం సాధించడం ఖాయమే అనిపించింది. అయితే యుగోస్లావియాతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 1–4తో పరాజయం పాలైంది. కాంస్య పతక పోరులోనూ తడబడ్డ భారత్ 0–3తో బల్గేరియా చేతిలో ఓడి నాలుగో స్థానంతో నిరాశగా వెనుదిరిగింది.

మిల్కా సింగ్ వెంట్రుకవాసిలో...



1960 రోమ్ ఒలింపిక్స్‌లో భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన భారత స్టార్ అథ్లెట్ మిల్కాసింగ్.. నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల 400 మీటర్ల పరుగులో సమీప ప్రత్యర్థిని చూసే క్రమంలో క్షణకాలాన్ని వృథా చేసుకున్న మిల్కా.. దానికి జీవితకాల మూల్యం చెల్లించుకున్నాడు. రోమ్ ఒలింపిక్స్ అనుభవంతో అథ్లెటిక్స్‌కే వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. అతి బలవంతంగా అతడిని తిరిగి ట్రాక్ ఎక్కించగా.. 1962 ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలతో సత్తాచాటాడు.

మహిళల హాకీలో ఇలా..



1980 మాస్కో విశ్వ క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు చక్కటి అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయింది. అఫ్గానిస్తాన్‌పై ఆతిథ్య సోవియట్ యూనియన్ దాడి చేసిన నేపథ్యంలో నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి దేశాలు మాస్కో క్రీడలను బహిష్కరించాయి. దీంతో మన జట్టు పోడియంపై నిలవడం ఖాయమే అనిపించింది. ఆస్ట్రియా, పోలాండ్‌పై ఘనవిజయాలు సాధించిన మన మహిళల జట్టు పతకంపై ఆశలు రేపింది. అయితే ఆ తర్వాత జింబాబ్వేతో మ్యాచ్ 'డ్రా' కాగా.. చెకోస్లోవియా, సోవియట్ యూనియన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

పరుగుల రాణికి తీరని వ్యథ!



1984 లాస్‌ఏంజెలిస్ క్రీడల్లో పరుగుల రాణి పీటీ ఉషకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో సెకనులో వందో వంతు తేడాతో పీటీ ఉష నాలుగో స్థానానికి పరిమితమైంది. అంతర్జాతీయ స్థాయిలో ఏ పోటీలోనైనా ఒక భారత అథ్లెట్ పతకం కోల్పోయిన అత్యల్ప తేడా ఇదే. ఫైనల్లో ఉష 55.42 సెకన్లలో లక్ష్యాన్ని చేరింది.



మహిళల హాకీ జట్టు మరోసారి

2020 టోక్యో ఒలింపిక్స్‌లో మరోసారి భారత మహిళల హాకీ జట్టుకు నిరాశ తప్పలేదు. 1980 మాస్కో క్రీడల్లో త్రుటిలో కాంస్యం చేజార్చుకున్న మహిళల జట్టు.. టోక్యోలోనూ అదే బాటలో నడిచింది. మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ ఆస్ట్రేలియాను మట్టికరిపించి ఆశలు రేపిన మన అమ్మాయిలు.. సెమీఫైనల్లో అర్జెంటీనా చేతిలో పరాజయం పాలయ్యారు. కాంస్య పతక పోరులోనైనా అద్భుతం చేస్తారనుకుంటే.. ఇంగ్లండ్‌తో పోరులో ఆరంభంలో ఆధిక్యం సాధించినా.. చివర్లో పట్టు విడిచి 3–4తో నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. ఇదే క్రీడల్లో ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన గోల్ఫర్ అదితి అశోక్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కోల్పోయింది.

జాయ్‌దీప్‌కు నిరాశ



2012 లండన్ ఒలింపిక్స్‌లో జాయ్‌దీప్ కర్మాకర్‌కు అర్జున్‌లాంటి అనుభవమే ఎదురైంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో బరిలోకి దిగిన కర్మాకర్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చి ఏడో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అయితే తుదిపోరులో కాంస్యం గెలిచిన షూటర్ కంటే.. 1.9 పాయింట్లు వెనుకబడిన కర్మాకర్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

దీపా కర్మాకర్ త్రుటిలో...



2016 రియో ఒలింపిక్స్‌లో భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ త్రుటిలో కాంస్య పతకం చేజార్చుకుంది. వాల్ట్ ఫైనల్లో దీపా కర్మాకర్ 15.066 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. కాంస్యం గెలిచిన జిమ్నాస్ట్‌కు దీపా కర్మాకర్‌కు మధ్య 0.150 పాయింట్ల తేడా మాత్రమే ఉండటం గమనార్హం. ఇదే క్రీడల్లో భారత షూటర్ అభినవ్ బింద్రా నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకం చేజార్చుకున్నాడు.

ఈసారి ఇద్దరు..



2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్–మహేశ్ భూపతి జంట నాలుగో స్థానంలో నిలిచింది. భారత అత్యుత్తమ ద్వయంగా విశ్వక్రీడల బరిలోకి దిగిన పేస్–భూపతి హోరాహోరీగా సాగిన కాంస్య పతక పోరులో 6–7, 6–4, 14–16తో అన్‌సిచ్–లుబిసిచ్ (క్రొయేషియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

–సాక్షి క్రీడా విభాగం

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...

శ్రీలంకతో భారత్ ఆఖరి పోరు నేడు

- సమరోత్సాహంతో సూర్యసేన
- ఒత్తిడిలో అసలంక బృందం
- రాత్రి 7 గంటల నుంచి 'సోనీ' నెట్‌వర్క్‌లో ప్రసారం

పల్లెకెలె: భారత్ రెండు రోజుల్లో రెండు మ్యాచ్‌లు గెలిచింది. టి20 సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. ఇప్పుడు దీన్ని 3–0గా వైట్‌వాష్ చేసేందుకు భారత్ ఆఖరి పోరాటానికి సిద్ధమైంది. తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య శ్రీలంకపై ముచ్చటగా మూడో విజయం సాధించేందుకు సూర్యకుమార్ బృందం తహతహలాడుతోంది. మంగళవారం జరిగే మూడో టి20 బరిలోకి టీమిండియా గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. బ్యాటర్లు, బౌలర్లు ఫామ్‌లో ఉండటంతో 'హ్యాట్రిక్' గెలుపుపై ఎవరికి అనుమానాల్లేవ్! మరోవైపు లంక సొంతగడ్డపై పరువు కోసం పాకులాడుతోంది. కనీసం ఆఖరి పోరులో గెలిచి క్లీన్‌స్వీప్ కాకుండా బయటపడాలని ఆరాటపడుతోంది.

టీమిండియాకు ఎదురుందా...

ఓపెనర్ యశస్వి జైస్వాల్ అదరగొడుతున్నాడు. గిల్ స్థానంలో రెండో టి20 ఆడిన సంజూ సామ్సన్ డకౌట్‌ను మరిచేలా మెరిపిస్తే ఇన్నింగ్స్‌కు ఢోకా ఉండదు. సూర్యకుమార్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యాలు మిగతా పని కానిచ్చేస్తారు. బౌలర్లు అర్ష్‌దీప్, అక్షర్, రవి బిష్ణోయ్, సిరాజ్‌లు కూడా నిలకడగా రాణిస్తున్నారు. తొలి మ్యాచ్‌లో దూసుకెళ్తున్న లంక ఇన్నింగ్స్‌ను 30 పరుగుల వ్యవధిలో 9 వికెట్లను కూల్చారు. రెండో మ్యాచ్‌లో 32 పరుగుల వ్యవధిలో 7 వికెట్లను తీసిన టీమిండియా బౌలింగ్ దళం సత్తాచాటుకుంది.

ఈ ఒక్కటైనా గెలవాలని...

సిరీస్‌ను చేజార్చుకున్న శ్రీలంక ఆఖరి పోరులో గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డనుంది. వచ్చే నెల 2 నుంచి జరిగే వన్డే సిరీస్‌లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాలంటే ఈ మ్యాచ్ తప్పక గెలవాలని ఆశిస్తోంది. నిలకడలేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్ ఆతిథ్య జట్టుకు తలనొప్పిగా మారింది. భారత్ నుంచి వైట్‌వాష్ తప్పించుకోవాలంటే మాత్రం వ్యూహాలకు పదును పెట్టాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఓపెనర్ నిసాంక మాత్రమే రెండు మ్యాచ్‌ల్లో కుదురుగా ఆడాడు. మిగతా వారంతా భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోతున్నారు. ఇకపై లోపాలను అధిగమించి విజయాన్నందుకోవాలని లంక సేన పట్టుదలతో ఉంది.



పిచ్, వాతావరణం

వేదిక మారలేదు కానీ గత రెండు మ్యాచ్‌లు ఆడిన పిచ్‌పై కాకుండా వేరే పిచ్‌పై ఈ మ్యాచ్ జరుగుతుంది. బ్యాటింగ్‌కు అనుకూలమే అలాగే స్పిన్నర్లకు కలిసొచ్చే పిచ్. వర్ష సూచన ఉన్నప్పటికీ మ్యాచ్ జరుగుతుంది.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, సంజూ సామ్సన్, రిషభ్ పంత్, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, పరాగ్, అక్షర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, సిరాజ్. **శ్రీలంక:** అసలంక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండిస్, పెరీరా, కమిండు మెండీస్, షనక, హసరంగ, తీక్షణ, పతిరణ, మదుషంక, ఫెర్నాండో.

వన్డేలకు రోహిత్, కోహ్లి రెడీ

కొలంబో: వన్డే సిరీస్ కోసం కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కోహ్లి సిద్ధమయ్యారు. వీరితో పాటు వన్డేలకు ఎంపికైన కుల్దీప్, హర్షిత్ రాణా, శ్రేయస్ అయ్యర్‌లు ఇప్పటికే కొలంబో చేరుకొని సోమవారం నుంచి నెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. గత నెల కరీబియన్ గడ్డపై రెండో టి20 ప్రపంచకప్ గెలిచిన రోజే భారత స్టార్లు రోహిత్, కోహ్లి పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. ఇప్పుడు మళ్లీ నెలరోజుల తర్వాత అంతర్జాతీయ వన్డేలు ఆడేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. కొలంబోలో అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ ట్రెయినింగ్‌లో వీళ్లంతా ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. మూడు వన్డేలన్నీ ఇక్కడి ప్రేమదాస స్టేడియంలోనే ఆగస్టు 2, 4, 7 తేదీల్లో జరుగుతాయి.

వైఎస్ జగన్ భద్రత ఆందోళనకరం

ఎంపీ మద్దిల గురుమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ : మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రత అత్యంత ఆందోళనకరంగా ఉందని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సోమవారం లోక్‌సభలో చెప్పారు. ప్రత్యేక అధికరణ 377 కింద ఎంపీ ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్ జెడ్ సెక్యూరిటీ భద్రతకు అర్హు లైనప్పటికీ, ఆయనకు తగిన రక్షణ కల్పించడంలో ఏపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్ జగన్‌కు జెడ్ సెక్యూరిటీకి బదులు 4+4 సెక్యూరిటీ మాత్రమే కేటాయించారని తెలిపారు. 2019, 2024లో తమ నాయకుడు వైఎస్ జగన్‌పై దాడులు జరిగిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటికైనా వైఎస్ జగన్‌కు తగిన భద్రత కల్పించేందుకు ఏపీ ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను తక్షణమే పునరుద్ధరించేలా కేంద్ర హోంశాఖ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ జోక్యం చేసుకోవాలని కోరారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఎంపీలు, మాజీ ఎంపీలను చట్టాన్ని అమలు చేసే సంస్థలు అడ్డుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై అన్యాయంగా కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. ఎంపీలు, మాజీ ఎంపీలపై దాడులు ప్రజాస్వామ్యంపై దాడిని సూచిస్తున్నాయని గురుమూర్తి తెలిపారు.

నారాయణ వంటి సంస్థలపైనా చర్చ జరగాలి

ఢిల్లీ కోచింగ్ సెంటర్ ఘటనపై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని రావూస్ కోచింగ్ సెంటర్‌లో మౌలిక సదుపాయాల లేమిపై మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా నారాయణ, చైతన్య వంటి కోచింగ్ సెంటర్ల పైనా చర్చ జరగాల్సి ఉందని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పారు. ఏపీలో నారాయణ, చైతన్య వంటి కోచింగ్ సెంటర్లలో కూడా నాణ్యత, మౌలిక వసతులు ఉండవని, ఇవి వెలుగులోకి రావడంలేదని తెలిపారు. ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యం కారణంగా ముగ్గురు మృతి చెందిన ఘటనపై సోమవారం రాజ్యసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. వేలాది మంది సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ కోసం ఢిల్లీకి వస్తున్నారని, చనిపోవడానికి కాదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇలాంటి కోచింగ్ సెంటర్లు వెలుస్తున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో నాణ్యమైన విద్య అందిస్తే కోచింగ్ సెంటర్ల అవసరం ఉండదని తెలిపారు. లేదంటే నాణ్యత, మౌలిక వసతుల పర్యవేక్షణకు ఓ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. తాజా ఘటనకు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం రెండూ బాధ్యత వహించాలని అన్నారు. పార్కింగ్‌కు వినియోగించాల్సిన బేస్‌మెంట్‌లో లైబ్రరీ, తరగతులకు ఎలా అనుమతించారో పరిశీలించి, అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలన్నారు.

ఏపీలో 8 మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కృష్ణా, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల్లో 8 మౌలికవసతుల అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తయ్యాయని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి జితిన్ రాంమాంఝీ తెలిపారు. మరో 24 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని విజయసాయిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో చెప్పారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో పెట్టుబడులు ఆకర్షించేలా ఏపీలో ప్రపంచస్థాయి మౌలిక వసతులతో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా తిరుపతి, రేణిగుంట, ఏర్పేడు, శ్రీసిటీ, వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తిలో రూ. 1,128.69 కోట్ల విలువైన 4 ప్రాజెక్టులకు రూ.512.94 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇచ్చినట్లు తెలిపారు. వీటి ద్వారా సుమారు 1,24,020 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన మూడేళ్లుగా బొగ్గు ఉత్పత్తి ఏమీ జరగలేదని బీదమస్తాన్ రావు ప్రశ్నకు సమాధానంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

శాంతిభద్రతలు లోపిస్తే ఏపీకి పెట్టుబడులెలా వస్తాయి?

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు లోపించాయని, ఇలాగైతే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో హింసాకాండకు ముగింపు పలికి, శాంతిభద్రతలను పునరుద్ధరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న మిథున్‌రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయిన వైనాన్ని వివరించారు. ప్రత్యేక హోదా, పోలవరం, విభజన హామీలు, ఎన్డీయే ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలు వంటి పలు ప్రధాన అంశాలపై మాట్లాడారు. ఏపీలో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని చెప్పారు. తనపైనే హత్యాయత్నం చేసి, తిరిగి తనపైనే కేసు పెట్టడం ఇందుకు ఉదాహరణ అని తెలిపారు.

పోలవరాన్ని రాష్ట్రానికి అప్పగించడం పెద్ద తప్పు

జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అప్పగించారని, ఎన్డీయే ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పు ఇదేనని అన్నారు. దీనివల్ల పోలవరం నిర్మాణమే గందరగోళమైందని చెప్పారు. ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందని, దానిని కేంద్రమే భరించాలని, ఏపీ ప్రజలపై వేస్తే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాఫర్ డ్యాం కట్టకుండా డయాఫ్రం వాల్ నిర్మించడం వల్లే వరద తాకిడికి డయాఫ్రం వాల్ దెబ్బతిందని చెప్పారు. దాని కారణంగానే వ్యయం భారీగా పెరిగిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతోపాటే భూసేకరణా పూర్తి చేయాలన్నారు.

ప్యాకేజీతో ప్రజలకు ఉపయోగం లేదు

ఏపీకి తక్షణమే ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రజలు ప్యాకేజీని అంగీకరించబోరని స్పష్టం చేశారు. విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇవ్వడానికి బీజేపీ, కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు అంగీకరించాయని చెప్పారు. ప్రత్యేక హోదా ప్రయోజనాలను ప్యాకేజీ ఇవ్వలేదని చెప్పారు. ప్యాకేజీ ఓ అభూతకల్పన అని, విభజన చట్టంలోని రెండు మూడు అంశాలు ప్రస్తావించి అదే ప్యాకేజీ అని చెబుతున్నారని విమర్శించారు. 2019–24 మధ్య టీడీపీ నాయకులు ప్రత్యేక హోదా డిమాండ్ చేశారని, దానికి వారు కట్టుబడి ఉండాలని కోరారు. హోదా కోసం టీడీపీ సహా అన్ని పార్టీలతో కలిసి పనిచేయడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని అన్నారు. విభజన చట్టం కాల పరిమితి కూడా ముగిసిందని, అందులోని హామీలు అన్నింటినీ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. విశాఖపట్నం మెట్రో, కడప ఉక్కు పరిశ్రమ పూర్తి చేయాలని కోరారు.

రూ.15 వేల కోట్ల సంగతేమిటి?

అమరావతి అభివృద్ధికి ప్రకటించిన రూ.15 వేల కోట్లు గ్రాంటా రుణమా అని నిలదీశారు. రుణమే అయితే దానిని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు కలిగే ప్రయోజనాలేమిటని అన్నారు. ఆ రుణం ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనిదా కాదా అనేది చెప్పాలన్నారు. గ్రాంటు రూపంలో రాష్ట్రానికి ఏమిచ్చినా అభినందిస్తామని, రుణాన్ని స్వాగతించబోమని చెప్పారు. కడప–బెంగళూరు రైల్వే లైను కాలపరిమితి ఏమిటని ప్రశ్నించారు. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఉక్కు పరిశ్రమకు క్యాప్టివ్ మైన్స్ ఉంటే దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

సూపర్ సిక్స్.. సారీ సిక్స్ కాకుండా చూడండి

ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు సారీ సిక్స్ కాకుండా చూడాలని అన్నారు. సూపర్ సిక్స్ హామీల పరిస్థితి ఏమిటని, వాటి అమలుకు కాలపరిమితి ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు లేవని చెప్పారు.

టార్గెట్ పెద్దిరెడ్డి!

ఆ కుటుంబాన్ని మానసికంగా వేధించడమే ప్రభుత్వ పెద్దల లక్ష్యం

సాక్షి, అమరావతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో సీఎం చంద్రబాబుకు రాజకీయంగా సవాల్‌గా మారిన చిరకాల రాజకీయ ప్రత్యర్థి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకుని అధికార యంత్రాంగాన్ని ఉసిగొల్పుతున్నట్లు జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మానసికంగా వేధించి క్షోభకు గురి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ పెద్దలు పథకం వేసినట్లు వెల్లడవుతోంది. ఈ క్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం కేసు దర్యాప్తును పక్కదారి పట్టిస్తూ రాజకీయ కక్ష సాధింపులకు తెర తీశారు. ఘటన జరిగిన వెంటనే డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌లను హుటాహుటిన హెలికాప్టర్‌లో పంపడం ద్వారా తన ఉద్దేశాన్ని చంద్రబాబు చెప్పకనే చెప్పారు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం కాదని డీజీపీ అదే రోజు మదనపల్లెలో ఏకపక్షంగా ప్రకటించేశారు. అయితే ఎలా సంభవించిందన్నది వారం రోజులైనా చెప్పలేకపోవడం సందేహాస్పదంగా మారింది. సాధారణ పొరపాటుతోనో, నిర్లక్ష్యం కారణంగానో అగ్ని ప్రమాదం సంభవించినట్లు దర్యాప్తులో దాదాపుగా తేలినా ఆ విషయాన్ని వెల్లడిస్తే పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసు బనాయించడం సాధ్యం కాదని ప్రభుత్వం తాత్సారం చేస్తోంది.

బాబు చేతిలో కీలుబొమ్మ సిసోడియా...!

అగ్ని ప్రమాదం కేసును పెద్దిరెడ్డి కుటుంబానికి అంటగట్టడం సాధ్యం కాదని పోలీసులు తేల్చడంతో తీవ్ర అసహనానికి లోనైన సీఎం చంద్రబాబు రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను రంగంలోకి దించారు. 22ఏ జాబితాలోని నిషేధిత భూముల వివరాలు, రెవెన్యూ శాఖ ఇతర ఫైళ్లు దగ్ధమైనట్లు నిర్ధారించి తదనుగుణంగా కుట్రకు పదును పెట్టాలన్నది ప్రభుత్వ పెద్దల పన్నాగం. మరోవైపు కుట్ర కోణంలో రెండో అంకానికి తెర తీశారు. పెద్దిరెడ్డి కుటుంబం బాధితులంటూ టీడీపీ నేతలు ఎంపిక చేసిన వారితో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేయిస్తున్నారు. వీటిల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నది ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. కుటుంబ ఆస్తి వివాదాలు, కోర్టుల విచారణలో ఉన్న అంశాల పైనే ఫిర్యాదులు చేస్తున్నారు.

సోదాలు.. వేధింపులు

పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసు నమోదు చేసేందుకు కనీస ఆధారాలు కూడా లభించకపోవడంతో చంద్రబాబు పోలీసులపై చిందులు తొక్కుతున్నట్లు సమాచారం. దీంతో పోలీసులు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులను సోదాల పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నివాసంలో కూడా సోదాలకు సన్నద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మాధవరెడ్డిని పోలీసులు కొద్ది రోజుల క్రితమే అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

ఫైళ్లన్నీ భద్రం..

22ఏ జాబితాలోని ఫైళ్లు, ఇతర భూముల ఫైళ్లను గల్లంతు చేసేందుకే అగ్ని ప్రమాదం సృష్టించారని నమ్మించేందుకు ప్రభుత్వ పెద్దలు వేసిన పథకం ఇప్పటికే బెడిసికొట్టింది. మదనపల్లె సబ్ కలెక్టరేట్ పరిధిలో 11 మండలాలున్నాయి. 22ఏ జాబితా, ఇతర భూముల ఫైళ్లు ఆయా మండలాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపుతారు. కలెక్టరేట్‌కు కూడా కాపీ పెడతారు. ఈ ప్రక్రియ దాదాపు ఆన్‌లైన్‌లోనే సాగింది. హార్డ్ కాపీలు పంపినా సంబంధిత ఫైళ్ల కాపీలన్నీ కూడా ఆయా తహశీల్దార్ కార్యాలయాల్లో భద్రంగా ఉన్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లన్నీ భద్రంగా ఉన్నాయని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియానే సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రాథమికంగా నిర్ధారించారు. సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో మొత్తం 2,440 ఫైళ్లు ఉన్నాయి. అగ్ని ప్రమాదం సంభవించగానే 740 ఫైళ్లు దగ్ధం కాకుండా నివారించారు. మిగిలిన 1,700 ఫైళ్లలో ఇప్పటికే 90 శాతం ఫైళ్లను రిట్రీవ్(పునరుద్ధరించారు) చేశారు. మిగిలిన 10శాతం ఫైళ్ల వివరాలను పరిశీలిస్తున్నారు. వాటిని కూడా రిట్రీవ్ చేస్తారు. కలెక్టరేట్‌తోపాటు సబ్ కలెక్టరేట్ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయాల్లోనూ అన్ని ఫైళ్లు భద్రంగా ఉన్నాయి. ఫైళ్లు అన్నీ భద్రంగా ఉంటే ఇక అందులో కుట్ర కోణం ఎక్కడ ఉంది ?

ఫరూక్ నా మిత్రుడే.. అయినా టీడీపీకి ఓటేయలేదు

మంత్రి ఫరూక్‌కు షాకిచ్చిన రైతు



సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూక్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

నంద్యాల: 'నంద్యాల ఎమ్మెల్యే ఫరూక్ నా మిత్రుడే. కానీ కొన్ని పరిస్థితుల వల్ల ఇటీవల జరిగిన ఎన్నికల్లో నేను టీడీపీకి ఓటు వేయలేదు' అంటూ ఓ రైతు చెప్పడంతో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అవాక్కయ్యారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో నంద్యాల, వైఎస్సార్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నంద్యాల మండలం భీమవరానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి తాము ఎదుర్కొంటున్న సమస్య గురించి మాట్లాడారు. 'వరద వచ్చిన ప్రతిసారీ కుందూ నది పక్కనున్న పొలాలు ముంపునకు గురై పంట నష్టం జరుగుతోంది. రక్షణ గోడలు నిర్మించి ముంపు నుంచి కాపాడండి' అని ఆయన కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ నాకు మంచి మిత్రుడని రామచంద్రారెడ్డి చెప్పగా.. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కల్పించుకుంటూ.. ఇంతకూ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేశావ్? అని ప్రశ్నించారు. టీడీపీకే ఓటు వేశావా అని ఆదినారాయణరెడ్డి అడగటంతో.. రైతు రామచంద్రారెడ్డి స్పందిస్తూ టీడీపీకి ఓటు వేయలేదంటూ బదులిచ్చాడు. దీంతో మంత్రి అవాక్కయ్యారు. అక్కడున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు నవ్వడంతో.. మంత్రి ఫరూక్ స్పందిస్తూ.. ఆదినారాయణరెడ్డి 'ఈ మీటింగ్ ఏమిటి, నువ్వు అడిగే ప్రశ్న ఏమిటి?' అంటూ రుసరుసలాడారు. మీ మిత్రుడే మీకు ఓటు వేయలేదని నాకెలా తెలుస్తుందని ఆదినారాయణరెడ్డి ప్రశ్నించడంతో మంత్రి ఫరూక్ చిన్నబుచ్చుకున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

బిజినెస్ రీల్

డాక్టర్ రెడ్డీస్ బయోసిమిలర్‌పై సీహెచ్‌ఎంపీ సానుకూలత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూరోపియన్ మార్కెట్లలో రిటుగ్జిమాబ్ బయోసిమిలర్ క్యాండిడేట్ ఐటక్స్‌రెడీని ప్రవేశపెట్టడంపై యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ కమిటీ సీహెచ్‌ఎంపీ సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ తెలిపింది. తదుపరి యూరోపియన్ కమిషన్ దీన్ని సమీక్షించి యూరోపియన్ యూనియన్ సభ్య దేశాల్లోనూ, ఇతరత్రా నార్వే, ఐస్‌ల్యాండ్ తదితర దేశాల్లోనూ దీన్ని ప్రవేశపెట్టడంపై నిర్ణయం తీసుకుంటుందని పేర్కొంది. బ్రిటన్ ఔషధ, హెల్త్‌కేర్ ఉత్పత్తుల నియంత్రణ సంస్థ ఎంహెచ్‌ఆర్‌ఏకి విడిగా మార్కెటింగ్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోనున్నట్లు వివరించింది. ల్యుకేమియా, ఆర్థరైటిస్ వంటి అనారోగ్య సమస్యల చికిత్సలో వాడే రోష్ కంపెనీ ఔషధం మ్యాబ్‌థెరాకి బయోసిమిలర్‌గా డాక్టర్ రెడ్డీస్ దీన్ని రూపొందించింది.

టీఎస్‌హెచ్‌పీలో టాటా స్టీల్‌కు వాటా

557 కోట్ల షేర్లు కొనుగోలు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మెటల్ దిగ్గజం టాటా స్టీల్ తాజాగా సింగపూర్ అనుబంధ సంస్థలో 557 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు 87.5 కోట్ల డాలర్లు(సుమారు రూ. 7,324 కోట్లు) వెచ్చించింది. ఈక్విటీ షేర్ల సబ్‌స్క్రిప్షన్ ద్వారా టీ స్టీల్ హోల్డింగ్స్ పీటీఈ(టీఎస్‌హెచ్‌పీ)లో దశలవారీగా ఇన్వెస్ట్ చేసేందుకు మే నెలలోనే టాటా స్టీల్ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిలో భాగంగా తాజాగా 0.157 డాలర్ల ముఖవిలువగల 557,32,48,408 షేర్లను కొనుగోలు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో టీఎస్‌హెచ్‌పీ సొంత అనుబంధ సంస్థగా కొనసాగనున్నట్లు పేర్కొంది.

ఈ వార్తలతో టాటా స్టీల్ షేరు బీఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 123 వద్ద ముగిసింది.

మైక్రోసాఫ్ట్‌తో పీడబ్ల్యూసీ ఇండియా జట్టు



న్యూఢిల్లీ: సైబర్‌సెక్యూరిటీ సేవలను మెరుగుపర్చే దిశగా మైక్రోసాఫ్ట్ ఇండియాతో చేతులు కలిపినట్లు పీడబ్ల్యూసీ ఇండియా వెల్లడించింది. సైబర్ ముప్పులను సమర్థంగా ఎదుర్కొనడంలో తమకున్న సామర్థ్యాలు, మైక్రోసాఫ్ట్ అధునాతన టెక్నాలజీల తోడ్పాటుతో కంపెనీలు సురక్షితంగా కార్యకలాపాలు నిర్వహించుకోగలవని పేర్కొంది. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ అయిన మైక్రోసాఫ్ట్ కోపైలట్, ఇన్సిడెంట్ రెస్పాన్స్ ఫీచర్లు ఇందుకు సహాయకరంగా ఉండగలవని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-7-2024

విశాఖ	485-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460-00
వరంగల్	462-00
రిటైల్ ధర	5.20

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DIVISLAB	4,931.00	2.93
BPCL	338.4	2.92
LT	3,775.00	2.58
BAJAJFINSV	1,618.00	1.99
M&M	2,945.00	1.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,482.85	-2.08
TITAN	3,425.95	-1.95
CIPLA	1,553.00	-1.4
ITC	496.25	-1.18
TATACONSUM	1,200.05	-1.12

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	11,273
ఎన్‌ఎస్‌ఈ	1,48,104
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	3,02,716
ఎఫ్ఐఐ	-2,475
డీఐఐ	+5,66

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	75.89 $ (రాత్రి 11.30కు)	77.16 (క్రితం ముగింపు)
బ్రెంట్	79.09 $ (రాత్రి 11.30కు)	80.28 (క్రితం ముగింపు)

ఫైనాన్స్ డిజిటలైజేషన్‌తో కొత్తతరం బ్యాంకింగ్

దీనితో అందరికీ ఆర్థిక సేవల అందుబాటు
- ఇప్పటికే యూపీఐతో అందుతున్న సౌలభ్యతలను చూస్తున్నాం...
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: ఫైనాన్స్‌లో డిజిటలైజేషన్ తదుపరి తరం బ్యాంకింగ్ సంస్కరణలకు మార్గం సుగమం చేస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. తక్కువ వ్యయాలతో అందరికీ ఫైనాన్షియల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ఫైనాన్స్ డిజిటలైజేషన్ దోహదపడుతుందని వివరించారు. 2023-24 కరెన్సీ అండ్ ఫైనాన్స్ రిపోర్ట్ (ఆర్‌సీఎఫ్)లో ఆయన ముందుమాట రాస్తూ, ఫ్లాగ్‌షిప్ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వినియోగదారుల రిటైల్ చెల్లింపుల విధానాన్ని విప్లవాత్మకంగా మార్చిందని పేర్కొన్నారు. ఈ కామర్స్ విభాగ పురోగతినీ ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లావాదేవీలను వేగవంతంగా, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తేలిగ్గా నిర్వహించేలా చేసిందని గవర్నర్ చెప్పారు. డిజిటల్ కరెన్సీ రంగంలో ఈ-రూపాయి, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీల(సీబీడీసీ) ప్రయోగాత్మక అమల్లో రిజర్వ్ బ్యాంక్ ముందంజలో ఉందని అన్నారు. ఓపెన్ క్రెడిట్ ఎనేబుల్‌మెంట్ నెట్‌వర్క్, డిజిటల్ కామర్స్ కోసం ఓపెన్ నెట్‌వర్క్, ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ కోసం పబ్లిక్ టెక్ ప్లాట్‌ఫామ్ వంటి కార్యక్రమాలతో డిజిటల్ రుణ వ్యవస్థ శక్తివంతంగా మారుతోందన్నారు. బ్యాంకులు అలాగే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో (ఎన్‌బీఎఫ్‌సీ) లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్లుగా ఫిన్‌టెక్‌లు సహకరిస్తున్నాయని అన్నారు. ఇదే సమయంలో ఇప్పుడు డిజిటలైజేషన్ ఎదుర్కొంటున్న సైబర్ సెక్యూరిటీ, డేటా గోప్యత, డేటా బయాస్, వెండర్, థర్డ్-పార్టీ రిస్కులు వంటి సవాళ్లను పరిష్కరించాల్సి ఉందని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. మరోవైపు డిజిటల్ విప్లవంలో భారత్ ముందంజలో ఉందని నివేదిక పేర్కొంది. భారత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పదో వంతు వాటా కలిగి ఉందని 2026 నాటికి ఇది ఐదవ వంతుగా పురోగమిస్తుందని నివేదిక అంచనావేసింది.

ఆర్‌బీఐ ప్రస్థానంపై వెబ్ సిరీస్

రిజర్వ్ బ్యాంక్ తన తొంభై ఏళ్ల ప్రస్థానంపై అయిదు ఎపిసోడ్ల వెబ్ సిరీస్‌ను రూపొందించడంపై కసరత్తు చేస్తోంది. ఒక్కో ఎపిసోడ్ 25-30 నిమిషాల నిడివితో ఈ సిరీస్ సుమారు మూడు గంటలు ఉంటుంది. దీన్ని జాతీయ టీవీ ఛానల్స్, ఓటీటీ ప్లాట్‌ఫాంలలో ప్రసారం చేసే యోచన ఉన్నట్లు సిరీస్ నిర్మాణానికి టెండర్లను ఆహ్వానిస్తూ జారీ చేసిన పత్రంలో ఆర్‌బీఐ తెలిపింది. ఎకానమీలో రిజర్వ్ బ్యాంక్ ప్రాధాన్యత, దాని కార్యకలాపాలు మొదలైన వాటి గురించి అవగాహన కలిగించే విధంగా ఈ సిరీస్ ఉంటుంది. 1935లో ఏర్పాటైన ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌లో 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

విద్యుత్, ఇంధన రంగాల్లో ఉపాధి అవకాశాలు

ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య 9 శాతం అధికం
- ఇంజనీర్లకు ఎక్కువ డిమాండ్
- టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక వెల్లడి



ముంబై: విద్యుత్, ఇంధన రంగాల్లో ఈ ఏడాది నియామకాలు సానుకూలంగా ఉండనున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య) ఈ రంగాల్లో నియామకాలు, క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 9 శాతం పెరుగుతాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ 'ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్' నివేదిక తెలిపింది. 2070 నాటికి సున్నా కర్బన ఉద్గారాల (నెట్ జీరో) లక్ష్యం దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉపాధి అవకాశాలకు మద్దతుగా నిలుస్తాయని ఈ నివేదిక పేర్కొంది. దేశ లక్ష్యాలకు అనుగుణంగా ఇంధన రంగం గణనీయమైన మార్పు దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపింది. 23 రంగాలకు చెందిన 1,417 కంపెనీల ప్రతినిధులను అడిగి టీమ్‌లీజ్ ఈ నివేదికను రూపొందించింది.

ఢిల్లీలో అధికం

ఇంధన, విద్యుత్ రంగాల్లో ప్రస్తుత ఉపాధి అవకాశాల పరంగా ఢిల్లీ 56 శాతంతో అగ్రస్థానంలో ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. బెంగళూరు 53 శాతం, ముంబై 52 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ రంగంలో కొత్త ఉపాధి అవకాశాల పరంగా జైపూర్ 14 శాతంతో ముందుంది. బెంగళూరు, చెన్నై, వదోదర 13 శాతంతో వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మెట్రోల్లో వృద్ధి అవకాశాలను గుర్తు చేస్తూనే, ద్వితీయ శ్రేణి పట్టణాలు కొత్త అవకాశాలు వేదికగా నిలుస్తున్నట్టు టీమ్‌లీజ్ నివేదిక పేర్కొంది. మౌలిక వసతుల అభివృద్ధి, విధానపరమైన ప్రోత్సాహకాలు, పునరుత్పాదక ఇంధన వనరుల విస్తరణ ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపింది.

ఆర్థిక వృద్ధికి మద్దతు..

''విద్యుత్, ఇంధన రంగాల్లో 9 శాతం మేర ఉపాధి అవకాశాల విస్తరణ అన్నది పర్యావరణ అనుకూల భవిష్యత్ దిశగా స్పష్టమైన మార్గాన్ని సూచిస్తోంది. 62 శాతం పరిశ్రమ ప్రతినిధులు తమ సిబ్బందిని పెంచుకుంటున్నట్టు చెప్పారు. ఇండస్ట్రీ 4.0, క్రమానుగతంగా కర్బన రహితంగా మారాలన్న లక్ష్యాలు విద్యుత్, ఇంధన రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంచుతున్నాయి. తద్వారా ఆర్థిక వృద్ధికి మద్దతుగా నిలుస్తున్నాయి'' అని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ పి.సుబ్బురాతినమ్ తెలిపారు. విద్యుత్, ఇంధన రంగాల్లో ఇంజనీర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. టీమ్‌లీజ్ సర్వేలో పాల్గొన్న వారిలో 67 శాతం వృద్ధి అవకాశాల గుర్తించి ప్రస్తావించారు. ఆ తర్వాత సేల్స్ (అమ్మకాలు) విభాగంలో ఎక్కువ డిమాండ్ ఉంది. ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రిక్ వాహన మౌలిక వసతులు, ప్రీమియమైజేషన్ (ఖరీదైన ఉత్పత్తుల వినియోగం) ధోరణితో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయని ఈ నివేదిక తెలిపింది.

సెనోరెస్ ఫార్మా ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ కంపెనీ సెనోరెస్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుమతించమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 500 కోట్ల ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 27 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ప్రాస్పెక్టస్ ప్రకారం ప్రీఐపీవో ప్లేస్‌మెంట్‌లో భాగంగా రూ. 100 కోట్లను సమీకరించే యోచనలో ఉంది. దీంతో ఐపీవో పరిమాణాన్ని కుదించే అవకాశముంది. అర్హతగల కంపెనీ ఉద్యోగులకు కొంతమేర షేర్లను రిజర్వ్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో కొంతమేర అట్లాంటాలోని స్టెరైల్ ఇంజక్షన్ల తయారీ ప్లాంటు ఏర్పాటుకు వెచ్చించనుంది. ఈ బాటలో అనుబంధ సంస్థల వర్కింగ్ క్యాపిటల్, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు సైతం నిధులు వినియోగించనుంది.

ఇన్వెస్టర్ల కోసం సెబీ 'సేవ' చాట్‌బాట్

న్యూఢిల్లీ: మార్కెట్ సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు ఇన్వెస్టర్ల సౌకర్యార్థం 'సేవ' పేరిట కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చాట్‌బాట్‌ను సెబీ ఆవిష్కరించింది. ఇది ప్రస్తుతం సెక్యూరిటీల మార్కెట్, తాజా మాస్టర్ సర్క్యులర్లు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలు మొదలైన వాటి గురించి సమాచారాన్ని ఇవ్వగలదు. యూజర్ల నుంచి వచ్చే అభిప్రాయాల మేరకు మరిన్ని అంశాలను దీనికి చేర్చనున్నట్లు సెబీ తెలిపింది.

లిస్టెడ్ కంపెనీగానే ఇండియా సిమెంట్స్

స్పష్టం చేసిన అల్ట్రాటెక్ సిమెంట్



న్యూఢిల్లీ: దక్షిణాదిన కార్యకలాపాలు విస్తరించిన ఇండియా సిమెంట్స్(ఐసీఎల్) స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టెడ్ కంపెనీగా కొనసాగుతుందని అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా పేర్కొంది. ఐసీఎల్‌ను డీలిస్ట్ చేసే యోచనలేదని ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ దిగ్గజం తెలియజేసింది. వారాంతాన ఐసీఎల్ ప్రమోటర్ల నుంచి 32.72 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అల్ట్రాటెక్ వెల్లడించిన నేపథ్యంలో లిస్టింగ్ అంశానికి ప్రాధాన్యత ఏర్పడింది. డీల్ విలువ రూ. 3,954 కోట్లుకాగా.. ఇప్పటికే ఐసీఎల్‌లో 23 శాతం వాటా కలిగిన అల్ట్రాటెక్ దీంతో నిబంధనల ప్రకారం పబ్లిక్ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. షేరుకి రూ. 390 ధరలో 8.05 కోట్ల షేర్లను కొనుగోలు చేయనుంది. ఇందుకు అల్ట్రాటెక్ రూ. 3,142 కోట్లకుపైగా వెచ్చించనుంది. అయితే ఐపీఎల్ క్రికెట్ టీమ్.. చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) యాజమాన్యంలో ఎలాంటి మార్పు ఉండబోదని తెలుస్తోంది. ఐసీఎల్ ప్రమోటర్ ఎన్.శ్రీనివాసన్, కుటుంబ సభ్యులు ప్రమోటర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. అల్ట్రాటెక్ తరఫున ఓపెన్ ఆఫర్‌ను చేపట్టిన యాక్సిస్ క్యాపిటల్.. ఐసీఎల్‌ను డీలిస్ట్ చేసే యోచనలేదన్న విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. పూర్తిస్థాయిలో ఓపెన్ ఆఫర్ విజయవంతమైతే ఐసీఎల్‌లో అల్ట్రాటెక్ వాటా 81.49 శాతానికి చేరే వీలుంది!

బీఎస్‌ఈలో ఐసీఎల్ షేరు 0.7 శాతం నీరసించి రూ. 372 వద్ద ముగిసింది. ఓపెన్ ఆఫర్ ధరతో పోలిస్తే ఇది 4.6 శాతం డిస్కౌంట్.

గ్రామీణ మార్కెట్‌పై ఎఫ్‌ఎంసీజీ ఆశలు

6 శాతం వృద్ధి అంచనాలు
- గతేడాది 4.4 శాతమే
- ప్రీమియం ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ
- కాంటార్ వరల్డ్ ప్యానెల్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంసీజీ విక్రయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పుంజుకుంటాయని కాంటార్ వరల్డ్ ప్యానెల్ నివేదిక అంచనావేసింది. అమ్మకాల్లో 6.1 శాతం వృద్ధి ఉండొచ్చని తెలిపింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో విక్రయాలు 4.4 శాతం పెరిగినట్టు వెల్లడించింది. ఇక పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల విక్రయాలు ఫ్లాట్‌గా 4.2 శాతం మేర వృద్ధిని నమోదు చేయవచ్చంటూ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కసారి స్థిరత్వం నెలకొంటే అక్కడి నుంచి భారీ మార్పు కనిపించొచ్చని అభిప్రాయపడింది. పట్టణాలతో సమానంగా సమీప భవిష్యత్తులో పల్లెల్లోనూ అమ్మకాలు ఊపందుకోవచ్చని తెలిపింది. ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమకు సగం అమ్మకాలు గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నట్టు గుర్తు చేసింది. ఎఫ్‌ఎంసీజీలో వృద్ధి జనాభా ఆధారంగానే ఉంటుంది కానీ, వినియోగం ఆధారంగా కాదని వివరించింది.

ఇవీ సమస్యలు..

ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, గ్రామీణ గృహ పరిమాణంలో తగ్గుదల, యుటిలిటీల కోసం (టెలిఫోన్, విద్యుత్, పెట్రోల్ తదితర) ఎక్కువగా ఖర్చు చేస్తుండడం, పొదుపుపై ఎక్కువగా దృష్టి పెట్టడం గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంసీజీ వినియోగంలో స్తబ్దతకు కారణాలుగా కాంటార్ నివేదిక పేర్కొంది. కరోనా విపత్తు తర్వాత నుంచి గ్రామీణ మార్కెట్లలో ఎఫ్‌ఎంసీజీ వినియోగం పడిపోవడం తెలిసిందే. గత ఆర్థిక సంవత్సరంలోనే ఇది పుంజుకుంది.

ప్రీమియం ఉత్పత్తులకు ఆదరణ

ఇతర రంగాల మాదిరే ఎఫ్‌ఎంసీజీలోనూ ప్రీమియమైజేషన్ (నాణ్యమైన, ఖరీదైన బ్రాండ్ల వైపు మొగ్గు) ధోరణి వృద్ధి చెందుతోందని కాంటార్ నివేదిక తెలిపింది. ఇది మెరుగైన జీవన ప్రమాణాలను తెలియజేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. కొన్ని విభాగాలు వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని ఇస్తున్నట్టు, దీంతో ప్రీమియం ఉత్పత్తులకు ఎక్కువ చెల్లించేందుకు ముందుకు వస్తున్నట్టు తెలిపింది. ఆహారం, ఫేస్ స్క్రబ్/పీల్/మాస్క్, బాడీ వాష్, హెయిర్ కండీషనింగ్ సిరమ్, ముసేలి, కొరియన్ నూడుల్స్‌ను ఉదాహరణలుగా పేర్కొంది.

త్రైమాసిక ఫలితాలు

ఏసీసీ లాభం నేలచూపు

క్యూ1లో రూ. 361 కోట్లు



న్యూఢిల్లీ: సిమెంట్ రంగ దిగ్గజం ఏసీసీ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 22 శాతంపైగా క్షీణించి రూ. 361 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో అదానీ గ్రూప్ సంస్థ రూ. 466 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 5,201 కోట్ల నుంచి నామమాత్రంగా తగ్గి రూ. 5,155 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 2 శాతం పెరిగి రూ. 4,741 కోట్లను దాటాయి. ఈ కాలంలో సిమెంట్, క్లింకర్ అమ్మకాలు 9 శాతం ఎగసి 10.2 మిలియన్ టన్నులను తాకాయి. గత ఐదేళ్లలో తొలి క్వార్టర్‌కు ఇవి అత్యధిక అమ్మకాలుకావడం గమనార్హం! సిమెంట్ బిజినెస్ ఆదాయం రూ. 4,852 కోట్లకు చేరగా.. రెడీమిక్స్ నుంచి 329 కోట్లు లభించింది.

ఫలితాల నేపథ్యంలో ఏసీసీ షేరు బీఎస్‌ఈలో 0.4 శాతం క్షీణించి రూ. 2,604 వద్ద ముగిసింది.

హెచ్‌పీసీఎల్ లాభం పతనం

క్యూ1లో రూ. 634 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం(హెచ్‌పీసీఎల్) ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 90 శాతం క్షీణించి రూ. 634 కోట్లకు పరిమితమైంది. రిఫైనరీ మార్జిన్లు క్షీణించడానికితోడు, ఇంధన ధరల తగ్గింపుతో మార్జిన్లు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో దాదాపు రూ. 6,766 కోట్లు ఆర్జించింది. ప్రతీ బ్యారల్ చమురు శుద్ధిపై స్థూల మార్జిన్లు(జీఆర్‌ఎం) 5.03 డాలర్లుగా నమోదైంది. గత క్యూ1లో 7.44 జీఆర్‌ఎం సాధించింది. 6.7 శాతం అధికంగా 5.67 మిలియన్ టన్నుల ముడిచమురును రిఫైన్ చేసింది. అయితే ఈ కాలంలో ఎగుమతులతో కలసి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 12.63 మిలియన్ టన్నుల అమ్మకాలను సాధించింది. ఇది 6.6 శాతం వృద్ధి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు బీఎస్‌ఈలో 1.3 శాతం లాభంతో రూ. 381 వద్ద ముగిసింది.

నష్టాల నుంచి బయటపడ్డ స్ట్రైడ్స్ ఫార్మా



న్యూఢిల్లీ: స్ట్రైడ్స్ ఫార్మా జూన్ త్రైమాసికంలో రూ.84 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.30 కోట్ల మేర నష్టాలను చవిచూడడం గమనార్హం. ఆదాయం 16 శాతం మేర వృద్ధి చెంది రూ.1,087 కోట్లకు చేరింది. లాభదాయకత, సామర్థ్యాలు, వృద్ధిపై దృష్టి సారించడంతో అన్ని మార్కెట్లలోనూ బలమైన పనితీరుకు దారితీసినట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ అరుణ్ కుమార్ తెలిపారు. వ్యాపార నాణ్యతను పెంచుకోవడం ద్వారా ఇదే విధమైన పనితీరును కొనసాగించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. డిజిటైజేషన్, ఆటోమేషన్‌పై దృష్టి సారించినట్టు సంస్థ ఎండీ, సీఈవో బద్రీ కొమండూర్ తెలిపారు.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు ఒక శాతం లాభపడి రూ.1,034 వద్ద క్లోజయింది.

మెప్పించిన కోల్గేట్ పామోలివ్



న్యూఢిల్లీ: కోల్గేట్ పామోలివ్ మెరుగైన పనితీరు ప్రదర్శించింది. జూన్ త్రైమాసికంలో రూ.364 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.274 కోట్లతో పోల్చి చూస్తే 33 శాతం వృద్ధి చెందింది. ఆదాయం సైతం 13 శాతం పెరిగి రూ.1,486 కోట్లకు చేరింది. ''జూన్ త్రైమాసికంలో గ్రామీణ మార్కెట్లలో డిమాండ్ పుంజుకోవడం కొనసాగింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే మెరుగైన వృద్ధి నమోదైంది. దీనికితోడు టూత్‌పేస్ట్, టూత్‌బ్రష్, పర్సనల్ కేర్ విభాగాల్లో చక్కని పనితీరు ఆదాయంలో 13 శాతం వృద్ధికి దారితీసింది''అని కోల్గేట్ పామోలివ్ ఇండియా తెలిపింది. వ్యయాలు 8 శాతం పెరిగి రూ.1,031 కోట్లుగా ఉన్నాయి. ముఖ్యంగా టూత్‌పేస్ట్ విభాగంలో రెండంకెల వృద్ధి నమోదైనట్టు కంపెనీ ఎండీ, సీఈవో ప్రభా నరసింహన్ తెలిపారు. ఉత్పత్తి శ్రేష్టత, బ్రాండ్ బలోపేతం, ఆవిష్కరణలపై తాము చేసిన పెట్టుబడులు మంచి ఫలితాలనిస్తున్నట్టు చెప్పారు. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కోల్గేట్ పామోలివ్ షేరు ఒకటిన్నర శాతం మేర లాభపడి రూ.3,209 వద్ద ముగిసింది.

అదానీ విల్‌మార్.. అదుర్స్

వంట నూనెల విభాగంలో బలమైన పనితీరు



న్యూఢిల్లీ: ఆహారం, వంటనూనెలు, ఎఫ్‌ఎంసీజీ విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహించే అదానీ విల్‌మార్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో అంతమైన మూడు నెలల కాలానికి రూ.313 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.79 కోట్ల మేర నష్టాలను ఎదుర్కోవడంతో పోలిస్తే.. పనితీరు గణనీయంగా మెరుగుపడినట్టు తెలుస్తోంది. ఆదాయం రూ.12,994 కోట్ల నుంచి రూ.14,230 కోట్లకు వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే.. వంట నూనెల విభాగం ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.10,649 కోట్లకు చేరింది. ఫుడ్, ఎఫ్‌ఎంసీజీ విభాగం ఆదాయం 40 శాతం వృద్ధితో రూ.1,533 కోట్లకు చేరింది. బ్రాండెడ్ స్టాపుల్స్ (ప్రధాన ఆహార పదార్థాలు) వైపు వినియోగదారులు మళ్లుతుండడం తమకు కలిసొస్తున్నట్టు అదానీ విల్‌మార్ ఎండీ, సీఈవో అంగ్షు మాలిక్ పేర్కొన్నారు. వంట నూనెలు, ఫుడ్, ఎఫ్‌ఎంసీజీలో రెండంకెల వృద్ధిని నమోదు చేసినట్టు చెప్పారు. ముఖ్యంగా వంట నూనెల ధరల్లో స్థిరత్వం మెరుగైన ఫలితాలకు దారితీసింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కంపెనీ షేరు 6 శాతం పెరిగి రూ.344 వద్ద ముగిసింది.

అరవింద్ లాభం డౌన్

క్యూ1లో రూ. 44 కోట్లు



న్యూఢిల్లీ: టెక్స్‌టైల్స్ రంగ కంపెనీ అరవింద్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 37 శాతంపైగా క్షీణించి రూ. 44 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ.70 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం నామమాత్ర(1 శాతం) క్షీణతతో రూ. 1,831 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 1,853 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఉద్యోగుల సమ్మె, సాధారణ ఎన్నికలు పనితీరును దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది. ప్రధానంగా సమ్మె ప్రభావంతో సుమారుగా ఆదాయంలో రూ. 200 కోట్లు, నిర్వహణ లాభంలో రూ. 60 కోట్లు చొప్పున నష్టపోయినట్లు తెలియజేసింది. కాగా.. మొత్తం వ్యయాలు నామమాత్రంగా పెరిగి రూ. 1,790 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో అరవింద్ షేరు బీఎస్‌ఈలో 3.3 శాతం క్షీణించి రూ. 374 వద్ద ముగిసింది.

అదానీ టోటల్ గ్యాస్ ఫర్వాలేదు

లాభంలో 20 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లో భాగమైన అదానీ టోటల్ గ్యాస్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. పట్టణ గ్యాస్ పంపిణీ విభాగంలో సేవలు అందిస్తున్న ఈ కంపెనీ రూ.177 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.148 కోట్లతో పోల్చి చూసినప్పుడు 20 శాతం వృద్ధి చెందింది. సీఎన్‌జీ, పైప్డ్ వంట గ్యాస్ విక్రయాలు పెరగడం ఇందుకు కలిసొచ్చింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 9 శాతం పెరిగి రూ.1,237 కోట్లకు చేరుకుంది. సీఎన్‌జీ విక్రయాలు 20 శాతం పెరిగి 153 మిలియన్ స్టాండర్డ్ క్యుబిక్ మీటర్లు (ఎంఎంఎస్‌సీఎం)గా ఉన్నట్టు కంపెనీ తెలిపింది. పైప్డ్ వంట గ్యాస్ విక్రయాలు 11 శాతం పెరిగి 77 ఎంఎంఎస్‌సీఎంగా ఉన్నట్టు పేర్కొంది. సీఎన్‌జీ నెట్‌వర్క్ 559 స్టేషన్లకు విస్తరించింది. జూన్ క్వార్టర్‌లో కొత్తగా 12 సీఎన్‌జీ స్టేషన్లను ప్రారంభించింది. పైపుల ద్వారా వంటగ్యాస్ పంపిణీ 8.58 లక్షల ఇళ్లకు చేరింది. కొత్తగా 38,165 గృహ కనెక్షన్లను పెంచుకుంది. బీఎస్‌ఈలో అదానీ టోటల్ గ్యాస్ షేరు అర శాతం లాభపడి రూ.893 వద్ద క్లోజయింది.

అడ్మిషన్స్

కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్)-2025

దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీల్లో.. లా యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025 పరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది.

- **అర్హత:** యూజీ కోర్సులకు 10+2, పీజీ కోర్సులకు ఎల్ఎల్‌బీ డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.07.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2024.
- **పరీక్ష తేది:** 01.12.2024.
- **వెబ్‌సైట్:** consortiumofnlus.ac.in

ఇన్‌స్పైర్ మనక్ ప్రతిపాదనలకు ఆహ్వానం

వినూత్న ఆలోచనలు చేయడం, నూతన ఆవిష్కరణలపై ఆసక్తి ఉండి, శాస్త్రవేత్తలుగా రాణించాలనుకునే విద్యార్థులకు ఇన్‌స్పైర్ మనక్ మంచి వేదిక. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్, గురుకులాల తదితర పాఠశాలల విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్నత పాఠశాలల నుంచి ఐదు చొప్పున, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు చొప్పున నామినేషన్లను స్వీకరిస్తారు.

పరిశోధనకు ప్రోత్సాహకం

- జిల్లా స్థాయిలో నిర్వహించిన నమూనా ప్రదర్శనల్లో ఉత్తమంగా ఉన్నవాటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ ప్రతిభ చాటితే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఈ స్థాయి ప్రాజెక్ట్‌లకు ప్రభుత్వం పెటెంట్ హక్కులను ఇస్తుంది.
- జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తే రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కలుసుకునే అవకాశం లభిస్తుంది.
- జాతీయ స్థాయిలో ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన విద్యార్థులకు రూ.25 వేలు వరకు శాస్త్ర, సాంకేతిక మండలిశాఖ అదనపు నిధులను కేటాయిస్తుంది.

దరఖాస్తు ఇలా

2024, సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలి. పాఠశాల అథారిటీ ఐచ్చికాన్ని క్లిక్ చేసి వన్‌టైం రిజిస్ట్రేషన్ చేసి, పాఠశాల వివరాలను పొందుపర్చాలి. జిల్లా విద్యాశాఖ నుంచి ఆమోదం వచ్చిన తర్వాత ఈమెయిల్, యూజర్ ఐడీతో లింక్ రాగానే పాస్‌వర్డ్ నమోదు చేయాలి. దీని తర్వాత ప్రాజెక్ట్ నమూనాకు సంబంధించిన వివరాలను పొందుపర్చాలి.

- **వెబ్‌సైట్:** https://www.inspireawards-dst.gov.in

కరెంట్ అఫైర్స్



అంతర్జాతీయం

యునెస్కో వారసత్వ సంపదగా అహోమ్ సమాధులు

అహోమ్ చక్రవర్తుల సమాధులకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గుర్తింపు లభించింది. ఈశాన్య అస్సాంలో ఉన్న ఈ ప్రాంతం.. కల్చరల్ ప్రాపర్టీ కేటగిరీలో యునెస్కో గుర్తింపు పొందింది. ఈజిప్ట్ పిరమిడ్స్ తరహాలో తూర్పు అస్సాంను పాలించిన అహోమ్ చక్రవర్తులు ఇక్కడ తమ పూర్వీకుల సమాధులను కట్టారు. 'చరాయిడియో మైదమ్'ను చక్రవర్తుల ఖనన ప్రదేశంగా పిలుస్తారు. మైదమ్ అంటే పుట్ట తరహాలో భూమిపై ఎత్తుగా ఉంటుంది. తూర్పు అస్సాం ప్రాంతాన్ని సుమారు 600 ఏళ్ల పాటు అహోమ్ రాజులు పాలించారు. బ్రిటీషర్ల రాకకు పూర్వం ఇక్కడ ఆ రాజుల పాలనే ఉండేది. పిరమిడ్స్ తరహాలో ఇక్కడ సమాధులను నిర్మించారు. తాజాగా వీటికి గుర్తింపుతో భారత్‌లో యునెస్కో వారసత్వ గుర్తింపు పొందిన ప్రాంతాల సంఖ్య 43కి చేరింది.

దేశంలో పెరిగిన అటవీ విస్తీర్ణం

భారత్‌లో అటవీ విస్తీర్ణం పెరిగింది. 2010 నుంచి 2020 వరకు దేశంలో సుమారు 2.66 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం పెరిగినట్లు ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో) తన నివేదికలో పేర్కొంది. అటవీ శాతం పెరిగిన టాప్ 10 దేశాల్లో ఇండియా మూడో స్థానంలో ఉంది. జూలై 22న విడుదలైన నివేదికలో చైనా మొదటి స్థానంలో నిలిచింది. చైనాలో 19,37,000 హెక్టార్ల మేర అటవీ విస్తీర్ణం పెరిగినట్లు ఎఫ్ఏవో నివేదిక పేర్కొంది. ఆ తర్వాత రెండవ స్థానంలో ఆస్ట్రేలియా ఉంది. ఆస్ట్రేలియాలో 4,46,000 హెక్టార్ల మేర అటవీ ప్రాంతం పెరిగింది. టాప్ టెన్ దేశాల్లో చిలీ, వియత్నాం, టర్కీ,అమెరికా, ఫ్రాన్స్,ఇటలీ,రొమేనియా ఉన్నాయి.

అత్యంత వేడి దినంగా జూలై 22

గత 84 ఏళ్లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజుగా జూలై 22వ తేదీ రికార్డు సృష్టించింది. ఆ రోజున ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 17.15 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైనట్లు యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ (సీ3ఎస్) తెలిపింది. 1940 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజు జూలై 22 అని సీ3ఎస్ తెలిపింది.

సింగపూర్ పాస్‌పోర్టు.. పవర్ ఫుల్

ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాను హెన్లే-పార్ట్నర్ సంస్థ (లండన్) విడుదల చేసింది. హెన్లే పాస్‌పోర్ట్ ఇండెక్స్ ప్రకారం-భారత పాస్‌పోర్ట్‌కు 82వ స్థానం దక్కింది. భారతీయ పాస్‌పోర్ట్‌తో 58 దేశాల్లో వీసా లేకుండా ప్రయాణించొచ్చు. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ డేటా ఆధారంగా ర్యాంక్‌లను రూపొందించారు. ప్రస్తుతం సెనగల్, తజికిస్తాన్ దేశాల ర్యాంక్‌లతో ఇండియా ర్యాంక్ సమంగా ఉంది. అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌ల్లో సింగపూర్ మొదటి స్థానం సొంతం చేసుకుంది. సింగపూర్ పాస్‌పోర్ట్‌తో 195 దేశాల్లో వీసా లేకుండానే ప్రయాణించొచ్చు.రెండో స్థానంలో జపాన్‌తోపాటు ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాలు ఉన్నాయి. ఈ దేశాలు పాస్‌పోర్ట్‌లు ఉన్నవారు 192 దేశాల్లో వీసా ఫ్రీ ఎంట్రీ ఇవ్వవచ్చు.

సముద్రం అట్టడుగున డార్క్ ఆక్సిజన్

సముద్రం అట్టడుగున డార్క్ ఆక్సిజన్ ఉత్పత్తి కావటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దాదాపు 13 వేల అడుగుల లోతున ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్‌ను డార్క్ ఆక్సిజన్ అంటారు. ఎలాంటి జీవి ప్రమేయం లేకుండా.. సూర్యరశ్మి పడకుండా పసిఫిక్ మహా సముద్రంలో ప్రాణవాయువు ఉత్పత్తి కావటమే అందుకు కారణం. దీన్ని బట్టి సముద్రపు అడుగు భాగంలో ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయొచ్చన్న అభిప్రాయం బలపడుతోందని స్కాటిష్ అసోసియేషన్ ఫర్ మెరైన్ సైన్సెస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2013లోనే తొలిసారిగా దీన్ని గుర్తించగా.. పూర్తి అధ్యయనం తర్వాత ఈ అంశాన్ని ఓ జర్నల్‌లో ప్రచురించారు.

జాతీయం

కేంద్ర ఆర్థిక సర్వే 2023-24

దేశ ఆర్థిక వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేదిగా భావించే ఆర్థిక సర్వే 2023-24ను కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ జూలై 22వ తేదీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలో ఈ నివేదికను రూపొందించారు. బడ్జెట్‌లో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'పై చాలా నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ..'ఆర్థిక సర్వేలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను దేశ వాస్తవ జీడీపీ 6.5-7 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. బడ్జెట్ 2024-25లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై చాలా నిర్ణయాలు తీసుకున్నాం. దాదాపు 11 దశల్లో దీనిపై చర్చలు జరిగాయి. ముఖ్యంగా 63 నేరాలను డీక్రిమినైజేషన్ చేయడం వల్ల ప్రస్తుతం కంపెనీలు సమర్థంగా కొనసాగుతున్నాయి' అన్నారు.

'షింకున్ లా టన్నెల్' ప్రాజెక్టును ప్రారంభించిన మోదీ

ద్రాస్ సెక్టార్‌లో జూలై 26న 25వ కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న ప్రధాని మోదీ.. షింకున్ లా టన్నెల్ ప్రాజెక్టు పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. లేహ్‌కు వెళ్లే రూట్‌లో ఈ టన్నెల్‌ను నిర్మిస్తున్నారు. ఈ టన్నెల్ సుమారు 4.1 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను సుమారు 15,800 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నారు. నిమి-పదుం-దర్చా రోడ్డు మార్గంలో ఈ టన్నెల్‌ను నిర్మిస్తున్నారు. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా టన్నెల్ ద్వారా లేహ్‌కు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది.

దర్బార్ హాల్, అశోక్‌హాల్ పేర్లు మార్పు

రాష్ట్రపతి భవన్‌లోని రెండు హాళ్ల పేర్లను మార్చారు. దర్బార్ హాల్‌ను 'గణతంత్ర మండపం'గా.. అశోక హాల్‌ను 'అశోక మండపం'గా నామకరణం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి సెక్రటేరియట్ ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి భవన్ వాతావరణాన్ని భారతీయ సాంస్కృతిక విలువలు, తత్వాలను ప్రతిబింబించేలా చేసే ప్రయత్నమే ఇదని వివరించింది. దర్బార్ హాల్‌ను జాతీయ అవార్డులు ప్రదానం చేసేందుకు, ముఖ్యమైన వేడుకలు నిర్వహించేందుకు ఉపయోగిస్తుండగా.. అశోక్ హాల్ ఓ బాల్‌రూమ్‌గా ఉపయోగపడుతోంది.

రోహిణి-560 రాకెట్ పరీక్ష విజయవంతం

ఇస్రో శాస్త్రవేత్తలు జూలై 22వ తేదీన శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి రోహిణి-560 సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. దేశీయంగా తాము అభివృద్ధి చేసిన ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీని ప్రయోగించడమే ప్రయోగం లక్ష్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ రెండు దశల ఉప కక్ష్య సౌండింగ్ రాకెట్‌కు రెండు వైపులా ప్రొపల్షన్ వ్యవస్థలు సాలిడ్ మోటార్లు ఉంటాయి. ఇప్పటి వరకు తాము ప్రయోగించిన అతి భారీ సౌండింగ్ రాకెట్ ఇదేనని అన్నారు. ప్రయోగం సందర్భంగా రాకెట్ పనితీరును పరిశీలించేందుకు పరిగణనలోకి తీసుకున్న 110 పరామితులను సాధించామన్నారు.

యూనియన్ బడ్జెట్ 2024-25

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. జూలై 23న లోక్‌సభలో బడ్జెట్ 2024-25ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ మొత్తంలో వివిధ రంగాలన్నింటికి కలిపి రూ.48.21 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. అంటే.. స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు. ఇందులో మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లుగా.. దానిలో పన్ను ఆదాయాన్ని రూ.28.83 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని బడ్జెట్‌లో అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా కట్టారు. అదేవిధంగా నూతన పింఛన్ విధానంలో త్వరలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. సంప్రదింపుల కమిటీ సిఫార్సుల ఆధారంగా త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల విధానంలోనూ, ఇతర దేశాల్లో భారత్ పెట్టుబడుల విధానంలోనూ సరళీకరణలు తీసుకురానున్నట్లు వెల్లడించారు. వాణిజ్య అనుకూల విధానాలకు జన్ విశ్వాస్ బిల్లుతో మరిన్ని సంస్కరణలు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. యూఎల్‌పిన్ ద్వారా ప్రతి భూకమతానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి భూకమతానికి భూ ఆధార్ ద్వారా గుర్తింపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్య కోసం రూ.10 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

రూ.2.62 లక్షల కోట్లతో రైల్వే పద్దు

కొత్త బడ్జెట్‌లో కేంద్రం భారతీయ రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు కేటాయించింది. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం కేటాయింపుల్లో రూ.1.08 లక్షల కోట్ల నిధులను రైల్వే భద్రత వ్యవస్థల మెరుగు, రైల్వే మార్గాల్లో కవచ్ వ్యవస్థ ఇన్‌స్టాలేషన్‌కు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ వ్యవస్థ 'కవచ్' ఇన్‌స్టాలేషనే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతల్లో ఒకటని చెప్పారు. రైల్వే భద్రతా చర్యల్లో భాగంగా పాత ట్రాకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని.. అదేవిధంగా సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగుపరుస్తామని.. రైల్వే ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జ్‌లను నిర్మిస్తామని.. కవచ్ వ్యవస్థను ఇన్‌స్టాల్ చేస్తామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కవచ్4.0 ఇటీవల ఆమోదం పొందిందని, ఇన్‌స్టాలేషన్‌ను త్వరితగతిన చేపడతామని పేర్కొన్నారు.

వార్తల్లో వ్యక్తులు

అమెరికాలో భారత రాయబారిగా వినయ్ క్వాత్రా

భారత విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి వినయ్ క్వాత్రా అమెరికాలో భారత రాయబారిగా నియమితులయ్యారు. ఇదివరకు పనిచేసిన తరణ్ జిత్ సంధు జనవరిలో పదవీ విరమణ చేయడంతో.. ఆ స్థానంలో వినయ్ క్వాత్రాను విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) నియమించింది. 1988లో ఐఎఫ్ఎస్ అధికారిగా విధుల్లో చేరిన వినయ్ క్వాత్రా వివిధ హోదాల్లో పనిచేశారు.

ప్రముఖ ఆర్థికవేత్త సి.టి.కురియన్ కన్నుమూత

ప్రముఖ ఆర్థిక వేత్త, మద్రాస్ క్రిస్టియన్ కళాశాల మాజీ ఆచార్యులు సి.టి.కురియన్ జూలై 23న చెన్నైలో కన్నుమూశారు.

క్రీడలు

ఒలింపిక్ కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నికైన నీతా అంబానీ

రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నీతా అంబానీ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) భారత ప్రతినిధిగా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో భాగంగా వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహించేందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ)సభ్యులను ఎన్నుకున్నారు. అందులో భారత్ తరఫున నీతా అంబానీ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2016లో రియో డి జెనీరోలో జరిగిన ఒలింపిక్ క్రీడల సందర్భంగా.. ఆమె తొలిసారి ఐఓసీ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఐఓసీలో చేరిన మొదటి భారతీయ మహిళగా ఆమె గుర్తింపు పొందారు.



ఎం.బాలలత, సబ్జెక్ట్ నిపుణులు

విద్య, ఉద్యోగ సమాచారం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 94 ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టులు

ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సర్వీస్ బోర్డు దేశవ్యాప్తంగా ఉన్న ఆర్‌బీఐ శాఖల్లో ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు దేశ వ్యాప్తంగా ఉన్న ఆర్‌బీఐ శాఖల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 94.
- **పోస్టుల వివరాలు:** ఆఫీసర్ గ్రేడ్ బి(డీఆర్)-జనరల్-66, ఆఫీసర్ ఇన్ గ్రేడ్ బి(డీఆర్)-డీఈపీఆర్-21, ఆఫీసర్ ఇన్ గ్రేడ్ బి(డీఆర్)-డీఎస్ఐఎం-07.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంఏ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.07.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.55,200 నుంచి రూ.99,750.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.07.2024
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2024.
- **వెబ్‌సైట్:** http://www.rbi.org.in

ఇండియన్ నేవీలో 741 గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టులు

ఇండియన్ నేవీలో గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టుల భర్తీకి సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐఎన్‌సీఈటీ-01/2024) నిర్వహిస్తారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 741.
- **పోస్టుల వివరాలు:** గ్రూప్ బి పోస్టులు: ఛార్జ్‌మ్యాన్(అమ్యూనిషన్ వర్క్‌షాప్)-01, చార్జ్‌మ్యాన్(ఫ్యాక్టరీ)-10, ఛార్జ్‌మ్యాన్(మెకానిక్)-18, సైంటిఫిక్ అసిస్టెంట్-04.
- **గ్రూప్ సీ పోస్టులు:** డ్రాఫ్ట్స్‌మ్యాన్(కన్‌స్ట్రక్షన్)-02, ఫైర్‌మ్యాన్-444, ఫైర్ ఇంజన్ డ్రైవర్-58, ట్రేడ్స్‌మ్యాన్ మేట్-161, పెస్ట్ కంట్రోల్ వర్కర్-18, కుక్-09, ఎంటీఎస్(మినిస్టీరియల్)-16.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఛార్జ్‌మ్యాన్(మెకానిక్), సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. ఫైర్‌మ్యాన్, ఫైర్ ఇంజన్ డ్రైవర్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. మిగిలిన పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.08.2024
- **వెబ్‌సైట్:** https://incet.cbtexam.in

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీలో 8 తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ)లో జూలై-2025 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025, జూలై 1వ తేదీ నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
- **వయసు:** 01.07.2025 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. అంటే.. 02.07.2012 నుంచి 01.01.2014 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వాయిస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** రాతపరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. అవి.. మ్యాథమేటిక్స్(200 మార్కులు), జనరల్ నాలెడ్జ్(75 మార్కులు), ఇంగ్లిష్ (125 మార్కులు) నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైవా వాయిస్(50 మార్కులు) నిర్వహిస్తారు. రాత పరీక్ష, వైవా వాయిస్ కలిపి మొత్తం 450 మార్కులకు ఉంటుంది. కనీస ఉత్తీర్ణతా మార్కులు 50 శాతం ఉండాలి. ఈ రెండింటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు చివరిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
  దరఖాస్తును అసిస్టెంట్ సెక్రటరీ (ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024.
- **పరీక్ష తేది:** 01.12.2024.
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్‌లో 200 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 200.
- **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-12, అస్సాం-05, ఛత్తీస్‌గఢ్-06, గుజరాత్-05, హిమాచల్‌ప్రదేశ్-03, జమ్మూ కశ్మీర్-01, కర్ణాటక-38, మధ్యప్రదేశ్-12, మహారాష్ట్ర-53, పుదుచ్చేరి-01, సిక్కిం-01, తెలంగాణ-31, తమిళనాడు-10, ఉత్తరప్రదేశ్-17, పశ్చిమ బెంగాల్-05.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ సిస్టమ్స్ ఆపరేటింగ్, వర్కింగ్ నాలెడ్జ్ తప్పనిసరిగా ఉండాలి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌లలో సర్టిఫికేట్/డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2024 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** పని ప్రదేశం ఆధారంగా నెలకు రూ.32,000 నుంచి రూ.35,200 ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. మొత్తం 200 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు-40 మార్కులు), లాజికల్ రీజనింగ్(40 ప్రశ్నలు-40 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు-40 మార్కులు), న్యూమరికల్ ఎబిలిటీ(40 ప్రశ్నలు-40 మార్కులు), కంప్యూటర్ స్కిల్(40 ప్రశ్నలు-40 మార్కులు) సబ్జెక్టులు ఉంటాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్‌లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 25.07.2024
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 14.08.2024.
- **ఆన్‌లైన్ పరీక్ష తేది:** సెప్టెంబర్ 2024.
- **వెబ్‌సైట్:** www.lichousing.com

ఎస్‌బీఐలో.. స్పెషలిస్ట్ ఆఫీసర్

ట్రెడిషనల్, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేశారా.. ఆర్థిక రంగంలో పని అనుభవం ఉందా.. బ్యాంకింగ్ రంగంలో సమున్నత అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా! అయితే.. మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది!! అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో మొత్తం 1,040 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎంపికైతే ఆయా పోస్ట్‌ను అనుసరించి రూ.22 లక్షలు-రూ.66 లక్షల వరకు వార్షిక వేతనం అందుకోవచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌లు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, వేతనాలు తదతర వివరాలు..



» 1,040 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్
» ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
» అయిదేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు

ప్రభుత్వ రంగ బ్యాంకులు..సాంప్రదాయ బ్యాంకింగ్ కార్యకలాపాలతో పాటు మరెన్నో విభాగాల్లో సేవలందిస్తున్నాయి. ఆయా విభాగాల్లో కార్యకలాపాలు సజావుగా సాగేందుకు నిపుణులైన అభ్యర్థులను నియమించుకుంటున్నాయి. ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ఆ కోవలోనిదే! బ్యాంకులో కీలకమైన వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఈ పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి భారీ స్థాయిలో వేతనాలు అందించనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య 1,040

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. తాజాగా విడుదల చేసిన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1,040 పోస్ట్‌లను భర్తీ చేయనుంది. వీటిల్లో సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (ప్రొడక్ట్ లీడ్)-2 పోస్టులు, సెంట్రల్ రీసెర్చ్ టీమ్(సపోర్ట్)-2 పోస్టులు, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (టెక్నాలజీ)-1 పోస్టు, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (బిజినెస్)-2 పోస్టులు,రిలేషన్‌షిప్ మేనేజర్-273 పోస్టులు, వైస్ ప్రెసిడెంట్-వెల్త్ -643 పోస్టులు, రిలేషన్‌షిప్ మేనేజర్-టీమ్ లీడ్-32 పోస్టులు, రీజనల్ హెడ్-6 పోస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్-30 పోస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్-49 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు వేర్వేరుగా

- వివిధ పోస్టులకు అర్హతలను కూడా వేర్వేరుగా నిర్దేశించారు. ఆయా పోస్ట్‌లను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/ఎంబీఏ/నిర్దేశిత స్పెషలైజేషన్లలో పీజీ/పీజీడీఎం /పీజీడీబీఎం/బీటెక్/ఎంటెక్/సీఏ/సీఎఫ్ఏ/ ఎన్ఐఎస్ఎం సర్టిఫికెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆయా పోస్ట్‌లను అనుసరించి కనిష్ఠంగా 23ఏళ్లు, గరిష్ఠంగా 50 ఏళ్లు ఉండాలి. విద్యార్హతలు, పని అనుభవం, వయో పరిమితికి సంబంధించి ఏప్రిల్ 1, 2024ను గడువు తేదీగా పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా

ఎస్‌బీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌లకు ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తులను తొలుత వడపోస్తారు. అభ్యర్థులు పొందిన అకడమిక్ మార్కులు, పని అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయించారు. అభ్యర్థుల పని అనుభవం, ఇప్పటివరకు వారు నిర్వర్తించిన విధులు, బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన, వ్యక్తిగత దృక్పథం, వైఖరి వంటి అంశాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత రిజర్వేషన్లు, ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, పని అనుభవం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని తుది నియామకం ఖరారు చేస్తారు.

అయిదేళ్ల కాంట్రాక్ట్

ఎస్‌బీఐ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్ట్‌లకు నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి, నియామకాలు ఖరారు చేసుకున్న వారు అయిదేళ్ల పాటు బ్యాంకులో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మొదటి ఏడాదిని ప్రొబేషన్ కాలంగా పరిగణిస్తారు. ఈ వ్యవధిలో వారు తమకు కేటాయించిన విభాగాల్లో ప్రణాళికల రూపకల్పన, నివేదికలు రూపొందించడం, ఉన్నతాధికారులకు సహకరించడం వంటి బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది.

ముంబై, సర్కిల్ ఆఫీస్‌ల్లో

ఆయా పోస్ట్‌లకు ఎంపికైన వారు బ్యాంకు ప్రధాన కార్యాలయం ముంబైతోపాటు సర్కిల్ కార్యాలయాలల్లోనూ పని చేయాల్సి ఉంటుంది. సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (ప్రొడక్ట్ లీడ్, సపోర్ట్), ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (టెక్నాలజీ), ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (బిజినెస్) పోస్ట్‌ల అభ్యర్థులు ముంబై కార్యాలయంలోనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మిగతా పోస్ట్‌లకు సంబంధించి బ్యాంకు సర్కిల్ ఆఫీస్‌లలో పని చేయాలి. దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు మూడు సర్కిల్ ఆఫీస్‌లను తమ ప్రాథమ్యాలుగా పేర్కొనొచ్చు.

రూ.లక్షల్లో వేతనాలు

సెంట్రల్ రీసెర్చ్ టీమ్ పోస్టుకు (ప్రొడక్ట్ లీడ్)కు రూ.61 లక్షలు; సెంట్రల్ రీసెర్చ్ టీమ్ పోస్టుకు (సపోర్ట్)కు రూ.20.5 లక్షలు; ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (టెక్నాలజీ), ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్(బిజినెస్), రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్ట్‌లకు రూ.30 లక్షలు చొప్పున; వీపీ-వెల్త్‌కు రూ.45 లక్షలు; రిలేషన్‌షిప్ మేనేజర్ -టీమ్‌లీడ్‌కు రూ.52 లక్షలు; రీజనల్ హెడ్‌కు రూ.66.5 లక్షలు; ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్‌కు రూ.44లక్షలు;ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌కు రూ.26.5 లక్షలుగా వార్షిక వేతనాన్ని నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఎస్‌బీఐ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్ట్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎస్‌బీఐ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లోని కెరీర్స్ విభాగంలో ద్వారా ఆ ప్రక్రియ పూర్తి చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్ట్ 8.
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** సెప్టెంబర్ రెండో వారంలో నిర్వహించే అవకాశం.
- **పర్సనల్ ఇంటర్వ్యూ కేంద్రాలు:** ముంబై.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://sbi.co.in/web/careers/current-openings